సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 29

SUNDAY Special

ఆదివారం 21-4-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


పులపర్తి వద్ద వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్

• చెప్పవయ్యా చంద్రబాబూ..!

బచ్చా అంటూ భయమెందుకు?

చింతలపాలెం సిద్ధం సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం

- పొత్తుల కోసం ఎందుకు ఎగబడుతున్నావ్ బాబూ?
- ఉక్రోషం, కడుపు మంటతో నాపై రాళ్లు వేయాలంటున్నాడు.. నన్ను దహనం చేస్తానంటున్నాడు.. జగన్‌ను కొట్టటానికి.. హాని చేయటానికి.. దోపిడీ కోసమే వాళ్లకు అధికారం కావాలట
- ఇదీ చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ ఎజెండా

- 3లో



వయనాడూ తరిమికొడుతుంది

అమేథీ తరహాలోనే కేరళలోని వయనాడ్ ఎంపీ స్థానం నుంచీ రాహుల్ గాంధీ పారిపోవడం ఖాయమని ప్రధాని విమర్శించారు.

- వివరాలు 6లో



మోదీ అవినీతి పాఠశాల

దేశంలో 'అవినీతి పాఠశాల'ను ప్రధాని నరేంద్ర మోదీ నడుపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

- వివరాలు 6లో



దూరదర్శన్ లోగో రంగుపై రగడ

దూరదర్శన్ లోగో కాషాయ వర్ణంలోకి మారడం వెనక అధికార బీజేపీ కుట్ర ఉందంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

- వివరాలు 6లో



మీమ్స్ ఎలక్షన్ మేనియా

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమాల్లో మీమ్స్‌తో హోరెత్తిస్తున్నాయి.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

సీపీఐతో ఓకే..



లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు ఓ కొలిక్కి వచ్చింది. శనివారం సాయంత్రం భట్టి సీపీఐ రాష్ట్ర కార్యాలయమైన మగ్దూం భవన్‌కు వెళ్లారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేసే అంశంపై సీపీఐ నేతలతో చర్చించారు. ఈ చర్చల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషా, పల్లా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- వివరాలు 10లో

రాష్ట్రంలో 2 రోజులు వానలు



రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్ర సరిహద్దులో మరఠ్వాడా నుంచి అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగనుంది.

- వివరాలు 2లో

17 మందిని పట్టుకొని కాల్చి చంపారు



ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన అతి పెద్ద ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ స్పందించింది. ఈ ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు చనిపోగా సజీవంగా దొరికిన 17 మందిని భద్రతా దళాలు హత్య చేశాయని ఆరోపిస్తూ శనివారం లేఖ విడుదల చేసింది. ఈ మారణకాండకు బస్తర్‌తోపాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బీజేపీ నేతలు బాధ్యులని పేర్కొంది.

- వివరాలు 16లో

ఇదండీ జగత్



టైం లేదట! సుడిగాలి ప్రచారం చేస్తున్నాడు!

ధాన్యమంతా నీటి పాలు..

➤ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో భారీగా ధాన్యం తడిసిపోయింది. పంటలూ దెబ్బతిన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లోని వెయ్యి టన్నుల ధాన్యం తడిసిపోయింది. జగిత్యాల జిల్లాలో వందల టన్నుల ధాన్యం నీటిపాలైంది. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు లేక నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో వరి పంట దెబ్బతిన్నది. ఈ జిల్లాలో 311 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. 129 చోట్ల మాత్రమే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని మార్కెట్‌లో ధాన్యం కుప్పల మధ్య చేరిన వాన నీటిని తొలగిస్తున్న రైతు



టన్నుల కొద్దీ కన్నీళ్లు..

అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో తడిసిపోయిన ధాన్యం

షెడ్లు, టార్పాలిన్లు లేక వేల టన్నులు నీటి పాలు..

- కోతలకు సిద్ధంగా ఉన్న వరికీ దెబ్బ
- వడగళ్లు, ఈదురుగాలులకు వందల ఎకరాల్లో నేలరాలిన మామిడి
- నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో తీవ్ర నష్టం
- నష్టం అంచనా పనిలో యంత్రాంగం
- పలు ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పిడుగుపాట్లకు భారీగా పశువులు మృతి

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షంతో రాష్ట్ర రైతాంగం అతలాకుతలమైంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వివిధ ప్రాంతాల్లో కురిసిన వాన ధాటికి కోతకొచ్చిన వరి పంట నేలకొరిగింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తెచ్చిన ధాన్యమంతా తడిసిపోయింది. పౌర సరఫరాల శాఖ అధికారులు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో.. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో రైతన్నల ధాన్యం నీటి పాలైంది. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షెడ్లు లేక ఆరు బయటే కుప్పలు పోయడం, కనీసం వాటిపై కప్పేందుకు టార్పాలిన్లను కూడా పౌర సరఫరాల శాఖ సరఫరా చేయలేకపోవడం సమస్యగా మారింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయక, ధాన్యం అమ్మకాలు నత్తనడకన సాగుతున్నాయని.. ఇది అకాల వర్ష నష్టాన్ని పెంచిందని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలో 7 వేల పైచిలుకు కొనుగోలు

మిగతా 2వ పేజీలో ▶

పంట నష్టంపై పూర్తిస్థాయి నివేదిక..

మంత్రి తుమ్మల ఆదేశం

అకాల వర్షాలపై ఉన్నతస్థాయి సమీక్ష

- వివరాలు 2లో

జైపాల్, జానాను కాదు

కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల జోలికొస్తే మా కార్యకర్తలు ఊరుకోరు
కారు కార్ఖానాకు పోయింది.. తుక్కు కింద తూకానికి అమ్మాల్సిందే
ఢిల్లీ మోదీ, గజ్వేల్ కేడీలిద్దరూ ప్రజలను వంచించారు
పంద్రాగస్టుకు రూ.రెండు లక్షల రుణమాఫీ, వచ్చే సీజను నుంచి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తాం
ఏడుపాయల దుర్గమ్మ, మెదక్ చర్చి సాక్షిగా చెబుతున్నా.
ఎంపీలుగా గెలిచిన బీఆర్ఎస్ నేతలు మెదక్ అభివృద్ధికి చేసిందేమీ లేదు
మెదక్ రోడ్ షోలో సీఎం రేవంత్‌రెడ్డి


మెదక్‌లో పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నామినేషన్ సందర్భంగా ర్యాలీలో సీఎం రేవంత్. చిత్రంలో దామోదర, సురేఖ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'కాంగ్రెస్ పార్టీ అంటే ఇరవై పెగ్గులేస్తే ఖాళీ అయ్యే రెండు లీటర్ల ఫుల్‌బాటిల్ కాదు.. 20 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని కేసీఆర్ అంటున్నారు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కాపలా ఉన్నది జైపాల్ రెడ్డి, జానారెడ్డి కాదు.. మా ఎమ్మెల్యేలను టచ్ చేసి చూడు హైటెన్షన్ వైరుకు తగిలి మాడి మసై పోతావు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల

మిగతా 5వ పేజీలో ▶

మెదక్ అభివృద్ధిని చూపించడానికి సిద్ధం



- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్
- నాడు మెదక్‌కు నిధులు తరలిస్తున్నారని విమర్శించారు
- ఇప్పుడేమో అభివృద్ధి చేయలేదంటారా?
- కేసీఆర్ కృషివల్లే ఈ ప్రాంతంలో అభివృద్ధి
- సమస్యలపై నిలదీస్తే అసహనమెందుకని ప్రశ్న?

5 లో

24 నుంచి కేసీఆర్ బస్సు యాత్ర



- మే 10వ తేదీ వరకు 17 రోజుల పాటు నిర్వహణ
- ప్రతిరోజూ ఉదయం రైతుల పొలాలు, కొనుగోలు కేంద్రాల సందర్శన
- రైతులు, మహిళలు, ఇతర వర్గాలతో భేటీలు
- సాయంత్రం పూట ప్రధాన పట్టణాల్లో రోడ్ షోలు నిర్వహించేలా షెడ్యూల్
- చివరిగా వచ్చే నెల 10న సిద్దిపేటలో బహిరంగ సభ
- మధ్యలో కొన్ని చోట్ల సభలు నిర్వహించాలనే యోచన

3 లో

కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కు లేదు

- హామీల పేరిట ప్రజలను దగా చేసింది
- వందరోజుల్లో గ్యారంటీల అమలు ఏమైంది ?
- ఎమ్మెల్యేలను కాపాడుకోలేని కేసీఆర్.. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారు?
- తెలంగాణలో రేవంత్ రెడ్డి బెయిళ్లు ఇప్పిస్తారా?
- మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

10 లో



25న రాష్ట్రానికి అమిత్ షా, నెలాఖరులో మోదీ!

- ప్రచార స్పీడ్ పెంచనున్న కమలం
- వరంగల్‌తోపాటు రెండు, మూడు చోట్ల ప్రచారంలో షా పాల్గొనే అవకాశం
- పార్టీ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య నేతలతో సమీక్ష!

- 2లో

డిగ్రీ కోర్సులకు మోర్ డిగ్నిటీ

- కార్పొరేట్ రంగంతో భాగస్వామ్యం
- ఉపాధి అవకాశాలున్న కోర్సులకు శ్రీకారం
- యూనివర్సిటీలకు యూజీసీ కొత్త ప్రతిపాదనలు
- ఈ విద్యా సంవత్సరంలోనే కొన్ని కోర్సులు
- త్వరలో ఉన్నత విద్యా మండళ్లతో యూజీసీ భేటీ



సాక్షి, హైదరాబాద్: డిగ్రీ, పోస్టు-గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుల్లో గుణాత్మక మార్పు దిశగా యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ అడుగులు వేస్తోంది. సంప్రదాయ కోర్సుల స్థానంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని ఇటీవల అన్ని విశ్వవిద్యాలయాలకు సూచించింది. ఈ విద్యా సంవత్సరంలోనే వీటిని అమలులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై త్వరలో ఉన్నత విద్యా మండళ్ల నేతృత్వంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించబోతోంది. యూజీసీ సూత్రప్రాయ అంగీకారం మినహా కోర్సుల విషయంలో యూనివర్సిటీలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వనుంది. ప్రభుత్వ ఉద్యోగాలు కాకుండా, ప్రైవేటు సెక్టార్‌లో అనేక ఉపాధి అవకాశాలను యూజీసీ గుర్తించింది. వీటిల్లో డిగ్రీ విద్యార్థులు పనిచేసేందుకు వీలుగా కొత్త కోర్సులను రూపొందించాలన్నది ప్రతిపాదన. ఉదాహరణకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని బీఎస్సీ బయో టెక్నాలజీ కోర్సును రూపొందిస్తోంది. బీకాంలో కొత్తగా ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సులను పరిచయం చేస్తోంది. బీఏ హానర్స్ కోర్సుల్లో ఎనలైటికల్ కంప్యూటర్ కోర్సులకు శ్రీకారం చుడుతోంది. యూనివర్సిటీలు దగ్గర్లోని కార్పొరేట్ సెక్టార్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుని అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించాలన్నది వీటి ఉద్దేశ్యం.

పీజీ వరకు విద్యార్థులు వెళ్లేలా..

ఇక పీజీ కోర్సులు నిర్వీర్యం అవ్వడం వల్ల దేశంలో పరిశోధనా శక్తి పడిపోతోందని యూజీసీ హెచ్చరిస్తోంది. పీజీ వరకూ విద్యార్థులు వెళ్ళేలా అవసరమైన ప్రోత్సాహం ఇవ్వాలని పేర్కొంది. ఇందులో భాగంగానే ఎంఎస్సీ డేటా సైన్స్,

మిగతా 3వ పేజీలో ▶

అహంకారమే ఓడించింది..

- బీఆర్ఎస్‌పై గుత్తా ఘాటు వ్యాఖ్యలు.. ఎవరిని పెట్టినా గెలుస్తారనుకున్నారు
- ఇంకా పార్టీ నిర్మాణమే సరిగ్గా లేదు
- విశ్వాసం లేకనే పార్టీని వీడుతున్న నేతలు
- పార్టీలో సమన్వయ లోపముంది
- పార్టీ మారిన ఎమ్మెల్సీలపై సమీక్ష తరువాతే నిర్ణయం
- మీడియాతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

2 లో

రూ.500 ఇవ్వనివారు.. రూ.30 వేల కోట్ల రుణమాఫీ చేస్తారా?

- వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. రూ.30 వేలకోట్ల రుణమాఫీ చేస్తామంటే నమ్మేదెవరని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

- వివరాలు 5లో

జాతీయం..

కన్నడ నాడి పట్టేదెవరో!

గత ఎన్నికల్లో బీజేపీ క్లీన్‌స్వీప్

ఈసారి కాంగ్రెస్ గట్టిపోటీ

సర్వేల మొగ్గు కమలనాథులకే

11 లో



తొలి సంకీర్ణం

కొలువుదీరిన నేషనల్ ఫ్రంట్ సర్కారు

బీజేపీ, సీపీఎం బయటి నుంచి మద్దతు..

తెలంగాణ

తేల్చేది ఆదివాసీలే

- ఆదిలాబాద్ సిట్టింగ్ సీటును నిలుపుకునేందుకు బీజేపీ కృషి.. వేధిస్తున్న రెబల్స్ బెడద
- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ కసరత్తు.. చేరికలతో ఊపు
- పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ యత్నం..

- వివరాలు 10లో

ఆంధ్రప్రదేశ్

ఆ తిక్కకు లెక్కే లేదు

- వెండి తెరపై ఈలలు వేయించుకున్న పవన్..
- రాజకీయ తెరపై మాత్రం కామెడీ
- కేఏ పాల్‌ని మించిపోయేలా మాటల కోటలు
- నమ్ముకున్నోళ్లను నట్టేట ముంచి బాబు కోసం శ్రమ
- మనకు బలం లేదంటూ 'పచ్చ' పార్టీకి దాసోహం

12 లో

క్లుప్తంగా...

టికెట్లు అమ్మే సంస్కృతి రేవంత్‌ది
బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: డబ్బులు తీసుకుని ఎన్నికల్లో టికెట్లు ఇచ్చే సంస్కృతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే ఉందని, డబ్బులున్న వారికి టికెట్లు అమ్ముకుని మాదిగ సామాజికవర్గాన్ని పక్కన పెట్టారని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన అధికారంతో హుందాగా వ్యవహరించాల్సిన ముఖ్యమంత్రి నోటికి అడ్డూఅదుపూ లేకుండా పోయిందన్నారు. ఆయన తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయ దళారీ అయిన రేవంత్‌కి కేసీఆర్‌ను తిట్టడం మినహా.. ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. ప్రజాదర్బార్ పేరిట కేవలం ఒక్కరోజే ప్రజాభవన్‌కు వచ్చిన రేవంత్ పాలనను నిర్వీర్యం చేశారన్నారు. ఓటుకు కోట్లు కేసులో దొరికిన వ్యక్తి.. కాంగ్రెస్ పార్టీకి స్టార్ క్యాంపెయినర్‌గా మారి రాహుల్ గాంధీ కోసం ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి వర్గం కూర్పులో తొలి విడతలోనే ముదిరాజ్ సామాజిక వర్గానికి టికెట్లు ఇవ్వకుండా మరో మారు వారిని మోసం చేసేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. పాలమూరు ఎంపీగా పనిచేసిన సమయంలోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని శ్రవణ్ గుర్తు చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై గవర్నర్‌కు ఫిర్యాదు
బీజేపీ సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్



సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యునిగా తనకు కల్పించిన హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్టు బీజేపీ సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. ఆయన శనివారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలపై దారుణంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోనే వెనుకబడ్డ సిర్పూర్ నియోజకవర్గానికి నాలుగు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించలేదన్నారు. అయినప్పటికీ రాష్ట్ర సర్కార్‌తో సంబంధం లేకుండా తన నియోజకవర్గంలో కేంద్రం నుంచి వివిధ రూపాల్లో రూ.వంద కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. స్థానికంగా తాను ఎక్కడికెళ్లినా ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి, పీఆర్ శాఖ మంత్రి సీతక్క నుంచి లేఖ తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారన్నారు. దీనిపై ఆమెకే బహిరంగ లేఖ రాసినట్టు హరీశ్ బాబు వెల్లడించారు.

లౌకికవాదాన్ని పాటించేది ప్రాంతీయ పార్టీలే
మాజీ మంత్రి మహమూద్ అలీ



సాక్షి, హైదరాబాద్: దేశంలో లౌకిక వాదాన్ని పాటించేది ప్రాంతీయ పార్టీలు మాత్రమేనని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన పాలనలో లౌకిక విధానాలను పూర్తి స్థాయిలో అమలు చేశారని చెప్పారు. లౌకికవాదం గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు అన్యాయం చేసిందన్నారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ పదేళ్ల కష్టాన్ని కాంగ్రెస్ నేతలు నాలుగు నెలల్లో కుప్ప చేశారని, రాష్ట్రంలో ముస్లింలు అనాథలయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఒక్క ముస్లింకు కూడా చోటు కల్పించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ అన్యాయమే చేస్తుందని, ఆరు గ్యారంటీల అమలును మరచిపోయిందని విమర్శించారు. మైనారిటీల అభ్యున్నతి విద్య ద్వారానే సాధ్యమవుతుందని వారికోసం 204 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల తర్వాత గృహజ్యోతి పథకాన్ని అటకెక్కిస్తారని అన్నారు. రాష్ట్రంలో మసీదులు కూల్చివేశారని రేవంత్ అబద్ధాలు చెపుతున్నారని మహమూద్ అలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 12 సీట్లలో గెలుస్తుందని, సీఏఏకు వ్యతిరేకంగా పార్లమెంటులో బీఆర్‌ఎస్ మాత్రమే మాట్లాడుతుందని పేర్కొన్నారు.

టన్నుల కొద్దీ కన్నీళ్లు...

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రాలను ప్రారంభించినట్టు పౌరసరఫరాల శాఖ చెప్తున్నా.. సగం కేంద్రాల్లో కూడా కొనుగోళ్లు సాగడం లేదని అంటున్నారు.

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీనష్టం..

అకాల వర్షాలతో ప్రధానంగా నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువ నష్టం జరిగింది. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోనూ చాలా చోట్ల ధాన్యం తడిసింది. రాష్ట్రవ్యాప్తంగా వేల టన్నుల ధాన్యానికి నష్టం జరిగింది. వడగండ్లు, సాధారణ వర్షం కారణంగా కోతకొచ్చిన పంటకు కూడా నష్టం జరిగిందని పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రాథమికంగా తేల్చారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేసే పనిలో పడ్డారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి, తేమ శాతం తగ్గిన తర్వాత తీసుకొస్తే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పౌర సరఫరాల శాఖ ముఖ్య అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు ఈదురుగాలుల ధాటికి పలుచోట్ల ఇళ్లు, కొట్టాల పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కూలాయి. పిడుగుపాటుకు కొందరు గాయపడ్డారు, పదుల సంఖ్యలో పశువులు మృతి చెందాయి. రాష్ట్రవ్యాప్తంగా మరో రెండు రోజులు వానలు పడతాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో.. రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉమ్మడి నిజామాబాద్: వడగళ్ల దెబ్బ

శుక్రవారం రాత్రి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చాలాచోట్ల వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, ధర్పల్లి, మాక్లూర్, నవీపేట్, నందిపేట్ మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమవారంపేట తండా, డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, ధర్పల్లి, జక్రాన్‌పల్లి మండలాల్లో వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. 900 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. 347 చోట్ల మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈదురుగాలుల ధాటికి ఇందల్వాయిలో 50 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మాక్లూర్ మండలం ధర్మోరాలో పిడుగుపడి నలుగురు గాయపడ్డారు.



నిజాంపేట: మెదక్ జిల్లా నిజాంపేటలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన నీరు

ఉమ్మడి మెదక్: నేలకొరిగిన వరి

ఉమ్మడి మెదక్ జిల్లాలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, సిద్దిపేట, నారాయణరావుపేట, దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి, ధాన్యం నీటిపాలైంది. తొగుట, మిరుదొడ్డి, దౌల్తాబాద్, నంగునూరు, రాయపోల్ మండలాల్లో ధాన్యం తడిసిపోయింది. టార్పాలిన్లు లేక ఇబ్బంది ఎదురైంది. సిద్దిపేట జిల్లా పరిధిలో 334 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. 74 ఎకరాల్లో మామిడి నేల పాలైంది. ఈ జిల్లాలో 418 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 94 చోట్ల మాత్రమే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మెదక్ జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాలకుగాను 110 చోట్ల మాత్రమే సేకరణ మొదలైంది.

మిగతా జిల్లాల్లోనూ 'వాన' కష్టాలు

- యాదాద్రి-భువనగిరి జిల్లా రాజాపేట, భూదాన్ పోచంపల్లి మండలాల్లో వడగళ్ల వానకు వరి నేలకొరిగింది. మామిడి నేలరాలింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలం మొండిగౌరెల్లి, నస్దిక్ సింగారం, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, నందివనపర్తి గ్రామాల్లో వరి నేలకొరిగింది. 50కిపైగా ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి.
- హనుమ కొండ జిల్లా ఎల్కతుర్తి, ధర్మసాగర్, కమలాపూర్, ఐనవోలు మండలాల్లో ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యం, మొక్కజొన్న తడిసిపోయాయి.



యాచారం: తమ్మలోనిగూడలో నేలరాలిన మామిడి కాయలు

కొనుగోలు కేంద్రంలో తడిసి..

ఈ ఫొటోలోని రైతు పేరు బోడ దేవరాజు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లికి చెందిన ఆయన మూడెకరాల్లో వరి సాగు చేశాడు. వారం క్రితం కోతలు పూర్తి చేసి.. ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తెచ్చారు. కానీ శుక్రవారం రాత్రి అకాల వర్షంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది.





ధాన్యమంతా కొట్టుకుపోయింది

''ఆరుగాలం కష్టపడి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాను. మద్దతు ధర కోసం యార్డుకు ధాన్యాన్ని తీసుకువచ్చాను. గన్నీ సంచులు లేక ధాన్యమంతా షెడ్ బయటనే కుప్పపోయాల్సి వచ్చింది. వానతో ధాన్యమంతా కొట్టుకుపోయింది.
– సత్తయ్య, ఎన్సాన్‌పల్లి

పంటనష్టంపై పూర్తిస్థాయి నివేదిక

మంత్రి తుమ్మల ఆదేశం
- అకాల వర్షాలు, వడగళ్ల వానలపై సమీక్ష
- కొనుగోలు కేంద్రాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలు, వడగండ్ల వర్షాలతో సంభవించిన పంటనష్టంపై పక్కాగా అంచనాలు రూపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల నేపథ్యంలో శనివారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండ్రోజులుగా నారాయణపేట, కామారెడ్డి, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, యాదాద్రి, సిద్దిపేట జిల్లాలలో వడగండ్ల వానలు కురిశాయని పేర్కొన్నారు. దీంతో ఆయా జిల్లాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు అందాయని వివరించారు. వడగండ్ల వానలతో దాదాపు 2,200 ఎకరాల వరకు వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్టు వెల్లడించారు. పంటనష్టం సంభవించిన ప్రాంతాలను వెంటనే సందర్శించి రైతువారీ పంట నష్టం వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని ఆదేశించారు. వరిపంట కోతలు ఊపందుకున్న నేపథ్యంలో వచ్చే రెండు, మూడు వారాలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అకాల వర్షాలు సంభవించే అవకాశాలుండడంతో పంట నష్టాన్ని తగ్గించే ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలని, రైతులకు సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాస్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ.. మార్కెట్లకు/సెంటర్లకు వచ్చిన వరి ధాన్యం, ఇతర పంట దిగుబడులు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఇప్పటికే 2 లక్షలకుపైగా టార్పలిన్ కవర్లను రైతులకు అందుబాటులో ఉంచినట్టు తెలియజేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు.

రాష్ట్రంలో రెండ్రోజులు వానలు

- సరిహద్దులో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి
- వర్షాలతో కాస్త తగ్గిన గరిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశంఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్ర సరిహద్దులో మరఠ్వాడా నుంచి అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగనుంది. దీని ప్రభావంతో ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు చెప్పింది. వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. శనివారం రాష్ట్రంలోని చాలాప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో నమోదయ్యాయి. శనివారం రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత అత్యల్పంగా మెదక్‌లో 22.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఆదివారం ఉత్తరాది జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

శనివారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	42.3	29.2
ఖమ్మం	40.6	28.0
నల్లగొండ	40.5	24.8
భద్రాచలం	40.4	29.0
మహబూబ్‌నగర్	39.0	30.0
నిజామాబాద్	38.0	25.0
మెదక్	36.2	22.4
హకీంపేట్	35.6	27.5
హైదరాబాద్	35.6	28.7
దుండిగల్	35.5	26.8
రామగుండం	35.4	28.0
హనుమకొండ	32.5	27.0

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

మాడుగులపల్లి: నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామంలో వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందింది. చిరుమర్తి గ్రామానికి చెందిన మండల పుల్లమ్మ (70) ఎండ తీవ్రతకు ఇటీవల అస్వస్థతకు గురైంది. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు శనివారం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందింది.

బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



కుషాయిగూడ (హైదరాబాద్): బీజేపీని ఓడించి దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం పేదలను, కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలో భువనగిరి స్థానంలో మాత్రమే సీపీఎం పోటీలో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తామని, భువనగిరిలో తమకు మద్దతు తెలపాలని కోరినట్లు పేర్కొన్నారు. ఓటుకు కోట్లు కేసులో ఉన్న తెలంగాణ సీఎంను అరెస్టు చేయకుండా.. కేరళ సీఎంను అరెస్టు చేయడం సిగ్గుచేటని రాఘవులు మండిపడ్డారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి భాష మార్చుకోవాలి: డీకే అరుణ



పాలమూరు: సీఎం రేవంత్ రెడ్డి భాష మార్చుకోకపోతే సరైన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, ఒక మహిళ అని చూడకుండా దొరసాని, తొక్కుతా అంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి తన పదవిని మర్చిపోయి పదేళ్ల కిందట పని చేసిన జెడ్పీటీసీలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆగస్టులో రైతు రుణమాఫీ చేయకపోతే రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. 'ఒక మహిళను ఓడించడానికి మొత్తం ఏకం అయ్యారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇప్పటి వరకు జిల్లాకు ఐదుసార్లు వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది. అందుకే రేవంత్‌రెడ్డి పాలమూరులోనే రాజకీయ చేస్తున్నాడు. పాలమూరు జిల్లాకు ముందు నువ్వు ఏం చేశావో చెప్పాలి' అంటూ అరుణ సవాల్ విసిరారు.

పంట ఎండిందని రైతు బలవన్మరణం



టేకుమట్ల: అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినా నీటి ఎద్దడితో పంట ఎండిందని మనస్తాపంతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలంలోని బూర్నపల్లిలో శనివారం ఉదయం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్నపల్లి గ్రామానికి చెందిన కొండ రమేశ్ (44) అనే రైతు తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాడు. రూ.లక్ష వరకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టగా వ్యవసాయ బావిలో నీళ్లు లేక పంట మొత్తం ఎండిపోయింది. ఒక వైపు పంట ఎండిపోగా, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం గిద్దెముత్తారం వెళ్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. శనివారం ఉదయం బూర్నపల్లి గుట్టపై ఓ చెట్టుకు ఉరి వేసుకున్న రమేశ్‌ను పశువుల కాపరులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

25న రాష్ట్రానికి అమిత్‌షా, నెలాఖరులో మోదీ!



ప్రచారంలో దూకుడు పెంచనున్న కమలం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో అగ్రనేతల ప్రచారంతో బీజేపీ దూకుడు పెంచనుంది. ఈ నెల 25న నామినేషన్ల దాఖలు గడువు ముగియనున్న సందర్భంగా పలువురు జాతీయ నేతలు ప్రచారానికి రానున్నారు. ఏప్రిల్ 25న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన వరంగల్‌తోపాటు రెండు, మూడు చోట్ల ప్రచారంలో పాల్గొనే అవకాశాలున్నట్టు సమాచారం. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్ల పరిధిలో పార్టీపరంగా నిర్వహిస్తున్న ప్రచారం, ప్రజలకు చేరువయ్యేందుకు అమలు చేస్తున్న కార్యాచరణ, పోలింగ్‌బూత్‌స్థాయిల్లో జరుగుతున్న కృషి, ఎన్నికలకు సంబంధించిన ఇతర అంశాలను ఆయన రాష్ట్ర ముఖ్యనేతలతో సమీక్షిస్తారని తెలుస్తోంది. ఈనెల 25న అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు రానున్నట్టు కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ఆది, సోమవారాల్లో వివిధ సమావేశాల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. పార్టీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరు, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రచారంపై ఆయన సమీక్ష నిర్వహిస్తారని తెలిసింది. ఈ నెలాఖరులో లేదా మే మొదటివారంలో ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్నట్టు తెలుస్తోంది. మోదీ మలివిడత ప్రచారంలో 3, 4 సభలు, రోడ్‌షోల్లో పాల్గొంటారని సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ నెలాఖర్లో లేదా మే 10 తేదీలోగా రాష్ట్రానికి వస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. 10 నుంచి 12 సీట్లలో గెలిచేందుకు జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో మోదీ, అమిత్‌షా, నడ్డా , కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత సీఎంలు ప్రచారానికి రానున్నట్టు తెలుస్తోంది. కాగా, పార్టీ లోక్‌సభ అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమాలకు పలువురు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు హాజరు కానున్నారు.

కాంగ్రెస్‌లోకి అందోల్ మున్సిపల్ చైర్మన్

నియోజకవర్గానికి చెందిన 300 మంది నాయకులు, ముఖ్య కార్యకర్తలు కూడా..



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సహా 300 మంది ముఖ్య కార్యకర్తలు శనివారం రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన నివాసంలో వారందరికీ మంత్రి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అందోల్-జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్ పడిగె సుమిత్ర, రాయికోడ్ మండల జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ షేరి జగన్మోహన్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నల్లంపల్లి సిద్ధన్నపాటిల్, మాజీ ఎంపీపీ, రాయికోడ్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బస్వరాజ్‌పాటిల్, మల్లంపల్లి ఎంపీటీసీ సత్యమ్మ శ్రీశైలం తదితర 300 మంది కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. మంత్రి దామోదర మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందోల్ నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, 20 వార్డులున్న అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో 14 మంది బీఆర్‌ఎస్, ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. ఇదివరకే ముగ్గురు కౌన్సిలర్లు చేరిపోవడం, తాజాగా మరో ముగ్గురు చేరడంతో కాంగ్రెస్ బలం 12కి చేరింది.

అహంకారమే ఓడించింది

బీఆర్‌ఎస్‌పై గుత్తా ఘాటు వ్యాఖ్యలు
- ఎవరిని పెట్టినా గెలుస్తారనుకున్నారు
- ఇంకా పార్టీ నిర్మాణమే సరిగ్గా లేదు
- విశ్వాసం లేకనే పార్టీని వీడుతున్న నేతలు
- పార్టీలో సమన్వయలోపముంది
- పార్టీ మారిన ఎమ్మెల్సీలపై సమీక్ష తరువాతే నిర్ణయం
- మీడియాతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గుత్తా

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఏకపక్షంగా.. మనం ఎవరిని పెట్టినా గెలుస్తామనే అహంకారంతో వ్యవహరించడం వల్లనే బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోయిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విశ్లేషించారు. బీఆర్‌ఎస్ పార్టీలో సమన్వయలోపం ఉందని, బాధ్యతలు సరైన పద్ధతిలో లేవని ఆయన వ్యాఖ్యానించారు. టీఆర్‌ఎస్ అయినా, బీఆర్‌ఎస్ అయినా పార్టీకి ఇప్పటికీ సరైన నిర్మాణం లేదన్నారు. తన స్వగ్రామమైన నల్లగొండ జిల్లా ఊరుమడ్లలో శనివారం గుత్తా మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేనే సుప్రీం అని, నియోజకవర్గానికి ఆయనే సీఎం అనే పద్ధతిని కేసీఆరే నడిపించారని ఆరోపించారు. ఎంపీలైతే వారి అభివృద్ధి నిధుల్లో రూ.3.5కోట్లు నియోజకవర్గాలకు ఇచ్చేయాలని, రూ.1.5 కోట్లు వారి దగ్గర పెట్టుకోవాలని, కార్యక్రమాలకు ఎమ్మెల్యే పిలిస్తేనే వెళ్లండి.. పిలవకపోతే వెళ్లకండి అని కేసీఆర్ చెప్పేవారని గుత్తా నిందించారు. ఎమ్మెల్సీల పరిస్థితి అయితే కరివేపాకు కంటే అధ్వానంగా ఉండేదన్నారు.

లిల్లీపుట్‌లను తయారుచేశారు..

ఉద్యమకారుల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్‌లో చాలామంది కోటీశ్వరులయ్యారని గుత్తా ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో కొందరు లిల్లీపుట్‌లను తయారుచేశారని విమర్శించారు. పల్లీ,బఠానీలు అమ్ముకునే నేతలు కోట్లకు పడగలెత్తారన్నా రు. తనను విమర్శించే బీఆర్‌ఎస్ నేతలు ఆత్మ విమ ర్శ చేసుకోవాలన్నారు. త్వరలో వారి బండారం బయటపెడతానని గుత్తా వెల్లడించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో భారీ అంచనాలు ఉన్నాయని.. ఖజానా ఖాళీగా ఉండడంతో కనీసం ఏడాదైనా ప్రభుత్వానికి టైమివ్వాలన్నారు.

అందుకే పార్టీ పేకమేడలా కూలుతోంది

జిల్లా పరిషత్ చైర్మన్ వంటి స్థానిక సంస్థల వారిది మరో గోస అని, మున్సిపల్ చైర్మన్ల అధికారాలు తీసి జిల్లా కలెక్టర్లకు అప్పగించారని, దాంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని గుత్తా చెప్పుకొచ్చారు. ఈ పద్ధతులే బీఆర్‌ఎస్ నిర్వీర్యానికి కారణమయ్యాయన్నారు. అందుకే అధికారం కోల్పోయిన మూడు నెలల్లోనే పార్టీ పేకమేడల్లా కూలిపోవాల్సి వచ్చిందని గుత్తా వ్యాఖ్యానించారు. పార్టీ ఎవరికి నాయకత్వ బాధ్యతలు అప్పగించిందో, ఎవరిని మంత్రులను చేసిందో వారి వల్లే నష్టం జరిగిందని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 30 నుంచి 35 మందిని మార్చితే ప్రభుత్వం వచ్చేదనే అభిప్రాయం చాలామందికి ఉందన్నారు.

నేను, హరీశ్ ఎన్నోమార్లు చెప్పాం

ఏ రాజకీయ పార్టీ అయినా గెలిచినా ఓడినా, అందుకు కారణాలేంటనే సమీక్ష చేసుకోవాల్సిన బాధ్యత ఉందనీ, ఈ విషయాలను తాను, హరీశ్‌రావు కేటీఆర్‌కు చాలాసార్లు చెప్పామని గుత్తా తెలిపారు. అయితే కేసీఆర్‌కు చెప్పే అవకాశం ఇవ్వలేదన్నారు. తనకు ఏ పార్టీలో చేరాల్సిన అవసరం లేదని, తన కుమారుడు అమిత్‌రెడ్డి ప్రస్తుతం వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. సమయం వచ్చినప్పుడే ఆలోచన చేస్తారన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నందున తనకు పార్టీ ఉండదన్నారు. పార్టీ వీడిన ఎమ్మెల్సీలపై అనర్హత వేటు విషయంలో న్యాయపరమైన, అధికార సమీక్ష తరువాత చట్ట ప్రకారమే నిర్ణయం తీసుకుంటామన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రచారానికి వెళ్లండి

కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలకు ఇన్‌చార్జ్ సంగ్రామ్ తవడే పిలుపు

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సేవాదళ్ నేతలు, కార్యకర్తలు పనిచేయాలని తెలంగాణ సేవాదళ్ ఇన్‌చార్జ్ సంగ్రామ్ తవడే పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా తవడే మాట్లాడుతూ జిల్లా స్థాయిలోని పార్టీ నేతలు, పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సమన్వయం చేసుకుంటూ సేవాదళ్ ఈ ఎన్నికల్లో క్రియాశీల పాత్ర పోషించాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని పోలింగ్‌బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. సమావేశంలో భాగంగా రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు ఇంచార్జులుగా నియమితులైన సేవాదళ్ నేతలకు నియామకపత్రాలను అందజేశారు. సమావేశంలో టీపీసీసీ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

'100 రోజుల్లో ఆరు గ్యారంటీల అమలేది?'

పరకాల: ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల స్కీంను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి మాట మార్చారని, తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగానైనా ఆగస్టు 15 కల్లా అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేస్తారా? అని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం పరకాలలో జరిగిన బీఆర్‌ఎస్ పరకాల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై గవర్నర్‌కు స్టాంప్ కాగితంపై లేఖను అందించాలని డిమాండ్ చేశారు.





అనకాపల్లి జిల్లా చింతలపాలెంలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

"అయ్యా చంద్రబాబూ... నువ్వు బచ్చా అంటున్న నేను ప్రజలకు మంచిచేసి ఎన్నికల్లో ఒంటరిగా, ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నా.. మరి నువ్వు మూడుసార్లు సీఎంగా.. 14 ఏళ్లు అధికారంలో ఉన్నావ్ కదా! పేదలకు నువ్వు ఏమైనా మంచి చేసి ఉంటే, మరి నువ్వెందుకయ్యా బచ్చాను చూసి భయపడుతూ పొత్తుల కోసం ఎగబడుతున్నావ్? ఈ 75 ఏళ్ల వయసులో నువ్వు పది మందిని ఎందుకు పోగేసుకోవాల్సి వస్తోంది?"

"నేను బచ్చానైతే నా చేతిలో చిత్తుచిత్తుగా ఓడిపోయి కేవలం 23 మంది ఎమ్మెల్యేలను మాత్రమే గెలిపించుకున్న నువ్వు ఎవరయ్యా? నేను బచ్చా అయితే ఐదేళ్ల తరువాత కూడా నాతో పోటీకి ఒక్కడివే రావటానికి ధైర్యం చాలక అర డజను మందిని వెనకేసుకుని వస్తున్న నిన్ను ఏమనాలి? ఓ బాబూ.. నిన్నే అడుగుతున్నా!"

- చింతలపాలెం సిద్ధం సభలో సీఎం జగన్

• చెప్పవయ్యా చంద్రబాబూ..!

బచ్చా అంటూ భయమెందుకు?

చింతలపాలెం సిద్ధం సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: మీ బిడ్డ జగన్ 58 నెలలుగా ప్రతి ఇంటికీ చేసిన మంచిని గుర్తు చేసి ఓట్లు అడుగుతుంటే, చంద్రబాబు మాత్రం తన హయాంలో పేదలకు చేసిన ఒక్క మంచి పని కూడా లేకపోవడంతో ఉక్రోషంతో రాళ్లు వేయ మంటున్నారని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు వద్దంటూ ఏకంగా ఉద్యమాలు చేయించిన వ్యక్తి దేశంలో ఒక్క చంద్రబాబు మాత్రమేనని మండిపడ్డారు. జగన్ ఓ బచ్చా అని విమర్శిస్తున్న చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉండి కూడా గత 58 నెలల్లో తాను చేసిన మాదిరిగా మంచి పనులు ఒక్కటైనా ఎందుకు చేయలేకపోయారని సూటిగా ప్రశ్నించారు. 'మేమంతా సిద్ధం బస్సు యాత్ర' సందర్భంగా శనివారం అనకాపల్లి జిల్లా చింతల పాలెం వద్ద నిర్వహించిన సిద్ధం సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివి..

ఉక్రోషంతో రాళ్లు వేయమంటున్నాడు..

మన సిద్ధం సభలను చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు, బస్సులు పరుగెడుతున్నాయి. చంద్రబాబుకు ఉక్రోషం, కడుపు మంట భగ్గుమనడంతో నాపై రాళ్లు వేయమంటున్నాడు. నన్ను దగ్గం చేస్తానంటున్నాడు. జగన్‌ను కొట్టటానికి.. జగన్‌కు హాని చేయటానికి.. రాష్ట్రాన్ని దోచుకోవటానికి .. ఆ దోచుకున్నది పంచుకోవటానికి వాళ్లకు అధికారం కావాలట! ఇది చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ అజెండా!

కంసుడు, పూతన, కాళిందిలా వ్యాన్‌పై..

చంద్రబాబు ఈమధ్య జగన్ ఒక బచ్చా అంటున్నాడు! ఇలాంటి వ్యాఖ్యలు విన్నప్పుడు నాకు కొన్ని పురాణగాథలు గుర్తుకొస్తాయి. కృష్ణుడిని బచ్చా అనుకున్న కంసుడు, పూతన, కాళింది మాదిరిగా బాబు వ్యాన్‌పై నిలబడ్డ ఆ ముగ్గురూ గుర్తుకొస్తున్నారు. శ్రీరాముడిని బచ్చా అనుకున్న మారీచుడు, సుబాహుడు వేషాల్లో ఇప్పుడు రామోజీ, ఓ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ కనిపిస్తున్నారు. హనుమంతుడిని బచ్చా అనుకున్న రావణుడు కూడా వీళ్లలో గుర్తుకొస్తున్నాడు. చరిత్రలో పోయేకాలం వచ్చినప్పుడు.. ఓడిపోయే కాలం వచ్చినప్పుడు విలన్లందరికీ కూడా హీరోలు బచ్చాలుగానే కనిపిస్తారు.

బచ్చా చేసిన పనులు నువ్వెందుకు చేయలేకపోయావు?

నేను బచ్చా అయితే.. ఈ 58 నెలల్లో గ్రామాలకు, రైతులకు, పేదలకు, అక్క చెల్లెమ్మలకు, పిల్లలకు, అవ్వాతాతలకు, సామాజిక వర్గాలకు, ఇంటింటికీ చేసిన మంచిని నువ్వు 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా ఎందుకు చేయలేకపోయావ్ చంద్రబాబూ? ఈ బచ్చా చేసిన పనులను నువ్వెందుకు చేయలేకపోయావు? మరి నిన్ను ఏమనాలి?

జగన్ ఉంటేనే పేదలకు పథకాలు..

ఓ లంచాల బాబూ.. జన్మభూమి కమిటీల బాబూ.. మీ పాలనలో ఏముందయ్యా గర్వ కారణం? నీ పేరు చెబితే పేదలకు నువ్వు చేసిన ఒక్క మంచి పనైనా గుర్తుకొస్తుందా? చంద్రబాబు పేరు చెబితే గుర్తుకొచ్చేవి వెన్నుపోట్లు, మోసాలు, అబద్ధాలు, కుట్రలే. జగన్ ఉంటేనే పేదలకు పథకాలన్నీ కొన సాగుతాయి. లేదంటే మళ్లీ మోసపోయి పథకాలన్నీ ముగింపే. పేదల భవిష్యత్తు అంధకారమయం కాకుండా మధ్యలో నిలబడి ఉన్న వ్యక్తి మీ జగన్. ఏ పార్టీకైనా, నాయకుడికైనా ఓటు వేయాలంటే మీరు ఏం చూస్తారో ఒక్కసారి ఆలోచన చేయండి. మోసపూరిత, రంగురంగుల మేనిఫెస్టోను చూసి ఓటు వేస్తారా? లేక జరిగిన మంచిని గమనించి ఎవరు ఉంటే అది కొనసాగుతుందని ఆలోచన చేసి ఓటు వేస్తారా? 2014లో కూడా ఇదే కూటమిగా ఏర్పడిన చంద్రబాబు తాను సంతకం చేసిన హామీలను ఇంటింటికీ పంపించి గద్దెనెక్కాక దగా చేసిన విషయాన్ని మరచి పోవద్దు. ఇన్ని మోసాలతో పోరాడుతూ రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందు కు జరుగుతున్న ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? వారి చీకటి యుద్ధాన్ని, ఆ ఎల్లో మీడియా, సోషల్ మీడియా అస త్యాల యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మీ జేబు నుంచి సెల్ ఫోన్లు తీసి టార్చిలైట్లు వెలిగించండి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని వ్యవస్థలు, మన చదువులు, పిల్లలు, రైతన్నలు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి.

మార్గదర్శి వ్యవహారంలో ఏడాది చివరకు లాజికల్ ఎండింగ్

- విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి..
- సుప్రీం ఆదేశాలతో నా వాదన బలంగా వినిపించే అవకాశం
- కృష్ణంరాజు విచారణాధికారిగా ఉన్న సమయంలో 300 బాక్సుల డాక్యుమెంట్ల రూపకల్పన
- సుప్రీం ఆదేశాలతో తెలంగాణ కోర్టులో వీటన్నింటిపైనా విచారణ
- మాజీ ఎంపీ ఉండవల్లి



మాట్లాడుతున్న ఉండవల్లి

సాక్షి, రాజమహేంద్రవరం: మార్గదర్శి వ్యవహారానికి సంబంధించి ఈ ఏడాది చివరికి లాజికల్ ఎండింగ్‌కి వస్తుందని తాను భావిస్తున్నట్లు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి కేసులో సమగ్ర విచారణ చేయాల్సిందిగా తెలంగాణ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించిందని, ఈ విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకొస్తాయన్నారు. ఈ కేసును మొదటి నుంచి అనుసరిస్తున్న తనను.. తాను చెప్పాలనుకున్నది తెలంగాణ కోర్టులో చెప్పి సహకరించాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించిందని, దీంతో తన వాదన మరింత బలంగా వినిపించే అవకాశం కలిగిందని తెలిపారు. 45 ఎస్ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఏం చెప్పిందో మార్గదర్శి తెలుసుకోవాలని సూచించారు. డిపాజిటర్లకు 2007లో జరగాల్సిన చెల్లింపులు ఆలస్యంగా 2009లో చెల్లించారని, దీనికి సంబంధించి పూర్తి స్థాయిలో చెల్లించారో లేదో నిగ్గు తేలాలన్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సంబంధించి విచారణాధికారిగా కృష్ణంరాజు ఉన్న సమయంలో 300 బాక్సుల డాక్యుమెంట్లు రూపొందించారని, వాటిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోందన్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసును తొలి నుంచి అనుసరిస్తున్న నేపథ్యంలో హైకోర్టుకు సహాయ పడాల్సిందిగా సుప్రీంకోర్టు తనను ఆదేశించిందని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యే వరకూ రాజకీయాలపై తాను ఎలాంటి ప్రకటనలూ చేయనని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 200కు పైగా సీట్లు వస్తేనే దేశంలో ప్రజాస్వామ్యం బతుకుతుందని ఉండవల్లి అన్నారు.



బన్సీలాల్‌పేట్‌లోని మెట్ల బావి వద్ద వేదకుమార్, సూర్యనారాయణమూర్తి తదితరులు

సాంస్కృతిక, వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకల్లో భాగంగా బన్సీలాల్ పేట్‌లోని పురాతన కాలం నాటి మెట్లబావి వద్ద శనివారం ''వాయిస్ ఆఫ్ హెరిటేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ జి.వి.ఎస్ సూర్యనారాయణమూర్తి, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్, భారత పురావస్తుశాఖ మాజీ డైరెక్టర్ తాహెర్, ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ ప్రతినిధి శోభాసింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిజాంకాలానికి చెందిన బావులను పునరుద్ధరించడం వల్ల సాంస్కృతిక, వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవడమే కాకుండా అత్యంత విలువైన జలవనరులను కూడా సంరక్షించుకున్నట్లవుతుందని ఈ సందర్భంగా జీవీఎస్ సూర్యనారాయణమూర్తి తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన హైదరాబాద్‌లో ఎన్నో అద్భుతమైన సాంస్కృతిక, వారసత్వ కట్టడాలు చెక్కుచెదరకుండా ఉన్నాయని, వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని వేదకుమార్ అన్నారు.

24 నుంచి కేసీఆర్ బస్సు యాత్ర

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 24వ తేదీ నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు బస్సు యాత్ర నిర్వహించనున్నారు. మే 10వ తేదీ వరకు కొనసాగే ఈ బస్సుయాత్రలో రోజూ సాయంత్రం ముఖ్య పట్టణాల్లో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. మొత్తంగా 17 రోజుల పాటు జరిగే బస్సు యాత్రలో 21 చోట్ల రోడ్ షోలు నిర్వహించేలా షెడ్యూల్ ఖరారైంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రోడ్ షోతో కేసీఆర్ ఎన్నికల ప్రచారం ప్రారంభమై.. సిద్దిపేటలో జరిగే సభతో ముగియనుంది. వేసవి తీవ్రత నేపథ్యంలో.. సాయంత్రం 5.30 గంటల తర్వాత ఈ రోడ్ షోలను ప్రారంభిస్తారు. రోడ్ షో ముగిశాక ఆయా ప్రాంతాల్లో స్థానికంగా రాత్రి బస చేస్తారు. బస్సుయాత్ర సాగే రూట్లలో ఉదయం పూట స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రైతుల పంట పొలాలు, కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేసీఆర్ సందర్శించనున్నట్టు బీఆర్ఎస్ తెలిపింది. ఇక బస చేసే ప్రాంతాల్లో విద్యార్థులు, యువత, మహిళలు, మైనారిటీలు, వివిధ సామాజిక వర్గాలతో కేసీఆర్ భేటీ అయ్యే అవకాశం ఉందని నేతలు చెప్తున్నారు.

ఆ ఐదు స్థానాల్లో రోడ్ షోలు లేనట్టే..: కేసీఆర్ ప్రచార షెడ్యూల్‌లో ఆదిలాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో కేసీఆర్ రోడ్ షోలు లేవు. అయితే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో బహిరంగ సభలు నిర్వహించే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్ పరిసర లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల రోడ్ షోలు ఉంటాయని పేర్కొంటున్నాయి.

కేసీఆర్ రోడ్ షోల షెడ్యూల్ ఇదీ..: ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు కేసీఆర్ బస్సుయాత్ర చేయనున్నారు. ఆయా రోజుల్లో సాయంత్రం 5.30 నుంచి ఏడు గంటల మధ్య రోడ్ షోలు.. మిగతా సమయాల్లో రైతులను, వివిధ వర్గాల వారిని కలిసేలా షెడ్యూ ల్ ఖరారు చేశారు. రోడ్ షోల షెడ్యూల్‌ను చూస్తే.. ఏప్రిల్ 24న మిర్యాలగూడ, సూర్యాపేటలలో.. 25న భువనగిరిలో, 26న మహబూబ్‌నగర్‌లో, 27న నాగర్‌కర్నూల్‌లో, 28న వరంగల్‌లో, 29న ఖమ్మంలో, 30న తల్లాడ, కొత్తగూడెంలలో, మే 1న మహబూబాబాద్‌లో, 2న జమ్మికుంటలో, 3న రామగుండంలో, 4న మంచిర్యాలలో, 5న జగిత్యాలలో, 6న నిజామాబాద్‌లో, 7న కామారెడ్డి, మెదక్‌లలో, 8న నర్సాపూర్, పటాన్‌చెరులలో, 9న కరీంనగర్‌లో, 10న సిరిసిల్లలో రోడ్ షోలు నిర్వహించనున్నారు. చివరిగా 10వ తేదీనే సిద్దిపేటలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

మార్గదర్శి, రామోజీపై కేసు కొట్టివేతను ఆక్షేపించిన సుప్రీంకోర్టు

హైకోర్టు రిజర్వ్ బ్యాంక్ వాదనలు విని ఉండాల్సింది

- మార్గదర్శిపై చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందన్న ఆరోపణలు ఉన్నాయి
- ఆర్‌బీఐ వాదనలు సమగ్రంగా విని ఉంటే సంక్లిష్టతలు అర్థమై ఉండేవి
- డిపాజిటర్లు ముందుకు రాకపోతే పబ్లిక్ నోటీసు జారీ చేయాల్సింది
- హైకోర్టు అలా చేయకపోవడం వల్ల ఆ తీర్పును రద్దు చేస్తున్నాం
- తెలంగాణ హైకోర్టు ఈ వ్యవహారంపై తిరిగి విచారణ జరపాలి
- ఆర్‌బీఐ, రెండు ప్రభుత్వాలు, డిపాజిట్‌దారుల వాదనలు వినాలి
- ఉండవల్లి అరుణ్‌కుమార్ కోర్టుకు సహకరించవచ్చు
- ఆరు నెలల్లో ఈ కేసును తేల్చండి.. తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం
- అందుబాటులోకి వచ్చిన సుప్రీం కోర్టు తీర్పు కాపీ

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు డిపాజిట్లుగా స్వీకరించినందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావుపై నమోదయిన కేసును కొట్టేస్తూ 2018లో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు ఆక్షేపించింది. ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు స్వీకరించినందున, తీర్పునిచ్చే ముందు హైకోర్టు రిజర్వ్ బ్యాంక్ వాదనలను సమగ్రంగా విని ఉండాల్సిందని సుప్రీం కోర్టు అభిప్రాయ పడింది. తద్వారా ఈ వ్యవహారంలో ముడిపడి ఉన్న సంక్లిష్టతలను అర్థం చేసుకునే అవకాశం ఉండేదని తెలిపింది. డిపాజిట్లను క్లెయిమ్ చేసేందుకు ఏ డిపాజిటర్ ముందుకు రానందున మార్గదర్శిపై కేసును కొట్టేస్తున్నట్లు హైకోర్టు తెలిపిందని, డిపాజిటర్లు ముందుకు రాకపోతే పబ్లిక్ నోటీసు జారీ చేసి క్లెయిమ్‌లను ఆహ్వానించి ఉండాల్సిందని స్పష్టం చేసింది. అప్పుడే క్లెయిమ్స్ విషయంలో నిజమైన పెట్టుబడిదారులంతా సంతృప్తి చెందారని, మార్గదర్శి ఎలాంటి దురుద్దేశంతో వ్యవహరించలేదని చెప్పేందుకు అవకాశం ఉండేదని సుప్రీం కోర్టు తెలిపింది. ఈ చర్యలు తీసుకోకుండా మార్గదర్శిపై నమోదైన కేసును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నట్లు తేల్చి చెప్పింది. తాజాగా విచారణ జరిపి డిపాజిట్ల స్వీకరణ వ్యవహారాన్ని తేల్చేందుకు ఈ కేసును తిరిగి తెలంగాణ హైకోర్టుకు నివేదిస్తున్నట్లు సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆరు నెలల్లోపు తేల్చండి

చట్ట ప్రకారం విచారణ జరిపి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్‌బీఐ, నిజమైన పెట్టుబడిదారుల వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారాన్ని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం లేదా ఏదైనా సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఉంచాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సూ చించింది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహకరించేందుకు ఉండవల్లి అరుణ్ కుమార్‌కు స్వేచ్ఛనిచ్చింది. తెలంగాణ హై కోర్టు నిజమైన పెట్టుబడిదారుల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆహ్వానించవచ్చని, వచ్చిన క్లెయిమ్స్‌ని పరిశీలించేందుకు అవసరమైతే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా సీనియర్ మాజీ న్యాయాధికారిని నియమించవచ్చని తెలిపింది. ఈ ప్రక్రియను నిర్దిష్ట కాల పరిమితి లోపు పూర్తి చేయాలని పేర్కొంది. ఆ తరువాత మార్గదర్శిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడం అవసరమా? లేదా అన్న విషయాన్ని తేల్చాలని హైకోర్టును ఆదేశించింది. ఆరు నెలల్లోపు ఈ మొత్తం వ్యవహారాన్ని తేల్చాలని తెలిపింది. ఈ కేసుతో ముడిపడి ఉన్న వారందరూ హైకోర్టు, సుప్రీం కోర్టులో లేవనెత్తిన వాదనలన్నింటినీ తిరిగి హైకోర్టు ముందు వినిపించవచ్చని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

హైకోర్టు విభజన చివరి రోజున తీర్పు

ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధంగా రూ.2,600 కోట్లకు పైనే డిపాజిట్ల రూపంలో ప్రజల నుంచి స్వీకరించినందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావులపై నమోదైన కేసును కొట్టేస్తూ 2018లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఉమ్మడి హైకోర్టు విభజన చివరి రోజున అందరూ హడావుడిగా ఉన్న సమయంలో జస్టిస్ రజనీ ఇచ్చిన తీర్పు ను సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు మార్గదర్శి, రామోజీరావు సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఈ నెల 9న విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ తిరిగి కేసును విచారించాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ తీర్పు కాపీని సుప్రీం కోర్టు తాజాగా అందుబాటులోకి తెచ్చింది.

డిగ్రీ కోర్సులకు మోర్ డిగ్నిటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ వంటి కోర్సుల్లో మార్పులు చేశారు. సరికొత్త సిలబస్‌ను జోడించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టూ తీర్చిదిద్దుతున్నారు. అయినప్పటికీ పెద్దగా విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. పీజీలో మొత్తం 48 కోర్సులుంటే, వాటిలో జాగ్రఫీ, ఎంపీఎడ్, టూరిజం, లైబ్రరీ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ కోర్సుల్లో ప్రవేశాలు నామమాత్రంగానే ఉన్నాయి. ఎంకాం, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ఎన్ని మార్పులు చేసినా ఫలితం ఉండటం లేదు. స్టాటిస్టిక్స్‌లో గత ఏడది 417 సీట్లుంటే, కేవలం 358 మంది చేరారు. ఏంఏ రాజనీతి శాస్త్రంలో 639 మంది చేరారు. ఎమ్మెస్సీ మేథ్స్‌లో 1445కు మించి చేరలేదు. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరే వాళ్లల్లో అమ్మాయిలే ఎక్కువ మంది ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల భాగస్వామ్యంతో పీజీ కోర్సులు నిర్వహించాలని యూజీసీ సూచిస్తోంది. పీజీ తర్వాత పరిశోధన రంగానికి పీజీ విద్యార్థులు వెళ్ళే సరికొత్త విధానంపై కసరత్తు చేయాలని సూచించింది. దీనిపై వచ్చే విద్యా సంవత్సరంలోగా సరికొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని యూజీసీ భావిస్తోంది.

పీజీలోని ప్రధాన కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాలు ...

కోర్సు	2022	2023
ఎంఏ ఇంగ్లిష్	996	1150
ఎంఏ తెలుగు	1063	1092
ఎంకాం	2179	2181
ఎమ్మెస్సీ బాటనీ	1045	1164
ఎమ్మెస్సీ కెమిస్ట్రీ	2385	2188
ఎమ్మెస్సీ గణితం	1445	1326
జువాలజీ	1412	1416
న్యూట్రిషన్	428	780
ఫుడ్ టెక్నాలజీ	289	231
డేటా సైన్స్	-	231

చంద్రబాబు ఆదేశాలతోనే సీఎం జగన్‌పై హత్యాయత్నం

ఇది బొండా ఉమా అనుచరులతో చేయించిన దాడి

- బొండా తప్పించుకోలేడు.. తప్పు చేశాడని తెలుసు కాబట్టే వణికిపోతున్నాడు
- తప్పించుకునేందుకే పోలీసు అధికారులను బాబు, బొండా బెదిరిస్తున్నారు
- బీసీలను దాడులకు ఉసిగొల్పి.. బీసీ కార్డ్ ప్లే చేస్తారా?
- వైఎస్ జగన్ మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యం
- ఆ వెంటనే ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిస్తాం
- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతోనే ఆ పార్టీ నేత బొండా ఉమా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో హత్యాయత్నం చేయించారని స్పష్టమైందని మాజీ మంత్రి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఈ సంఘటనపై టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేయడం చాలా బాధాకరమన్నారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. అనుచరులతో ముఖ్యమంత్రిపై దాడి చేయించిన బొండా ఉమా తప్పించుకోలేడని చెప్పారు. తప్పు చేశాడని తెలుసు కాబట్టే ఉమా వణికిపోతున్నాడని అన్నారు. కేసు నుంచి తప్పించుకునేందుకే చంద్రబాబు, ఉమా పోలీసు అధికారులను బెదిరిస్తున్నారని చెప్పారు. అధికారులను బెదిరించడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని అన్నారు. బీసీలను దాడులకు ఉసిగొల్పి.. బీసీ కార్డ్ ప్లే చేస్తున్నారన్నారు. ఉమా సానుభూతి డ్రామాలకు పడే వారెవరూ లేరని స్పష్టం చేశారు. సీఎం జగన్‌పై దాడి పట్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. నూటికి నూరు పాళ్లు చంద్రబాబు ఆదేశాలతో బొండా ఉమానే దాడి చేయించాడని, దాడి చేసిన వారంతా టీడీపీ వారేనని చెప్పారు. కచ్చితంగా ముఖ్యమంత్రిని హతమార్చే ప్రయత్నమేనని తెలిపారు. ఉమానే ఈ దాడికి ప్రేరేపించినట్టు అన్ని ఆధారాలు దొరుకుతాయన్నారు. సీఎం జగన్ మీద దాడి చేసిన సతీష్‌ను పోలీసులు పట్టుకుంటే, ఆ వెంటనే దుర్గారావును తన ఇంటికి తీసుకెళ్లి బొండా ఉమా బతిమిలాడుకున్నాడన్న విషయం అందరికీ తెలిసిపోయిందని తెలిపారు. ఇటువంటి కాల్‌మనీ సెక్స్ రాకెట్‌గాళ్ల విజయవాడలో పనికి రారని 2019లో ప్రజలు నిర్ణయించారని చెప్పారు. 2024లో కూడా ఉమాను డిపాజిట్ లేకుండా ఓడిస్తారని చెప్పారు. తప్పుచేసిన వాడిని వదలొద్దని ఉమా గురించి ప్రజలు ముక్తకంఠంతో చెప్తున్నారన్నారు. ఉమా నామినేషన్‌కి ఆయన కుటుంబ సభ్యులు తప్ప ఒక్క కార్యకర్తా రాలేదని, అతనికి నియోజకవర్గంలో ఉన్న పేరు, డిపాజిట్లు పోయే పరిస్థితికి అద్దం పడుతోందని చెప్పారు. బొండా బార్లలో కూర్చుని విలాసాలు చేయడం తప్ప ప్రజలకు చేసిందేముందని అన్నారు. కరోనా సమయంలో ఒక్క సారైనా ప్రజల్ని చూశాడా అని ప్రశ్నించారు. అసలు జనంలో కలిసే నైజం అతనికి లేదన్నారు. కనిపించిన భూమినల్లా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తాడని, చివరకు స్వాతంత్ర్య సమరయోధుల భూములనూ వదలడని అన్నారు. ఉమా కొడుకు బైక్ ర్యాలీలతో మనుషులను చంపించేస్తారన్నారు. కాల్‌మనీ సెక్స్ రాకెట్ ద్వారా మహిళల జీవితాలతో చెలగాటమాడిన టీడీపీ నేతలు శ్రీరామచంద్రులా అని ప్రశ్నించారు.

బొండా ఉమాపై ఈసీ చర్యలు తీసుకోవాలి: సంగతి చూస్తానంటూ నగర పోలీసు కమిషనర్‌ని, అధికారులను ఉమా బెదిరిస్తున్నారని, ఈ విషయాన్ని సుమోటోగా తీసుకుని చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం అధికారులను కోరారు. సాక్ష్యాలను తారుమారు చేయడానికి అధికారులను ఉమా బెదిరిస్తున్నారన్నారు. అధికారులందరినీ పేర్లు పెట్టి బెదిరించడం రౌడీయిజం కాదా అని ప్రశ్నించారు. గుంపులో వేశాం కదా తెలియదులే అనుకున్నారని, పోలీసులు వారిలా నిశానీలు అనుకున్నారా అని నిలదీశారు. పోలీసులు సాక్ష్యాధారాలతో నిందితులను పట్టుకున్నారని, వాస్తవాలను బయట పెడుతున్నారని, అందుకే ఉమా వణికిపోతున్నాడని చెప్పారు. తప్పు చేసిన ఉమాకు శిక్ష తప్పదని అన్నారు. ఈ దాడి ఉమా చేయించింది కాబట్టే అతని వద్ద పూర్తి సమాచారం ఉందన్నారు. సీబీఐని ఈ రాష్ట్రంలోకి రాకుండా చేసిన విపక్ష నేతలు ఇప్పుడు ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఎలా అడుగుతారని నిలదీశారు. జూన్ 4 తర్వాత 'జగన్ అనే నేను' అనే ప్రభంజనం తప్ప మరేదీ కనిపించదని తెలిపారు. వైఎస్ జగన్ మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపించి, దోషులను శిక్షిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలవి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప పస లేదని, వాటికి గెలిచే లక్షణాలుంటే ఇన్ని పొత్తులు, జిత్తులు, గమ్మత్తులు ఎందుకని అన్నారు.



> అబద్ధముల నాలకించు రాజునకు
> ఉద్యోగస్థులందరు దుష్టులుగా నుందురు.
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.12.53 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఉత్తర సా.5.08 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.2.26 నుండి 4.10 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.37 నుండి 5.25 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.03 నుండి 10.23 వరకు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నా పేరు.... నారా మోదీ!

జనతంత్రం

వర్ధెల్లి మురళి





బ్రాండ్ బాబు పేరుతో ఏపీలో ఓట్లడిగే వెసులుబాటు లేదు. ఈ సంగతి చంద్రబాబుకు చాలాకాలం కిందటే అర్థమైంది. నాణ్యమైన మద్యం బ్రాండ్ల గురించి మాట్లాడుతున్నారే తప్ప తన బ్రాండ్ నాణ్యత గురించి ఆయన గొప్పగా చెప్పు కోలేకపోతున్నారు. తన ఐదేళ్ల పాలనలో మంచి జరిగితేనే తనకు మద్దతునీయండని ఒక్క పక్క ముఖ్యమంత్రి ప్రజాతీర్పును కోరుతున్నారు. ఆ ప్రయోగం బాబు చేస్తే దుస్సాహసం అవుతుంది. వేగంగా వస్తున్న వందేభారత్ రైలుకు ఎదురుగా పరుగెత్తాలనే ఆలోచన ఆయనెందుకు చేస్తారు? ఒక ఎజెండా లేని తాను జగన్‌మోహన్ రెడ్డితో ముఖాముఖి తలపడటం కూడా అటువంటి ఆలోచనేనని చంద్రబాబుకు తెలుసు.

ఆయన తనకు అలవాటైన దారిలోనే ప్రయాణం చేస్తు న్నారు. నానా తంటాలుపడి తన నట్టింట్లో ఎన్డీఏ కూటమిని కూర్చోబెట్టుకోగలిగారు. అదే సమయంలో ఇంటి చావిట్లోకి 'ఇండియా' కూటమి పేరంటాలనూ పిలుచుకున్నారు. ఇటు వంటి అవకాశవాద వ్యూహాలు ఎన్ని పన్నినా గెలుపు దక్కడం సులభం కాదని ఆయన ఆరో ఇంద్రియం గిల్లి చెబుతున్నది. దాంతో ఆయన తన 'షాడో బాక్సింగ్' అనే ఇంద్రజాల యుద్ధ తంత్రాన్ని కనిష్ఠ స్థాయికి దిగజార్చారు. పాత్రికేయ వృత్తిని బద్మాష్ గిరీ ట్రెండ్‌గా దిగజార్చిన యెల్లో మీడియా వారు ఈ తతంగంలో భాగంగా రోజూ కొన్ని కృత్రిమ నీడల్ని జగన్ సర్కార్ చుట్టూ ప్రయోగిస్తున్నారు. ఈ నీడలది రక్తబీజుడి అంశ. ఆ రాక్షసుడిని చంపేస్తే రాలే ఒక్కో రక్తపు బొట్టులోంచి ఒక్కో రక్త బీజుడు పుట్టుకొస్తాడు. ఈ కృత్రిమ నీడలు కూడా అంతే!

విక్రమార్కుని సింహాసనం మెట్ల మీద ఉండే సాలభంజికలకు మల్లేనే కదిలే యెల్లో నీడలు కూడా కమ్మటి కథలు చెబుతాయి. 'బేతాళ కథల' వంటివే ఇవి కూడా! అంతూ పొంతూ ఉండదు. ఈ నీడలకు తోడుగా మరికొన్ని పాత్రలను తన షాడోలుగా మార్చుకొని బాబు ప్రయోగిస్తున్నారు. శివుడు తన జటాజూటం నుంచి వీరభద్రుడిని ప్రయోగించడమే ఇన్‌స్పిరేషన్. ఈయన తన ప్యాకేజీ పేటిక లోంచి ఒక్కో షాడోను లాగి జనంలోకి ప్రయోగిస్తున్నారు. యెల్లో మీడియా ఉత్పత్తి చేసే బేతాళ కథలే ఈ షాడోల ప్రసంగ పాఠాలు. పవన్ కల్యాణ్ దగ్గర్నుంచీ ప్రశాంత్ కిశోర్ దాకా ఈ బాపతు వాళ్లు చాలామందే ఉన్నారు. షర్మిల సిస్టర్స్ కూడా ఆ తాను ముక్కలే! 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఊరేగుతున్న వృద్ధనారీ పతివ్రతలంతా ఈ కోవలోనివారే!

కాలం కలిసిరాకపోతే తాడే పామై కాటేస్తుందట. చంద్ర బాబు పరిస్థితి కూడా ఆ విధంగానే ఉన్నది. ఆయన షాడోల ద్వారా చెప్పిస్తున్న కథలకు ఆయన క్యాంపు నుంచే కౌంటర్‌లు పడుతున్నాయి. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య దుర్ఘటన బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగింది. ఆయన ఆధ్వర్యంలోని పోలీసులే దర్యాప్తు జరిపారు. అప్పుడు బాబుకు కనిపించని రాజకీయ కోణం తన అవసరాలకు అనుగుణంగా ఆ తర్వాత కాలంలో కనిపించింది. హత్యను వైఎస్ అవినాశ్ రెడ్డి మెడకు చుట్టి, వైసీపీని ఆత్మరక్షణ వైపు నెట్టాలని ఆయన పన్నాగం. దీని కోసం ఓ కథను వండించారు. స్థానిక సంస్థల నుంచి శాసన మండలికి జరిగిన ఎన్నికల్లో వివేకాను పార్టీ తరఫున ముఖ్య మంత్రి నిలబెట్టారు. మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నప్పటికీ ఆయన ఓడిపోయారు. ఇందుకు అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి వగైరాలే కారణమని, అందువల్లనే కోపం పెంచు కున్న వివేకా ఎంపీ టిక్కెట్‌ను అవినాశ్‌కు ఇవ్వొద్దని చెబుతు న్నారనీ, ఆ కారణంగా వివేకాను అడ్డు తొలగించుకునేందుకు అవినాశ్ తదితరులు హత్యకు ప్లాన్ చేశారనేది టీడీపీ అల్లిన కథ.

'ఔను అది మా కథే. వివేకాను ఓడించింది మేమే'నని ఇన్నాళ్లకు సాక్షాత్తు 'హార్స్ మౌత్' సకిలించింది. అప్పటి తెలుగుదేశం నాయకుడు, నేడు బీజేపీలో బాబు అంతేవాసిగా ఉన్న సీఎం రమేశ్ ఈ సంగతి కుండబద్దలు కొట్టారు. జర్నలిస్టు సాయికి ఇచ్చిన ఇంటర్వ్యూలో రమేశ్ దీనిపై స్పష్టత ఇచ్చారు. కడప జిల్లాలో వైఎస్ కుటుంబ సభ్యులొకరిని ఓడించడం ఇంతకు ముందెన్నడూ సాధ్యం కాలేదనీ, తన వల్లే ఆ ఘనత సాధ్యమైందనీ రమేశ్ గొప్పగా చెప్పుకున్నారు. అవినాశ్‌పై అల్లిన కుట్రకథకు దాని తల్లి వేరే బూటకమని స్పష్టమైపోయింది. దాని ఆధారంగా అల్లిన మిగతా కథ గురించి చెప్పేదేముంటుంది?

విక్రమార్కుని సింహాసనం మెట్ల మీద ఉండే సాల భంజికలకు మల్లేనే కదిలే యెల్లో నీడలు కూడా కమ్మటి కథలు చెబుతాయి. 'బేతాళ కథల' వంటివే ఇవి కూడా! అంతూ పొంతూ ఉండదు. ఈ నీడలకు తోడుగా మరికొన్ని పాత్రలను తన షాడోలుగా మార్చుకొని బాబు ప్రయోగిస్తున్నారు. శివుడు తన జటాజూటం నుంచి వీరభద్రుడిని ప్రయోగించడమే ఇన్‌స్పిరేషన్. ఈయన తన ప్యాకేజీ పేటికలోంచి ఒక్కో షాడోను లాగి జనంలోకి ప్రయోగిస్తున్నారు. యెల్లో మీడియా ఉత్పత్తి చేసే బేతాళ కథలే ఈ షాడోల ప్రసంగ పాఠాలు. పవన్ కల్యాణ్ దగ్గర్నుంచీ ప్రశాంత్ కిశోర్ దాకా ఈ బాపతు వాళ్లు చాలామందే ఉన్నారు. షర్మిల సిస్టర్స్ కూడా ఆ తాను ముక్కలే! సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఊరేగుతున్న వృద్ధనారీ పతివ్రతలంతా ఈ కోవలోనివారే!

కాలం కలిసిరాకపోతే తాడే పామై కాటేస్తుందట. చంద్రబాబు పరిస్థితి కూడా ఆ విధంగానే ఉన్నది. ఆయన షాడోల ద్వారా చెప్పిస్తున్న కథలకు ఆయన క్యాంపు నుంచే కౌంటర్‌లు పడుతున్నాయి. వైఎస్ వివేకా నంద రెడ్డి హత్య దుర్ఘటన బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగింది. ఆయన ఆధ్వర్యంలోని పోలీసులే దర్యాప్తు జరిపారు. అప్పుడు బాబుకు కనిపించని రాజకీయ కోణం తన అవసరాలకు అనుగుణంగా ఆ తర్వాత కాలంలో కనిపించింది. హత్యను వైఎస్ అవినాశ్ రెడ్డి మెడకు చుట్టి, వైసీపీని ఆత్మరక్షణ వైపు నెట్టాలని ఆయన పన్నాగం. దీని కోసం ఓ కథను వండించారు.

వివేకా హత్యను అవినాశ్ మెడకు చుట్టి ఎన్నికలయ్యేంత వరకు ప్రచారంలో పెట్టడమే సునీతా సిస్టర్స్‌కు చంద్రబాబు ఇచ్చిన కార్యక్రమం. రాష్ట్రవ్యాప్తంగా షర్మిల, కడప జిల్లాతో పాటు వీలైన ఇతర చోట్ల సునీత రోజూ ఈ విషయంపై మాట్లాడుతూ జగన్ సర్కార్‌ను అప్రతిష్ఠపాలు చేయాలి. ఇదీ వారికి చంద్రబాబు అప్పగించిన బాధ్యత. బాధ్యతను స్వీకరించ డానికి వారివారి కారణాలు వారికి ఉన్నాయి. ఇదిలా వుండగా న్యాయస్థానంలో విచారణలో ఉన్న అంశంపై పబ్లిగ్గా ఎవరూ మాట్లాడకూడదని కడప కోర్టు మొన్న గట్టిగా హెచ్చరించింది. ఇదేమీ కొత్తకాదు. న్యాయస్థానం ముందున్న అంశంపై కామెంట్స్ చేయడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. ఇది అంద రికీ తెలిసిన విషయం.

తన స్క్రిప్టే హత్యకేసు అయినప్పుడు దానిపై మాట్లాడ కుండా ఎలా వుండాలని ఇప్పటికే సునీత బయటపడిపోయింది. పై కోర్టుకు అప్పీలుకు వెళ్తానని చెప్పింది. వెళ్లొచ్చు! తప్పే ముంది? కాకపోతే వైఎస్ జగన్ సర్కార్‌ను ఇరుకున పెట్టడమే తమ అసలు లక్ష్యం తప్ప ఇంకో రాచకార్యమేదీ తమకు లేదని ఈ చర్య ద్వారా నిరూపించుకుంటారు.

ఇదే తరుణంలో జాతరకత్న మిడతంబొట్లుగా లోకానికి పరిచయమైన ప్రశాంత్ కిశోర్ (పీకే) బండారాన్ని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బట్టలూడదీసి బయటపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు కొంతకాలంగా పీకే వ్యవహారం పలువురికి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. సీఎం రమేశ్ సమకూర్చే ప్రత్యేక విమానంలో విజయవాడకు వెళ్లడం, కరకట్ట ప్యాలెస్‌లో చంద్రబాబుతో మూడు నాలుగు గంటల మంత నాలు, ఆ పిదప మీడియాతో మాట్లాడటం, ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందని చెప్పడం పీకేకు రివాజుగా మారింది. పైగా తాను చంద్రబాబుకు వ్యూహకర్తగా పనిచేయడం లేదనీ, తన అనుభవంతో ఫలితాలను ఊహిస్తున్నాననీ చెప్పుకొస్తున్నారు.

'టీవీ9 – బంగ్లా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మమతా బెనర్జీ ఈ విషయంపై పూర్తి స్పష్టత ఇచ్చేశారు. ప్రశాంత్ కిశోర్ తమకు ఈ ఎన్నికల్లో పనిచేయడం లేదనీ, ఆంధ్రలో చంద్రబాబు కోసం పనిచేస్తున్నారనీ స్పష్టం చేశారు. ఈ విషయంపై తనకు పూర్తి అవగాహన ఉన్నదని కూడా ఆమె చెప్పారు. చంద్రబాబుకు ఆమె వ్యతిరేకేమీ కాదు. గత ఎన్నికల్లో చంద్రబాబుకు ఒకటి రెండు సభల్లో ప్రచారం కూడా చేసిపెట్టారు. మమతా బెనర్జీ ఇంటర్వ్యూ ద్వారా వెల్లడైన విషయమేమిటంటే చంద్రబాబు తరఫున సీనియర్ సలహాదారుగా పీకే పని చేస్తున్నారు. తెలుగు దేశం పార్టీకి వ్యూహకర్తగా పనిచేస్తున్న రాబిన్ శర్మ ఒక దశలో చేతులెత్తేశారు. 'మీ పార్టీ గెలవడం సాధ్యం కాద'ని పార్టీ నేతల ముందే కుండబద్దలు కొట్టారని వినికిడి. ఈ దశలో రాబిన్ శర్మను బుజ్జగించడం కోసం పీకేను చంద్రబాబు ప్రవేశపెట్టారు. రాబిన్ శర్మను గైడ్ చేయడంతో పాటు టీడీపీ గెలుస్తుందనే చిలక జోస్యాలు కూడా పది రోజులకోసారి పీకే చెప్పాలని ఒప్పందం కుదిరింది.

ఇటువంటి ఒప్పందమే 'ఆంధ్రా ఆక్టోపస్'గా ప్రకటిం చుకున్న లగడపాటి రాజగోపాల్‌తో గత ఎన్నికల్లో చంద్రబాబు కుదుర్చుకున్నారు. ప్రచండంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను దాచిపెట్టి చంద్రబాబు గెలవబోతున్నాడని జోస్యం చెప్పారు. ఫలితాల తర్వాత రాజగోపాల్ పరువు పంచనామా అయి పోయింది. నాడు రాజగోపాల్‌కు పట్టిన దుర్గతే ఈ ఎన్నికల తర్వాత మన మిడతంబొట్లు పీకేకు కూడా పట్టనున్నది.

ఒక పక్క ఈ తరహా 'షాడో బాక్సింగ్' క్రీడోత్సవాలు నిర్వహిస్తూనే కూటమి ఏర్పాటు కోసం బాబు ఎన్ని కష్టాలు పడ్డారో స్వర్గంలో ఉన్న ఎన్టీఆరే చెప్పాలి. ఢిల్లీ పెద్దల కాళ్లు కూడా పట్టుకున్నానని పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన మనకింకా గుర్తే! అదీ చంద్రబాబు తరఫున! ఇందుకోసం పవన్‌ను ఏ స్థాయిలో చంద్రబాబు ఉత్తేజపరిచి ఉంటాడు? ఏ స్థాయిలో

'టీవీ9 – బంగ్లా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మమతా బెనర్జీ ఈ విషయంపై పూర్తి స్పష్టత ఇచ్చేశారు. ప్రశాంత్ కిశోర్ తమకు ఈ ఎన్నికల్లో పనిచేయడం లేదనీ, ఆంధ్రలో చంద్రబాబు కోసం పనిచేస్తున్నారనీ స్పష్టం చేశారు. ఈ విషయంపై తనకు పూర్తి అవగాహన ఉన్నదని కూడా ఆమె చెప్పారు. చంద్రబాబుకు ఆమె వ్యతిరేకేమీ కాదు. గత ఎన్నికల్లో చంద్రబాబుకు ఒకటి రెండు సభల్లో ప్రచారం కూడా చేసిపెట్టారు. మమతా బెనర్జీ ఇంటర్వ్యూ ద్వారా వెల్లడైన విషయమేమిటంటే చంద్రబాబు తరఫున సీనియర్ సలహాదారుగా పీకే పని చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి వ్యూహకర్తగా పని చేస్తున్న రాబిన్ శర్మ ఒక దశలో చేతులెత్తేశారు. 'మీ పార్టీ గెలవడం సాధ్యం కాద'ని పార్టీ నేతలముందే కుండ బద్దలు కొట్టారని వినికిడి. ఈ దశలో రాబిన్ శర్మను బుజ్జగించడం కోసం పీకేను చంద్రబాబు ప్రవేశపెట్టారు. రాబిన్ శర్మను గైడ్ చేయడంతో పాటు టీడీపీ గెలుస్తుం దనే చిలక జోస్యాలు కూడా పది రోజులకోసారి పీకే చెప్పాలని ఒప్పందం కుదిరింది.

ఇటువంటి ఒప్పందమే 'ఆంధ్రా ఆక్టోపస్'గా ప్రకటిం చుకున్న లగడపాటి రాజగోపాల్‌తో గత ఎన్నికల్లో చంద్రబాబు కుదుర్చుకున్నారు. ప్రచండంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను దాచిపెట్టి చంద్రబాబు గెలవ బోతున్నాడని జోస్యం చెప్పారు. ఫలితాల తర్వాత రాజగోపాల్ పరువు పంచనామా అయిపోయింది. నాడు రాజగోపాల్‌కు పట్టిన దుర్గతే ఈ ఎన్నికల తర్వాత మన మిడతంబొట్లు పీకేకు కూడా పట్టనున్నది.

ఉద్దీపింపజేసి ఉంటాడు? ఆ ఉద్దీపనకు ఎంత 'చమురు' కాలి ఉంటుంది? చంద్రబాబుకే తెలియాలి. అదంతా ఒక ఎత్తు. ఐదేళ్ల కింద నరేంద్ర మోదీని తాను ఎన్ని మాటలన్నారు? ఉగ్రవాది అన్నారు. ఇంకా పెద్ద పెద్ద మాటలు చాలా అన్నారు. ప్రజలకవి గుర్తే! వాటిని మళ్లీ ప్రస్తావించడం ప్రధానమంత్రి గౌరవానికి కూడా భంగం కనుక వదిలేద్దాము.

పొత్తు కుదిరిన తర్వాత మోదీని ప్రసన్నం చేసుకోవడానికి బాబు పడిన ప్రయాస పగవాడికి కూడా రాకూడదు. చిలక లూరిపేటలో ప్రధాని పాల్గొన్న సభలో చంద్రబాబు ఎన్ని వినయాలు ఒలకబోశారో! ప్రధానికి అర్థం కావడం కోసం తనకు తెలియని హిందీ భాషలో రాసుకొచ్చుకొని మరీ భజన చేశారు. 'నగుమోము కనలేని నా జాలీ తెలిసీ...' అనే త్యాగరాజ కీర్తన గుర్తుకొచ్చింది. మొత్తానికి ప్రధాని మందు గుంజీలు తీసినంత స్థాయిలో హావభావాలు ప్రదర్శించారు.

ఎంత కష్టపడినా ఫలితం దక్కే సూచనలు కనిపించడం లేదు. రోజురోజుకూ వైసీపీ బలం పెరుగుతున్నదని సమస్త సర్వేలు ముక్తకంఠంతో ప్రకటిస్తున్నాయి. బాబు అదుపు తప్పు తున్నారు. ముఖ్యమంత్రిపై విచక్షణా రహితంగా బూతులు కురిపిస్తున్నారు. 'రాళ్లతో కొట్టండి, చేతికి ఏది దొరికితే దానితో కొట్టండ'ని టీడీపీ శ్రేణులను ఉసిగొల్పడం మొదలుపెట్టారు. గ్లాసు (జనసేన గుర్తు) పగిలితే ఎంత పదునుగా ఉంటుందో తెలుసుగదా దాంతో..... (కంఠాన్ని కోసేయాలనే సైగ) అంటూ జనసేన కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. పర్యవసానం కనిపించింది. ముఖ్యమంత్రిపై హత్యాయత్నం జరిగింది. అదృష్టవశాత్తు ఆయన క్షేమంగా ఉన్నారు. బాబు మాత్రం విచక్షణ కోల్పోతూనే ఉన్నారు. దిగజారుడులో చివరిమెట్టుకు చేరుకున్నారు.

ఆఖరి మాటగా తనను కాదు... ఎన్డీఏను చూసి ఓటెయ్య మని చంద్రబాబు అభ్యర్థిస్తున్నారు. తన ముఖంలో నరేంద్ర మోదీ ముఖాన్ని చూసుకోండని సలహా ఇస్తున్నారు. జాతీయ స్థాయిలో మోదీ పార్టీ పరిస్థితే అంతంత మాత్రంగా ఉన్నది. ఎన్డీఏ కూటమితో కలిసి మహా అయితే బొటాబొటి మెజారిటీతో గట్టెక్కవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మోదీ ప్రభ దేదీప్యమానంగా ఉన్న రోజుల్లో ఆయన్ను తిట్టిపోసిన బాబు, వెలుగులు తగ్గుతున్న వేళ పొగడ్తలు కురిపిస్తున్నారు. భలే టైమింగ్ బాబు గారూ మనది!

vardhelli1959@gmail.com

మల్లికార్జున్ ఖర్గే (కాంగ్రెస్ అధ్యక్షుడు)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఢిల్లీలో నేను నిద్ర లేచేటప్పటికే దేశంలో పోలింగ్ మొదలైపోయింది! కర్ణాటక ఎటూ మొదటి విడత పోలింగ్‌లో లేదు కనుక ఉదయాన్నే నేను కర్ణాటక వెళ్లి ఓటేసి వచ్చేది కూడా ఏమీ లేదు.

సరిగ్గా ఉదయం 7 గంటలకు 18 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో తొలి విడతగా భళ్లున తెల్లారింది అన్నంతగా టీవీలు హడావిడి చేస్తున్నాయి.

నిజానికి మొదలైంది తొలి విడత పోలింగ్ కాదు... తొలి విడత పోరాటం! రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు మొదలైన భారత ప్రజా పోరాటం! ఏడు విడతలుగా జూన్ 1 వరకు సాగే ఈ పోరా టంలో ఓటర్లు తమకు ఎవరు కావాలన్నది పక్కన పెట్టి, తమకు ఎవరు వద్దో నొక్కి చెప్పబోతున్నారు. జూన్ 4న దేశానికి స్వేచ్ఛను ఇవ్వబోతున్నారు. విముక్తిని కల్పించ బోతున్నారు!

ఎందుకో తెలీదు – ఓటేయబోతున్న పోరాట యోధులకు ఏదైనా సందేశం ఇస్తే బాగుంటుందని నాకు అనిపించింది.



సందేశాన్ని ఎలా ఇవ్వాలా అని కొన్ని క్షణాలు ఆలోచించాను.

నేరుగా "ఓట్ ఫర్..." అనేయటానికి లేదు. సందేశం ప్రచారంలా ఉంటే ఎన్నికల కమిషన్ పట్టేస్తుంది. అదే... ప్రవచనంలా ఉంటే? మోదీజీ కూడా పట్టనట్లు ఉండిపోతారు. మోదీజీనే పట్టనట్లు ఉండిపోతే.. ఎన్నికల కమిషన్ కొండను తవ్వినా ఆ ఇంత ఎలుకను కూడా పట్టలేదు.

మంచం మీద నుంచి లేవకుండానే మరికొన్ని క్షణాలు ఆలోచించాను.

దేశానికి ఇప్పుడేం కావాలి? పదేళ్లుగా లేనిది ఏదైనా కావాలి. యువతకు ఉద్యోగాల్లేవు. మహిళల చేతుల్లో డబ్బుల్లేవు. రైతులకు గిట్టుబాటు ధరల్లేవు. శ్రామికులకు కష్టఫలితం లేదు. మైనారిటీలకు రక్షణ లేదు. ఇవన్నీ కావాలి.

ఇంకొన్ని క్షణాలు ఆలోచించాను. దేశానికి ఇప్పుడేం అవసరం లేదు? సి.ఎ.ఎ.ల ఏలివేతలు అవసరం లేదు. త్రీ సెవంటీల తీసివేతలు అవసరం లేదు. ఆలుమగల ట్రిపుల్ తలాక్ తగవులు, ఆలయ నిర్మాణాల అడ్జర్న్‌మెంట్‌లు అవసరం లేదు. చైనాతో దొక్కాదొక్కా పట్టుకోవటం అవసరం లేదు. మాంసాహారంపై మాటా మాటా అనుకోవటం కూడా అవసరం లేదు. ఇవన్నీ పోవాలి.

ఎలా... ఎన్నికల నియమావళిలోకి రాకుండా... ఒక్కమాటతో 'ఇవన్నీ కావాలి', 'ఇవన్నీ పోవాలి' అని ఓటర్లందరినీ మోటివేట్ చెయ్యటం?!

ట్విట్టర్‌లోకి వెళ్లి, "అడుగడుగున న్యాయం పడి లేస్తూ ఉన్నప్పుడు అన్యాయాన్ని ఓడించ టమే మీ ధర్మం. న్యాయాన్ని గెలిపించటమే మీ కర్తవ్యం. ఓటే మీ అస్త్రం, శస్త్రం... ఆయుధం" అని పోస్ట్ పెట్టాను.

"భలే పెట్టారండీ ఖర్గేజీ... ఎలక్షన్ కమి షన్‌కి ఒక్క ముక్క అర్థం కాకుండా.." అని నవ్వుతూ కంగ్రాట్స్ చెప్పారు సోనియాజీ.

"థ్యాంక్యూ మేడమ్ జీ..." అన్నాను.

తొలి విడత పోటీలో ఉన్న ప్రముఖుల్ని టీవీలో చూపిస్తున్నారు. కిరణ్ రిజుజు, జితిన్ రామ్ మాంఝీ, నితిన్ గడ్కరీ, దయానిధి మారన్, ఎ. రాజా, కార్తీ చిదంబరం, కనిమొళి, ఇమ్రాన్ మసూద్, జితిన్ ప్రసాద్... లిస్ట్ సాగుతోంది. తొలి విడతలోనే మిగతా అన్ని విడతల కన్నా ఎక్కువగా 102 నియోజక వర్గాలకు పోలింగ్ జరుగుతోందని కూడా చెబుతున్నారు.

ఫోన్‌లో క్యాలిక్యులేటర్ ఓపెన్ చేశాను. మోదీజీ 400 సీట్లకు పైగా గెలుస్తాం అని అంటున్నారు. 543 కి 400 అయితే 102కి ఎంత అని ఊరికే లెక్కేశాను.

ఆ తర్వాత ఇంకో లెక్క వేశాను. 543కి 150 అయితే 102కి ఎంత అని. ఈ లెక్క మాత్రం ఊరికే వేసింది కాదు. సీరియస్‌గా వేసింది. బీజేపీకి అంతకన్న ఒక్కటి ఎక్కువొచ్చినా, ఒక్కటి తక్కువొచ్చినా నా లెక్క తప్పినట్లేం అవదు.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇదిగో ఇదీ మన విజ్ఞాన పరిణామ క్రమం

అభిప్రాయం




చార్వాక

అభివృద్ధి చెందిన నేటి సమాజంలో అశాస్త్రీయ భావజాలాలను శాస్త్రీయంగా ప్రజల్లోకి తీసుకు వెళుతున్నారు కొందరు. నిజానికి ఇప్పుడున్న నమ్మకాలూ, శాస్త్రవిజ్ఞానానికి పునాదులూ ఆదిమ సమాజంలోనే ఉన్నాయి. మానవుడి పరిణామ క్రమంలో రెండు లక్షల సంవత్సరాల క్రితం కోతి-మనిషి ఇద్దరూ ఒకే ఒక ఉమ్మడి కుటుంబం నుండి పరిణామం చెందుతూ వచ్చారు. ఈ క్రమంలో పదివేల సంవత్సరాల క్రితం ఆధునిక మానవుడిగా పరిణామం చెందాడు మనిషి.

ఆదిమ మానవుడి మొదటి అద్భుత ఆవిష్కరణ నిప్పు అయితే రెండవది చక్రం. తర్వాత రోజుల్లో కని పెట్టిన క్యాలెండర్ (కాల పట్టిక) అంతటి ప్రాధాన్యం ఉన్నదే. ప్రతిరోజు ఉదయాన్నే తెల్ల వారడం, రాత్రిళ్ళు కాగానే చీకటి పడడం వంటి పరిస్థితుల్లో మనుగడ కోసం పోరాటం చేస్తూ ప్రకృతిని అర్థం చేసుకోవడానికి మనిషి ఘర్షణ పడుతూ ఉండేవాడు. సంవత్సర కాలంలో కొన్నిసార్లు ఎండలు ముదరడం, కొన్నిసార్లు వానలు పడడం, కొంతకాలం చలి వేయడం గమనిస్తూ వచ్చి ఋతువుల్ని గుర్తించగలిగాడు. ఉదయం తెల్లవార గానే సూర్యుడి రాక, రాత్రులు చీకటి కాగానే చంద్రుడు రావడం గమనించి క్రమ పద్ధతిలో దాన్ని ఒక రోజుగా గుర్తించడం జరిగింది. రాత్రులు నక్షత్రాల సమూహా లను గమనించిన మనిషి కుంభ రాశిలో ఎక్కువ వర్షం కురవడం గమనించాడు. నక్షత్ర రాశులను గమనించిన మనిషి ప్రాథమిక పరిశీలనలో ఆ నక్షత్ర సమూహాలకు తనకు తెలిసిన జీవుల పేర్లను, తనకు బాగా పరిచయం ఉన్న వస్తువుల పేర్లను పెట్టుకున్నాడు. అలాగే తెల్లవార గానే సూర్యుడు వచ్చే సమయానికి పగటిపూట గాను, రాత్రులు కాగానే చీకటి కమ్ముకున్న సమయంలో చంద్రుడు వచ్చే సమయాన్ని రాత్రి గాను – ఈ రెంటినీ కలిపి ఒకరోజు గాను నిర్ణయించుకున్నాడు.

ప్రపంచ దేశాల్లో బాబిలోనియన్లు, ఈజిప్షియన్లు, యూదులు, గ్రీకులు, రోమన్లు, ముస్లింలు, క్రిస్టియన్లు... ఇలా చాలామంది తమ తమ ఆచార సంప్ర



దాయాలు, నమ్మకాలను ఆధారంగా కాల క్రమంలో క్యాలెండర్లు తయారు చేసుకున్నారు.

మనదేశంలో దాదాపు క్రీస్తుపూర్వం 1,500 సంవత్సరాల క్రితమే 'సిద్ధాంత జ్యోతిష్యం' ప్రవేశించింది. ఆర్యభట్ట, మొదటి భాస్కరుడు, రెండవ భాస్కరుడు, బ్రహ్మగుప్తుడు, వరాహమిహిరుడు భూమి పైన జరిగే భౌతిక మార్పులను గుర్తించడమే జ్యోతిష్య శాస్త్రం అనీ, దీన్ని సిద్ధాంత జ్యోతిష్యం అని శాస్త్ర బద్ధీకరించే ప్రయత్నం చేశారు. ఒక రోజుకు 24 గంటలు ఉంటే 15 రోజులను ఒక పక్షంగానూ, నెలకు రెండు పక్షాలు – ఒకటి శుక్లపక్షం రెండవది కృష్ణ పక్షం గానూ, రెండు నెలల కాలాన్ని ఒక ఋతువు గానూ, ఒక సంవత్సర కాలంలో ఆరు ఋతువులుగానూ గుర్తించారు.

30 రోజుల కాలాన్ని ఒక నెల రోజులుగా, 12 నెలలను ఒక సంవత్సరంగా, ఇందులో 6 నెలల కాలాన్ని ఉత్తరాయణంగా, తరువాతి 6 నెలలను దక్షిణాయనంగా విభజించారు. 12 నెలల కాలాన్ని సంవత్సరంగా, ఇటువంటి సంవత్సరాలను ప్రభవ నుంచి అక్షయ వరకు 60 ఏళ్లుగా విభజించారు. సిద్ధాంత జ్యోతిష్యం ఆధారం చేసుకుని కొన్ని దశాబ్దాల క్రితమే మనం తయారు చేసుకున్న క్యాలెండర్‌లోని అంశాలు ఇవి.

అయితే నమ్మకాలు అన్నీ నిజం కావు. అలాగే నమ్మకాలు నిరూపణకు నిలబడవు. అటువంటి నిరూపణకు నిలబడని నమ్మకాలే, మూఢ నమ్మకాలుగా మారతాయి. దీనికి చక్కటి ఉదాహరణ ఫలిత జ్యోతిష్యం. ఫలిత జ్యోతిష్యం అనేది పూర్తిగా అశాస్త్రీయం. అబద్ధాలతో కూడుకున్నది. జరుగుతున్నది, జరగబోయేది దీని ప్రకారం చెప్తామంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఫలిత జ్యోతిష్యం ఆధారంగా సమాజంలో ప్రజలను ఆర్థిక దోపిడీకి, మానసిక పీడనకు గురి చేస్తున్నారు. ప్రజలను శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా దోచుకుంటున్నారు.

ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్నీ, ఆలోచించే జ్ఞానాన్నీ పెంపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైన; సామాజిక మాధ్యమాలు, ప్రసార మాధ్యమాలపైన ఉంది. మూఢనమ్మకాలను నిర్మూలిద్దాం. శాస్త్రీయ సమ సమాజాన్ని నిర్మిద్దాం.

వ్యాసకర్త సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్
జాతీయ సమన్వయకర్త । 93472 84111

యోగి – భోగి – రోగి



మనిషి జీవితంలో నిద్రాహారాలకు అధిక ప్రాధాన్యం ఉంది. ప్రతి రోజు నిద్రపోయే మనిషి ఒక రాత్రి నిద్ర లేకపోయినా, ఒక రోజు ఆహారం తీసుకోకపోయినా అతడి దైనందిన జీవితం ఒకింత కుదుపుకు లోనవుతుంది. పగటి సమయం వ్యవహారాలకు, రాత్రిళ్ళు నిద్రకు అని నిర్దేశింపబడినప్పటికీ, నిద్ర లేని వారు, నిద్ర రాని వారు మనకు దర్శనమిస్తూ ఉంటారు. వారే యోగులు, భోగులు, రోగులు.

1. యోగులు నిద్రను తమ వశంలో పెట్టుకుంటారు. కానీ నిద్ర వశంలోకి తాము వెళ్ళరు. '**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ.**' సామాన్య జనులందరూ నిద్రకు వశమయ్యే బ్రాహ్మీ ముహూర్త సమయంలో యోగి పుంగవులు మేల్కొంటారు. ఆ సమయాన్ని ధ్యానానికీ, జపతపాదులకూ, జ్ఞానార్జనకూ ఉపయోగిస్తారని భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు సూచించాడు.

2. భోగాలను కోరేవారు రాత్రి సమయాన్ని ఎక్కువగా ఇష్టపడతారు. అయితే రాత్రివేళ వీరు నిద్రకు ప్రాధాన్యాన్ని ఇవ్వరు. నిద్రకు వశమైతే భోగాలకు దూరం అవుతాము అనే భయంతో నిద్రపోరు, పోలేరు. '**అతి సర్వత్ర వర్జయేత్.**' ఏది ఎక్కువైనా అది మంచిది కానే కాదు అనే విషయాన్ని వీరు విస్మరించి భోగలాలసలో పడిపోతారు. రాత్రింబవళ్ళు భోగానుభవానికై పరితపిస్తారు. ఆ విధంగా కుంగి కృశించి పోతారు.

3. రకరకాల కారణాలతో శారీరక, మానసిక ఆరోగ్యాలకు దూరమై, రోగ బాధలను అనుభవించే రోగులు సుఖనిద్రకు నోచుకోరు. అటు రోగ బాధను భరించలేక, ఇటు నిద్ర పట్టక నరక యాతన పడుతుంటారు. నిద్ర మాత్రలకు అలవాటు పడతారు. ఆ మోతాదు కూడా సరిపోకపోతే జీవితం మీదనే విరక్తి చెందుతారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు

"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు
యుక్తః స్వప్నావబోధస్య యోగోభవతి దుఃఖహా" అన్నాడు.

ఆహార విహారాలలో, కర్తవ్య నిర్వహణలో (కర్మాచరణలో) నిద్రించడం, మేల్కొనడం అనే వాటిలో ఎక్కువ తక్కువలు లేకుండా ప్రవర్తించే వారికి దుఃఖనాశకరమైన ధ్యాన యోగం సిద్ధిస్తుందని పేర్కొన్నాడు.

దేశ కాల వయో లింగ భేదాలు లేకుండా ఆరోగ్యకరమైన రీతిలో, అందరూ శాశ్వతంగా మేలు కలిగే విధంగా నిద్రాహారాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే సత్యాన్ని గుర్తిద్దాం. పాటించేందుకు కృషి చేద్దాం.

– సముద్రాల శఠగోపాచార్యులు

క్లుప్తంగా...

అనన్యరెడ్డిని సన్మానించిన సీఎం రేవంత్‌రెడ్డి



అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన సివిల్స్ మూడో ర్యాంకర్ దోనూరు అనన్య రెడ్డిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. హైదరాబాద్‌లో సీఎం నివాసానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి వెళ్లిన అనన్య రెడ్డికి సీఎం శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనన్యరెడ్డిని చదువుల్లో ప్రోత్సహించిన ఆమె కుటుంబసభ్యులను అభినందించారు. అంతకు ముందు హైదరాబాద్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లిన అనన్యరెడ్డిని ఎమ్మెల్యే దంపతులు శాలువాతో సత్కరించి అభినందించారు.


సీఎంతో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బ్రాహ్మణ ప్రముఖులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. శనివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో బ్రాహ్మణ సంఘాల నేత తులసి శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్‌ల ఆధ్వర్యంలో పలు సంఘాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా వేద పండితుడు సన్నిధానం శ్రీధర్‌శర్మ బృందం సీఎంకు ఆశీర్వాద మిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన నిరాటంకంగా సాగాలని దీవించారు. పేదల సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భవిష్యత్తులో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌ను కలిసిన వారిలో రాష్ట్ర, జంట నగరాల బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు వారణాసి వంశీ, వక్కలంక శ్రీనివాస్, నందిరాజ్ లక్ష్మీనారాయణ, మంగు రాఘవరావు, మంగపతిరావు, వడ్లమాని మమత ఉన్నారు.

ఐఎస్‌యూ అధ్యక్షుడిగా పాపని నాగరాజు

సాక్షి, హైదరాబాద్: ఇండియా విద్యార్థి సంఘం(ఐఎస్‌యూ) జాతీయ అడ్‌హాక్ కమిటీ ఏర్పాటైంది. జాతీయ అధ్యక్షుడిగా పాపని నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాతీయ కమిటీ ప్రతినిధులుగా పి.వెంకటేశ్‌గౌడ్ (తెలంగాణ), జి.విజయ్‌కుమార్, ఇక్బాల్ (ఆంధ్రప్రదేశ్) నియమితులయ్యారు. తెలంగాణ బహుజన విద్యార్థి సంఘం ఐఎస్‌యూలో విలీనమైనట్లు నూతన కమిటీ ప్రకటించింది. ఐఎస్‌యూ ప్రధాన లక్ష్యం విద్య జాతీయీకరణ, విద్యకు సంతృప్తికరస్థాయిలో నిధుల కేటాయింపు, అవసరాలకు తగ్గట్టు నియమాకాలు, విద్యాలయాల్లో రాజకీయ నేతలు రాకుండా చర్యలు, కుల, మత లింగ అణచి వేత, వివక్ష లేకుండా చేయడమని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రైవేట్ అటానమస్ విద్యాసంస్థల–ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు నిలుపుదల, విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్టవేసేలా ఉద్యమించనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఈనెల 18,19 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చర్చించిన తర్వాత ఈ కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

చేనేత పూర్వ వైభవానికి చర్యలు తీసుకోవాలి



సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల చేనేత పరిశ్రమ పూర్వ వైభవం సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, చేనేత కార్మికుల బకాయిలు మొదట విడతగా రూ.50 కోట్లను విడుదల చేయడం మంచి నిర్ణయమని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన శనివారం ఓప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలకు సంబంధించి మొత్తం రూ.351 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మిగతా బకాయిలను కూడా త్వరలో విడుదల చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు.

సవరణ



20వ తేదీ నాటి సాక్షి పత్రికలో 'హైదరాబాద్–జల్గావ్‌కు విమాన సర్వీసు ప్రారంభం' వార్తలో ఈ చిత్రానికి బదులుగా పొరపాటున వేరే చిత్రం ప్రచురితమైంది.

మెదక్ అభివృద్ధిని చూపించడానికి సిద్ధం

సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్

- నాడు మెదక్ జిల్లాకు నిధులు తరలిస్తున్నారని విమర్శించారు.. ఇప్పుడేమో అభివృద్ధి చేయలేదంటారా?
- కేసీఆర్ కృషివల్లే ఈ ప్రాంతంలో అభివృద్ధి
- సమస్యలపై నిలదీస్తే అసహనమెందుకు?



గజ్వేల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపించడానికి సిద్ధంగా ఉన్నానని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. ఈ నియోజకవర్గంలో ఇందిరా గాంధీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ముఖ్యమంత్రి చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. అభివృద్ధి అంతా ఉమ్మడి మెదక్ జిల్లాలోనే జరిగిందని, సిద్దిపేట, గజ్వేల్‌కు నిధులు తరలించుకుపోయారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, మెదక్ సభలో అసహనంతో తన మూర్ఖత్వాన్ని చాటుకున్నారని ధ్వజమెత్తారు. గజ్వేల్‌లో శనివారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ మెదక్‌లో చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. కేసీఆర్ కృషి వల్లే ఈ ప్రాంతానికి మంచినీరు, సాగునీరు అందాయని గుర్తుచేశారు. గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు రైల్వేలైన్ తేవడమే కాకుండా, రెండు యూనివర్సిటీలను తెచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు.

ప్రజలకు పాలనా సౌలభ్యం కల్పించాం..

ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలను ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలన సౌలభ్యాన్ని కల్పించామని హరీశ్ అన్నారు. దూలమోలె పెరిగాడని రేవంత్ తనపై వ్యాఖ్యలు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కూడా తిట్లు వస్తాయని, కానీ అలా మాట్లాడాలంటే సంస్కారం అడ్డం వస్తుందని చెప్పారు. పార్టీలు మారినవారి పై తక్షణమే అనర్హత వేటువేస్తామని రాహుల్ గాంధీ మేనిఫెస్టోలో పెడితే.. రేవంత్‌రెడ్డి మాత్రం పార్టీలు మారడానికి వస్తున్నవారికి కండువాలు కప్పే పనిలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఆడుతున్న అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని దుయ్యబట్టారు. బీసీలతో పాటు మాదిగలకు రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. 17 పార్లమెంట్ స్థానాల్లో 3 ఎస్సీలకు కేటాయించగా.. అందులో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కసీటు కూడా ఇవ్వలేదన్నారు. మల్లన్నసాగర్‌పై గతంలో తప్పుడు విమర్శలు చేసిన సీఎం నేడు ఇక్కడి నుంచి మంచి నీటిని హైదరాబాద్‌కు తీసుకెళ్లడానికి వేగంగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేలా ఆదేశాలిచ్చారని తెలిపారు. కేసీఆర్ కృషి వల్లే మల్లన్నసాగర్ హైదరాబాద్ తాగునీటికి ప్రత్యేకమైన వనరుగా మారిందన్నారు. మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డిపై కూడా తప్పు డు విమర్శలు చేస్తున్నారని, ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పోటీ చేస్తున్నారని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి మల్కాజ్‌గిరికి వచ్చి ఎంపీగా పోటీ చేయలేదా అని ప్రశ్నించారు.

రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

వడగళ్ల వానలవల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని హరీశ్ డిమాండ్ చేశారు. ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకున్న సీఎం రేవంత్ ప్రజలను కలిసింది ఒక్కసారి మాత్రమేనని అన్నారు. ఆయనకు క్రికెట్ మ్యాచ్‌లను చూసేందుకు ఉన్న తీరిక రైతులను పరామర్శించడానికి మాత్రం లేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాలల నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ హాస్టళ్లలో వరుసగా జరుగుతున్న కలుషిత ఆహారం సంఘటనలపై 'ఎక్స్' వేదికగా శనివారం స్పందించారు. 'భువనగిరి గురుకుల హాస్టల్లో కలుషిత ఆహారం తిని చనిపోయిన ప్రశాంత్ ఉదంతాన్ని మరవక ముందే మరో ఫుడ్ పాయిజన్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం 11 మంది విద్యార్థినులు కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. గురుకుల పాఠశాలల పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ఈ ఉదంతాలు అద్దం పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసు కోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్ పేర్కొన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఐసీటీ కంప్యూటర్ టీచర్లకు 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

జెండాలు మార్చే వారిని తిరస్కరిస్తారు

- ఒక పార్టీ పట్ల నిబద్ధత లేని వారిని ప్రజలు నమ్మరు: కేటీఆర్
- పట్నం, రంజిత్‌రెడ్డిని అసహ్యించుకుంటున్నారని వ్యాఖ్య



కేటీఆర్‌తో సమావేశమైన ప్రకాశ్‌గౌడ్, కాసాని జ్ఞానేశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, అరికెపూడి గాంధీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: అధికారం కోసం జెండాలు మార్చే నాయకులను ప్రజలు తిరస్కరిస్తారని, ఒక పార్టీ పట్ల నిబద్ధత లేనివారిని నమ్మబోరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు అధికారాన్ని అనుభవించి.. పార్టీకి, నాయకత్వానికి నమ్మకద్రోహం చేసి వెళ్లిన రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఆ నేతలకు బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష జరిగింది. కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజల్లోకి వెళ్లాల్సిన తీరుపై వారు చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో మరోమారు గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి సానుకూల స్పందన వస్తోందని.. కేసీఆర్ చేవెళ్ల సభ తర్వాత అన్ని వర్గాలు మద్దతు పలుకుతున్నాయని పేర్కొన్నారు.

కేటీఆర్ సమావేశానికి ప్రకాశ్‌గౌడ్: రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డితో భేటీకావడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరిగింది. కానీ ఆయన శనివారం కేటీఆర్ అధ్యక్షతన జరిగిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ సమీక్షలో పాల్గొనడం గమనార్హం. కార్యకర్తలు, నాయకుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరికపై వెనక్కి తగ్గినట్టు సమాచారం. కేటీఆర్‌తో భేటీ సందర్భంగా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని ఆయన వివరణ ఇచ్చినట్టు తెలిసింది.

జైపాల్, జానాను కాదు



మెదక్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

జోలికొస్తే మా కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారు' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం మెదక్‌లోని రాందాస్‌చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం ప్రసంగించారు. 'కేసీఆర్ నౌకరీ పోయి, నడుం విరిగి.. పార్టీ ఓడిపోయి.. ఏం చేయాలో తెలియక.. పిట్టల దొరలెక్క ఇంట్ల కూర్చొని భజన సంఘం ముందు కాంగ్రెస్ పనైపోయిందని అంటున్నాడు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతాననంటున్నాడు. మోదీని తెచ్చుకుంటావో.. మోదీ తాతను తెచ్చుకుంటావో? చూస్తా. కేసీఆర్ పనైపోయింది.. కారు కార్ఖానాకు పోయింది.. బీఆర్‌ఎస్ దుకాణం బంద్ అయింది.. కారును తుక్కు కింద తూకానికి అమ్మాల్సిందే' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

మోదీ.. కేడీలు తోడు దొంగలు

తెలంగాణలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గజ్వేల్ కేడీ పనైపోయిందని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని మోదీ పనైపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కేసీఆర్, మోదీలిద్దరూ మెదక్‌కు నయా పైసా ఇవ్వలేదని, ఇద్దరూ తోడుదొంగలేనన్నారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని వేసి రాష్ట్రంలోని లక్షలాది మంది పద్మశాలీల ఉపాధిపై కేంద్ర ప్రభుత్వం దెబ్బకొట్టిందని మండిపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్‌ల కోసం ఢిల్లీలో నిరసన తెలిపిన వేలాది మంది రైతులపై ఉక్కుపాదం మోపిందన్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరింట ఐదు గ్యారంటీలను అమలు చేస్తే.. బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 25 లక్షల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాలను ఇచ్చారని గుర్తుచేశారు. సోయి లేని సన్నాసి.. దద్దమ్మ కేసీఆర్ మాత్రం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పేరుతో నిరుపేదలను వంచన చేశారన్నారు. రానున్న రోజుల్లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి ఐదు లక్షల చొప్పున రూ.20 వేల కోట్లతో 4.50 లక్షల మందికి లబ్ధి చేకూరుస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

ఒట్టేసి చెబుతున్నా..: ఆగస్టు 15లోగా రూ.రెండు లక్షల రైతుల రుణమాఫీ చేసి తీరుతానని మెదక్ చర్చి.. ఏడుపాయల దుర్గమ్మ సాక్షిగా చెబుతున్నానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే వచ్చే సీజను నుంచి ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. పదేళ్ల మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు, సీఎంగా పనిచేసిన కేసీఆర్‌లు దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. దూలం లెక్క పెరిగితే సరిపోదని.. దూడకున్న జ్ఞానం ఉండాలంటూ హరీశ్‌పై విమర్శలు గుప్పించారు. పదేళ్ల అధికారంలో ఉండి చేయలేని ఈ సన్నాసులు.. వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసిన తమను దిగిపోవాలని అంటున్నారని చెప్పారు. దిగిపోమంటే దిగిపోవడానికి తాము మామూలుగా అధికారంలోకి రాలేదని, మీలాంటి వాళ్లను తొక్కుకుంటూ వచ్చామని స్పష్టం చేశారు. పదేళ్లు ఇక్కడే ఉంటామని, తమ ప్రభుత్వాన్ని దించేయడానికి ఎవరొస్తారో చూస్తానని అన్నారు.



జగ్గారెడ్డి మీసాలు తిప్పుతున్న రేవంత్

కష్టాల్లో ఉన్న కాంగ్రెస్‌ను మెదక్ ఆదరించింది

కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు మెదక్ ప్రజలు ఆదరించారని రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఇక్కడి నుంచి ఇందిరమ్మను గెలిపించుకుని దేశానికి ప్రధానమంత్రిని చేశారని చెప్పారు. ఇందిరమ్మ బీహెచ్‌ఈఎల్, బీడీఎల్ వంటి పరిశ్రమలతోపాటు ఇక్రిశాట్ వంటి సంస్థలను స్థాపించి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. 1999 నుంచి 2024 వరకు రెండున్నర దశాబ్దాలు మెదక్ నుంచి ప్రాతినిధ్యం వహించిన బీఆర్‌ఎస్ నేతలు ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఆలె నరేంద్ర మొదలుకుని కొత్త ప్రభాకర్‌రెడ్డి వరకు ఆ పార్టీ వారే ఇక్కడి నుంచి ఎంపీగా ఎన్నికవుతున్నారని.. వీరు ఒక్క పరిశ్రమనైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు బీఆర్‌ఎస్‌తోపాటు, బీజేపీ కూడా సిగ్గు లేకుండా ఓట్లు అడుగుతోందని, ఎన్నికలు రాగానే వాకిలి అలుకుతాం.. ముగ్గులేస్తాం.. ఇంటిని చక్కదిద్దుతామంటున్నాయని ఎద్దేవా చేశారు.

కత్రుకాల్చి వాత పెట్టినా సిగ్గురాదా: పొంగులేటి

రాష్ట్రంలో కేసీఆర్ పతనమైనప్పటికీ తానే ఇంకా సీఎం అనుకుంటూ వెర్రివాగుడు వాగుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు కత్రుకాల్చి ఫాంహౌస్‌కే పరిమితం చేసినా ఆయనలో మార్పు రావడం లేదన్నారు. కాంగ్రెస్ దిగిపోతుందని, 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని మాట్లాడటం సిగ్గుచేటని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం కేసీఆర్ దుకాణం తెలంగాణలో బంద్ అవుతుందని, త్వరలో ఆయన బీజేపీలో చేరతారని జోస్యం చెప్పారు. కార్నర్ మీటింగ్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్యే రోహిత్‌రావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హన్మంతరావు, మదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు భువనగిరికి సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం భువనగిరికి రానున్నారు. సాయంత్రం 4 గంటలకు ఆయన హైదరాబాద్ నుంచి భువనగిరికి చేరుకుంటారు. అనంతరం హైదరాబాద్ చౌరస్తా నుంచి వినాయక్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహిస్తారు. వినాయక చౌరస్తాలో జరిగే కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సీఎం వెంట మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఉంటారు.

బీజేపీలోనే కుటుంబ రాజకీయాలెక్కువ

- రైతులు, నిరుద్యోగులను ముంచిన పీఎం
- బెంగళూరు సభలో సీఎం రేవంత్‌రెడ్డి



బెంగళూరు సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కృష్ణరాజపురం: కుటుంబ రాజకీయాల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతున్నారని, అయితే బీజేపీలోనే కుటుంబ రాజకీయాలు ఎక్కువగా ఉన్నాయని కాంగ్రెస్ నేత, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. శనివారం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ సభలో ఆయన పాల్గొన్నారు. బెంగళూరు సెంట్రల్ కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్ అలీఖాన్‌కు మద్దతుగా మహదేవపురలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ముందుగా మోదీ.. బీజేపీలో ఉండే కుటుంబ రాజకీయాల గురించి తొలుత మాట్లాడిన తర్వాతే కాంగ్రెస్ గురించి మాట్లాడాలని హితవు పలికారు. బీజేపీలో ఉన్న పలు కుటుంబాలను రేవంత్ ఉదహరించారు. విదేశాల్లో ఉన్న నల్లధనం తీసుకొచ్చి ప్రతి ఖాతాకు రూ. 15 లక్షలు వేస్తానని చెప్పిన మోదీ ఇప్పటి వరకు ఒక్క బ్యాంకు ఖాతాలో కూడా ఒక్క పైసా వేయలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి పీఎం మరిచిపోయారని, దేశంలో నిరుద్యోగం బాగా పెరిగిందని ధ్వజమెత్తారు. ఐటీకి కేరాఫ్ చిరునామాగా బెంగళూరు నిలవడంతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలు లక్షలాది మంది ఇక్కడ నివసిస్తున్నారని చెప్పారు. స్థానిక బీజేపీ అభ్యర్థి మూడు సార్లు ఎంపీగా గెలిచినా ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో మన్సూర్ అలీఖాన్, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

రూ.500 ఇవ్వనివారు.. రూ.30 వేల కోట్ల రుణమాఫీ చేస్తారా?: బండి సంజయ్



బీజేపీలో చేరిన వారితో బండి సంజయ్

కరీంనగర్ టౌన్: వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. రూ. 30 వేలకోట్ల రుణ మాఫీ చేస్తామంటే నమ్మేదెవరని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం సాయంత్రం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ సమక్షంలో చొప్పదండి నియోజకవర్గంలోని వెలిచాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే, పేదల బతుకులు బాగుపడాలంటే మోదీ ప్రధానిగా ఉండాలన్నారు. వానలతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లు తడిసిపోతున్నాయని, గతంలో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయడానికి రూ.700 కోట్లు ఖర్చు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని సంజయ్ సూచించారు. జీతాలు, అప్పులు చెల్లించడానికే ప్రతినెలా రూ.11 వేల కోట్లను సమకూర్చలేక ఆపసోపాలు పడుతున్న ప్రభుత్వం రుణమాఫీ ఎలా చేస్తుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌కూ ఆగస్టు సంక్షోభం..

- టీడీపీ మాదిరే ఆయనకూ ఆ సంక్షోభం తప్పదు: బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి
- మమ్మల్ని ముట్టుకుంటే ఏ వైర్లమో తెలుస్తుంది
- కాంగ్రెస్ 14 సీట్లు గెలవకుంటే రేవంత్ రాజీనామా చేస్తారా అని సవాల్
- బీజేపీలోకి ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, నిర్మల్ కౌన్సిలర్లు



చేరికల కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆగస్టు సంక్షోభం ఎదురుకాబోతోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు నెలల్లో ఓటుకు కోట్లు కేసు విచారణకు వస్తుందని, ఆ తర్వాత గతంలో టీడీపీకి ఎదురైనట్టు ఆయన కూడా ఆగస్టు సంక్షోభాన్ని ఎదుర్కొంటారని జోస్యం చెప్పారు. ఎందుకంటే రేవంత్ కూడా ఎల్లో కాలేజీకి (టీడీపీకి) చెందిన వ్యక్తేనని గుర్తుచేశారు. రేవంత్ ఏమీ కరెంట్ తీగ కాదని, అలాగని వేరే వాళ్లు మల్లెతీగలు కాదని వ్యాఖ్యానించారు. శనివారం బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్యేలను ముట్టుకుని చూడాలని.. అప్పుడు తాము ఎలాంటి వైర్లమో తెలుస్తుందని చెప్పారు. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి రేవంత్‌కు లేదని, పెద్దవాళ్లను విమర్శిస్తే పెద్దవాళ్లు కారని హితవుపలికారు. ఆకాశం మీద ఉమ్మి వేస్తే అది మొహం మీదే పడుతుందనే విషయాన్ని గ్రహిస్తే మంచిదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అత్యధిక ఎంపీ సీట్లు గెలవబోతోందని, కాంగ్రెస్ 14 సీట్లు గెలవకుంటే రేవంత్ రాజీనామా చేస్తారా అని మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ 14 సీట్లు గెలిస్తే తాను రాజకీయాల నుంచి తప్పు కుంటానని చెప్పారు. తాను ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రచారానికి ఎలా వెళ్తున్నారో ఆలోచించుకుంటే మంచిదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ హుందాగా మాట్లాడటం లేదన్నారు. ఇటీవలి కాలంలో చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే ఆయనలో ఆందోళన, అభద్రతాభావం కనిపిస్తున్నాయన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ శోభ సత్యనారాయణ గౌడ్, నిర్మల్ కౌన్సిలర్లు బిట్లింగ్ నవీన్, అడుముల్ల రమా పద్మాకర్, ఏడిపెల్లి నరేందర్, మాజీ కౌన్సిలర్ పోడెల్లి గణేష్, ఎంపీటీసీ దాసరి శ్రీనివాస్, కడ్తాల్ సర్పంచ్ బర్మ నర్సయ్య, బొరిగం సర్పంచ్ రాజారెడ్డి, పలువురు బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షులు, మండల నాయకులు బీజేపీలో చేరారు. వారికి కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కాషాయ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'మోదీ కుటుంబంలోకి వచ్చిన మీ అందరికీ స్వాగతం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని రాష్ట్రంలో అత్యధిక సీట్లలో గెలిపించాలి. మీ చేరికతో పార్టీ బలోపేతం అవుతుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, డా.పాల్వాయి హరీశ్‌బాబు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రేపోమాపో బీజేపీలోకి రావచ్చు

- నిజామాబాద్ ఎంపీ అర్వింద్



జగిత్యాల/జగిత్యాల టౌన్: కాంగ్రెస్ నుంచి ముఖ్య నాయకులందరూ బీజేపీలోకి వస్తున్నారని, రేపోమాపో సీఎం రేవంత్‌రెడ్డి కూడా రావొచ్చని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ అని, ఓటు బ్యాంక్ రాజకీయం కోసం ఆ పార్టీ దేశాన్ని చిన్నాభిన్నం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి వస్తే 370 ఆర్టికల్‌తోపాటు, త్రిపుల్ తలాక్ మళ్లీ తీసుకువస్తామని అంటున్నారని మండిపడ్డారు. అసలు ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఎజెండానే లేదని, గందరగోళంలో ఉన్న పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి బీజేపీపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ ఆశయం యూనిఫాం సివిల్ కోడ్ అని, 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఎందుకు ఆ పని చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పథకం ఏమైందని, మహిళలు, రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు ఓట్లు వేయరని చెప్పారు. యువత అంతా మోదీ వెంటే ఉన్నారన్నారు. కాళేశ్వరం దోషులకు శిక్ష పడాలన్న చిత్తశుద్ధి ఉంటే రేవంత్ రాష్ట్రంలో సీబీఐ ఎంట్రీపై ఉన్న ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఆంక్షలను ఎత్తివేస్తే కాళేశ్వరం అవినీతి పాత్రధారులు, సూత్రధారులపై దర్యాప్తు చేసి బాధ్యులను జైలుకు పంపుతామని చెప్పారు. ప్రస్తుత ఎన్నికలు దేశ దశ దిశను మార్చే ఎన్నికలని, ఈ ఎన్నికల్లో ప్రజలు మోదీ వైపు నిలబడతారన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే: రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మెదక్‌సభలో అన్నీ అబద్ధాలే మాట్లాడారని బీజేపీ నేత, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. బహుశా ఆయనకు తప్పుడు స్క్రిప్ట్ రాసిచ్చారేమోనని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో ఓడిన రేవంత్ ఎంపీ ఎన్నికల్లో మల్కాజిగిరిలో గెలవలేదా అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా దుబ్బాకలో ఓడితే ఎంపీ అభ్యర్థిగా మెదక్‌లో పోటీ చేయకూడదా అని నిలదీశారు. కేసీఆర్ దోచుకున్న సొమ్మును పేదలకు పంచుతామనీ, ఆ సొమ్ముతో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఎంతమందికి ఆ సొమ్మును పంచారో, ఎన్ని గ్యారంటీలను అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ కార్యాలయంలో రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ పదేళ్ల అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని, అందుకు సీఎం రేవంత్ సిద్ధమా అని సవాల్ విసిరారు.

యువకుడిని బలిగొన్న సైబర్ నేరగాళ్లు



నాగరాజు

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన మోతె నాగరాజు (19) అనే యువకుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోయాడు. రైతు కుటుంబానికి చెందిన నాగరాజు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలె తన స్మార్ట్ ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి గుర్తు తెలియని యాప్‌ను డౌన్‌లోడ్ చేశాడు. వెంటనే సైబర్ నేరగాళ్లు నాగరాజుకు ఫోన్ చేసి తాము పోలీసు అధికారులమని, అనుమతి లేని యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకున్నందుకు జైలుకు వెళ్లాల్సి వస్తుందని బెదిరించారు. కేసులు నమోదు చేయవద్దంటే డబ్బులు చెల్లించాలని బ్లాక్‌మెయిల్ చేశారు. దీంతో భయపడిన నాగరాజు సైబర్ నేరగాళ్లకు రూ. 3 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అయితే రూ.5 లక్షలు పంపాలని డిమాండ్ చేస్తూ సైబర్ నేరగాళ్లు నాగరాజును భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో నాగరాజు గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నాగరాజును వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, నాగరాజు చికిత్స పొందుతూ శనివారం వేకువ జామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలాన్ మస్క్ పర్యటన వాయిదా

తర్వాత భారత్‌కు వస్తానన్న అపర కుబేరుడు

న్యూఢిల్లీ: అమెరికా అపర కుబేరుడు ఎలాన్ మస్క్ భారత పర్యటన వాయిదా పడింది. తన టెస్లా కంపెనీ బాధ్యతల ఒత్తిడి దృష్ట్యా పర్యన వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని శనివారం ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. మరికొద్ది నెలల తర్వాత భారత్‌లో తన పర్యటన ఉంటుందని తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మస్క్ ఈ నెల 21, 22వ తేదీల్లో భారత్‌లో పర్యటన, ప్రధాని మోదీతో భేటీ ఉన్నాయి. ఈ నెల 23వ తేదీన టెస్లా ఆర్థిక ఫలితాలపై చర్చించే ముఖ్యమైన కార్యక్రమం ఉన్నందున భారత్‌లో పర్యటన వాయిదా వేసుకున్నట్లు ఆ కంపెనీ సీఈవో అయిన మస్క్ వివరించారు. భారత పర్యటన సమయంలో ఎలక్ట్రిక్ కార్ల తయారీ టెస్లా కేంద్రం ప్రారంభం ప్రణాళికలను ప్రకటిస్తారని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తన స్టార్‌లింక్ ద్వారా శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారాన్ని భారత్‌కు విస్తరించే ఆలోచనలోనూ ఉన్నారు. మస్క్ పర్యటన వాయిదాపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని ముందుగానే మస్క్ గ్రహించారని, పదవి నుంచి దిగిపోయే మోదీతో భేటీకి అంతదూరం వెళ్లడం ఎందుకని పర్యటన వాయిదా వేసుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

మా జోలికి రావొద్దు

ఇజ్రాయెల్‌కు ఇరాన్ విదేశాంగ మంత్రి హెచ్చరిక

టెహ్రాన్: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. తమ జోలికి రావొద్దని, ప్రతీకార దాడులు చేసే ఆలోచన ఉంటే మానుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి హోస్సేన్ అమీర్ అబ్దల్లాహియాన్ ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. ఇస్ఫహాన్ సిటీలో వైమానిక స్థావరం, అణు కార్యక్రమాల ప్రాంతంలోకి చొచ్చుకొచ్చినవి డ్రోన్లు కాదని, అవి తమ పిల్లలు ఆడుకునే బొమ్మలు అని చెప్పారు. ఇజ్రాయెల్ ఈ డ్రోన్ల దాడికి పాల్పడినట్లు ఇంకా నిర్ధారణ కాలేదని, దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఒకవేళ ఇజ్రాయెల్ నిజంగా డ్రోన్ దాడులకు పాల్పడినట్లు తేలితే తమ ప్రతిస్పందన కఠినంగా ఉంటుందని అన్నారు. ఇజ్రాయెల్ దాడి చేయలేదని నిర్ధారణ అయితే ఈ వ్యవహారానికి ఇక్కడితో ముగింపు పలుకుతామని పేర్కొన్నారు. ఇస్ఫహాన్ నగరంపై శుక్రవారం ఇజ్రాయెల్ దాడి చేసినట్లు అమెరికా వెల్లడించిన సంగతి తెలిసిందే.

మీమ్స్... ఎలక్షన్ మేనియా



- ప్రత్యర్థులపై ప్రచారాస్త్రంగా వాడుతున్న పార్టీలు
- ఓటర్లలో అవగాహన కోసం ఈసీ మీమ్స్ బాట

ప్రత్యర్థి నేతలపై దుమ్మెత్తిపోయాలన్నా, సొంత అభ్యర్థిని ప్రశంసల్లో ముంచెత్తాలన్నా పార్టీలకు టక్కున గుర్తొస్తున్న సరికొత్త ప్రచారాస్త్రం... మీమ్. బాలీవుడ్ సినిమాల్లో బాగా క్లిక్కయిన సన్నివేశాల ఫొటోలకు చక్కటి క్యాప్షన్‌ను జత చేసి ఓటరు మనసును తాకేలా సూటిగా, హాస్యభరితంగా తయారవుతున్న మీమ్స్ ఎన్నికల పండుగకు కొత్త కళ తెచ్చాయి. భారీ ప్రచార సభ ద్వారా సాధించలేని దాన్ని ఒక్క ఆన్‌లైన్ పోస్టర్ మీమ్‌తో సాధించవచ్చని పార్టీలు నమ్ముతున్నాయి. అందుకే ఇన్‌స్టాగ్రామ్ మొదలుకుని ఫేస్‌బుక్, వాట్సాప్, 'ఎక్స్' దాకా ప్రతి సామాజిక మాధ్యమంలోనూ మీమ్స్‌తో హోరెత్తిస్తున్నాయి... – న్యూఢిల్లీ

ఈసీ... నేను సైతం

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాధాన్యతను యువ, తొలి ఓటర్లకు తెలియజేప్పేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కూడా మీమ్స్ బాట పట్టడం విశేషం! ఒక్క వాక్యంతో, ఫేమస్ సినీ మా డైలాగ్‌తో కూడిన మీమ్స్ ద్వారా ఓటర్ల ముఖంపై నవ్వులు పూలు పూయిస్తోంది. పోలింగ్‌పై ఓటర్లలో అవగాహన పెంచుతోంది. యే జవానీ హై దీవానీ సినిమాలోని స్టిల్‌తో ఈసీ బుధవారం ఎక్స్‌లో ఒక మీమ్ పోస్ట్ చేసింది. తొలిసారి ఓటర్లు 'ఎన్నికల పర్వం... దేశానికే గర్వకారణం' అని వ్యాఖ్యానిస్తున్నట్లు ఉన్న ఒక మీమ్ కూడా నెట్టింట తెగ వైరలైంది. హిందీ ఆల్‌టైం హిట్ దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగేలోని క్లైమాక్స్‌లో వచ్చే ట్రైన్ సీన్‌నూ ఈసీ అందమైన మీమ్‌గా మలచింది. పరుగు తీస్తున్న హీరోయిన్ కాజోల్‌తో షారుఖ్ ఖాన్ ' త్వరగా రా సిమ్రాన్, ఓటేయడానికి ఇంటికెళ్లాలి' అన్నట్టుగా సృష్టించిన మీమ్ అందరికీ తెగ నచ్చేసింది. శుక్రవారం తొలి దశ పోలింగ్ నాడు ఓటర్లు పోటెత్తిన ఫొటోలను 'నా ఓటు నా హక్కు', 'మన పోలింగ్ బూత్‌కు స్వాగతం', 'అతిపెద్ద ఓటింగ్ వేడుకకు ఇదే మా ఆహ్వానం' వంటి క్యాప్షన్లతో మీమ్స్‌ను షేర్ చేసింది. వీటిపై ఓటర్ల అభిప్రాయాలనూ కోరింది!

దూరదర్శన్ కూడా

దూరదర్శన్ సైతం తన ఎక్స్ ఖాతాలో హిట్ హిందీ సినిమా 'గంగూభాయ్ కథియావాడీ' థీమ్‌తో ఎలక్షన్ మీమ్‌ను గురువారం పోస్ట్ చేసింది. 'ప్రపంచంలోనే గొప్పవైన ఎన్నికల్లో మీ ఓటు 'అమూల్'యం' అంటూ అమూల్ క్లాసిక్ పోస్టర్‌తో కూడిన మీమ్‌ను కూడా పోస్ట్ చేసింది!

ఎన్డీఏ వర్సెస్ ఇండియా

ఎన్డీఏ వర్సెస్ ఇండియా హ్యాష్‌ట్యాగ్‌తో బీజేపీ, ఆప్, కాంగ్రెస్ తదితర పార్టీల మధ్యా పోస్టర్ వార్ సాగుతోంది. 'ప్రాణాలైనా పణంగా పెడతాం. రాజ్యాంగంపై కన్నేస్తే ఊరుకోం' అంటూ ఆప్ ఒక డిజిటల్ బ్యానర్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. మోదీని లక్ష్యంగా చేసుకుని మీమ్స్‌తో సోషల్ మీడియాను ముంచెత్తుతోంది. 'బీజేపీ హటావో, సంవిధాన్ బచావో' అంటూ మోదీ ఫొటోతో ఓ పోస్ట్‌ను జతచేసింది. ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను కటకటాలపాలు చేసిన మోదీ సర్కార్‌ను వ్యతిరేక ఓటుతో పోటు పొడవాలంటూ పిలుపునిచ్చింది. 'జైలుకు ఓటుతో జవాబు' అంటూ ఆన్‌లైన్ ప్రచారానికి తెరతీసింది. బీజేపీ మేనిఫెస్టోను అబద్ధాల చిట్టాగా అభివర్ణిస్తూ ఆప్ పోస్ట్ చేసిన వీడియో కూడా వైరలైంది. 'మోదీ గ్యారెంటీ, దేశాభివృద్ధి మాత్రమే కాదు, వారసత్వం కూడా' అన్న బీజేపీ పోస్టుకు వెటకారపు వీడియోలతో కాంగ్రెస్ బదులిచ్చింది. 'ఉపాధి లేక కోట్లాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోయారు. సంపన్నులేమో నిక్షేపంగా ఉన్నారు' అంటూ మీమ్ ద్వారా ఎద్దేవా చేసింది. 'అవినీతి స్కూల్లో పాఠాలు బోధిస్తున్న ప్రధాని' అంటూ రాహుల్ 'ఎక్స్'లో పలు పోస్టులు చేశారు. తుది దశ పోలింగ్ జరిగే జూన్ ఒకటో తేదీ దాకా పార్టీల మధ్య మీమ్స్ వార్ ఉధృతంగా సాగేలా కన్పిస్తోంది.

దూరదర్శన్ లోగో రంగుపై రగడ

- ఎరుపు నుంచి కాషాయంలోకి మారిన లోగో
- కొత్త అవతారంలో దర్శనం ఇస్తున్నామన్న డీడీ న్యూస్
- ప్రభుత్వ రంగ సంస్థలను కాషాయీకరణ చేస్తున్నారని విపక్షాల ఆగ్రహం

న్యూఢిల్లీ: దూరదర్శన్ లోగో రంగు మారిపోయింది. ప్రేక్షకులకు సుపరిచితమైన ఎరుపు రంగులోని లోగో ఇప్పుడు కాషాయ వర్ణంలో కనిపిస్తోంది. ఈ మార్పుపై వివాదం మొదలైంది. ఇదంతా అధికార బీజేపీ కుట్ర అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కొత్త రంగులో ఉన్న లోగోపై వివరణ ఇస్తూ దూరదర్శన్‌కు చెందిన డీడీ న్యూస్ ఇంగ్లీష్ ఛానల్ ఒక వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేసింది. విలువలు మారలేదని, కానీ మేం ఇప్పుడు కొత్త అవతారంలో దర్శనం ఇస్తున్నామని పేర్కొంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో వార్తా ప్రయాణానికి స్వాగతం, డీడీ న్యూస్‌ను కొత్తగా అనుభూతి చెందండి అని సూచించింది. దూరదర్శన్ లోగో రంగును మార్చడాన్ని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ప్రసార భారతి మాజీ సీఈఓ జవహర్ సిర్కార్ తప్పుపట్టారు. ఆ లోగోను కాషాయం రంగులోకి మార్చడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మార్పు చాలా బాధగా ఉందని అన్నారు. ప్రసార భారతి ఇప్పుడు ప్రచార భారతిగా మారిపోయిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో దూరదర్శన్ లోగో రంగు మార్చడం ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు అవుతుందని పేర్కొన్నారు. జాతీయ ప్రసార సంస్థను కాషాయీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. లోగో రంగు మార్పుపై కాంగ్రెస్ సీనియర్ నేత మనీష్ తివారీ సైతం స్పందించారు. ప్రభుత్వ రంగ సంస్థలను చెరబట్టడంలో భాగంగానే దూరదర్శన్ లోగో రంగును కాషాయంగా మార్చారని బీజేపీపై మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాషాయీకరణ చేస్తున్నారని ఆక్షేపించారు. తటస్థంగా పనిచేసే సంస్థగా పేరున్న దూరదర్శన్ విశ్వసనీయతను దెబ్బతీయొద్దని సూచించారు. అయితే, 1959లో దూరదర్శన్‌ను ప్రారంభించినప్పుడు లోగో కాషాయం రంగులోనే ఉండేదని, ఆ తర్వాత ఎరుపు రంగులోకి మార్చారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఒరిజినల్ లోగోను పునరుద్ధరిస్తే అభ్యంతరం ఎందుకని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అది నారింజ రంగు: గౌరవ్ ద్వివేది

దూరదర్శన్ లోగో నారింజ రంగులో ఉందని, కాషాయం రంగు కాదని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది స్పష్టం చేశారు. ప్రేక్షకులకు కంటికి ఇంపుగా కనిపించడానికే ఈ రంగులోకి లోగోను మార్చినట్లు తెలిపారు. కేవలం లోగోనే కాదు.. మొత్తం లుక్, ఫీల్‌ను అప్‌గ్రేడ్ చేశామని అన్నారు. దూరదర్శన్ లోగో రంగుతో బీజేపీకి సంబంధం ఉందనడం సరైంది కాదని ప్రసార భారతి వర్గాలు వెల్లడించాయి.

వయనాడూ తరిమికొడుతుంది

రాహుల్‌కు మోదీ చురక



నాందేడ్/చిక్కబళ్లాపూర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ చురక అంటించారు. కాంగ్రెస్ యువరాజు 2019లో ఉత్తరప్రదేశ్‌లోని ఆమేథీ నుంచి పారిపోయినట్లుగానే 2024లో కేరళలోని వయనాడ్ నుంచి పారిపోవడం ఖాయమని చెప్పారు. ఈ నెల 26న జరిగే పోలింగ్ కోసం ఎదురుచూస్తున్న రాహుల్‌కు పరాభవం తప్పదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వయనాడ్ ప్రజలు రాహుల్‌ను చిత్తుచిత్తుగా ఓడించబోతున్నారని స్పష్టం చేశారు. ఆమేథీని వదిలేసి వయనాడ్‌ను వెతుకున్నట్లుగా, ఇప్పుడు మరో స్థానం వెతుక్కోవాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక తీగలాంటిదని, దానికి వేర్లు, కొమ్మలు లేవని అన్నారు. ఆ తీగకు ఆధారం కల్పించాలని చూసినా ఎలాంటి ఉపయోగం ఉండదని చెప్పారు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే అధోగతేనని పరోక్షంగా తేల్చేశారు. శనివారం మహారాష్ట్రలోని నాందేడ్, పర్భానీ, కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. 'వికసిత్ భారత్' సాకారం కావాలంటే ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాలు వెలువడకముందే కాంగ్రెస్ పరాజయాన్ని అంగీకరించిందని పేర్కొన్నారు. దేశాన్ని విభజించిన పాపం కాంగ్రెస్‌దేనని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని జమ్మూకశ్మీర్‌లో అమలు చేయకుండా కాంగ్రెస్ అడ్డుకుందని ఆరోపించారు. మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, నకిలీ శివసేన పార్టీలు ఉగ్రవాది యాకూబ్ మెమన్ సమాధిని సుందరంగా అలంకరించడంలో బిజీగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే మహారాష్ట్రలోని మరత్వాడాలో మళ్లీ నిజాం పాలన వస్తుందన్నారు. ఇక్కడ రజాకార్ ఆలోచనా ధోరణి అధికంగా కనిపిస్తోందని ఆక్షేపించారు.

తాను పేద కుటుంబంలో జన్మించానని, పేదరికం స్వయంగా అనుభవించానని, పేదల కష్టాలు తనకు తెలుసని ప్రధానమంత్రి మోదీ వెల్లడించారు. పేదలెవరూ తనలాగా కష్టాలు పడకుండా చూడాలన్నదే తన ప్రయత్నమని పేర్కొన్నారు. తనను పదవి నుంచి తొలగించడానికి మన దేశంలోని, విదేశాల్లోని కొందరు బడా వ్యక్తులు, శక్తివంతమైన వ్యక్తులు చేతులు కలిపారని ప్రధాని మోదీ ఆరోపించారు.

మోదీ అవినీతి పాఠశాల

రాహుల్ గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ/భాగల్‌పూర్: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా మరోసారి విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మోదీ సర్కార్ కోట్లు గడించిందంటూ రాహుల్ 'ఎక్స్'లో పలు పోస్టులు పెట్టారు. '' దేశంలో 'అవినీతి పాఠశాల'ను మోదీ నడుపుతున్నారు. ఆ స్కూల్లో అవినీతి శాస్త్రాన్ని చక్కగా బోధిస్తున్నారు. విరాళాల వ్యాపారం అనే చాప్టర్‌సహా ప్రతీదీ ఆయన సోదాహరణంగా విడమరిచి చెబుతున్నారు. దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించి, బెదిరించి రాజకీయ పార్టీ కోసం విరాళాలు ఎలా రాబట్టాలి?. సొమ్ము చేతికందాక ప్రభుత్వ కాంట్రాక్టులను ఎలా వంతుల వారీగా ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పాలి. అవినీతిపరులు తమ పార్టీలో చేరాక సచ్చీలురుగా, వారి అవినీతి మరకలను మటుమాయం చేసే వాషింగ్ మెషీన్ ఎలా పనిచేస్తుంది? బెయిలు–జైలు ఆటను ఎలా ఆడాలి? దర్యాప్తు సంస్థలను రికవరీ ఏజెంట్లుగా ఎలా వాడుకోవాలి?.. ఇలా పలు చాప్టర్లను మోదీ చక్కగా బోధిస్తారు'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల అంశంపై కాంగ్రెస్ రూపొందించిన కొత్త అడ్వర్టయిజ్‌మెంట్‌ను రాహుల్ షేర్‌చేశారు. '' అవినీతి నేతల సామ్రాజ్యంగా బీజేపీ తయారైంది. తమ నేతలకు అవినీతి క్రాష్‌కోర్స్ నేర్పిస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలు ఇప్పుడు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. ఈ కరప్షన్ స్కూల్‌ను మేం అధికారంలోకి రాగానే శాశ్వతంగా మూయించేస్తాం'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

సంపన్నుల బాగోగులే పట్టించుకుంటారు

బిహార్‌లో తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చిన రాహుల్ శనివారం భాగల్‌పూర్‌లో సభలో ప్రసంగించారు. '' మన దేశంలో 22 మంది కుబేరులున్నారు. రోజుకు రూ.100 సంపాదించే 70 కోట్ల మంది భారతీయుల ఆస్తికి సమానమైన సంపద ఈ 22 మంది వద్దే పోగుబడింది. ఇలాంటి సంపన్నుల బాగోగులే మోదీ సర్కార్ పట్టించుకుంటుంది. దళితులు, గిరిజనులు, పేదలకు సమానంగా అన్ని దక్కాలంటూ నిర్దేశించే భారత రాజ్యాంగానికి ఈ కుబేరులు, మోదీ సర్కార్ ప్రమాదకరంగా పరిణమించారు'' అని రాహుల్ ఆరోపించారు.

గాజాలో చిన్నారులు సహా 9 మంది మృతి

రఫా: అష్ట దిగ్బంధనం చేసిన గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ నిరాటంకంగా దాడులు కొనసాగిస్తూనే ఉంది. శుక్రవారం రాత్రి రఫా శివారు టెల్ సుల్తాన్‌లోని నివాసభవనంపై జరిగిన వైమానిక దాడిలో ఆరుగురు చిన్నారులు సహా మొత్తం 9 మంది మృత్యువాతపడ్డారు. అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారని బంధువులు తెలిపారు. ఇజ్రాయెల్ యథేచ్ఛగా సాగిస్తున్న దాడులతో భీతిల్లిన గాజా జనాభా 23 లక్షల మందిలో సగం మంది ఈజిప్టు సరిహద్దులకు సమీపంలో ఉన్న రఫాలోనే తలదాచుకుంటున్నారు. ఇజ్రాయెల్ దాడుల ఫలితంగా 24 గంటల వ్యవధిలో 37 మంది చనిపోగా, మరో 68 మంది గాయాలతో ఆస్పత్రులకు వచ్చారని గాజా ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. దీంతో, గతేడాది అక్టోబర్ నుంచి గాజాలో ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనియన్ల సంఖ్య 34,049కు, క్షతగాత్రుల సంఖ్య 76,901కి చేరిందని వెల్లడించింది.

మరో వైపు, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని నూర్ షామ్స్ శరణార్థి శిబిరం, చుట్టుపక్కల ప్రాంతాలపై శుక్రవారం జరిగిన దాడిలో 10 మంది మిలిటెంట్లు చనిపోయారని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. నూర్‌షామ్స్‌కు సమీపంలోని టుల్కారెమ్‌లో ఇజ్రాయెల్ ఆర్మీతో భీకర ముఖాముఖి పోరు సాగుతోందని ఇస్లామిక్ జిహాద్ అనుబంధ సరయా అల్ ఖుద్స్ వెల్లడించింది.

అర్హతతోనే అందలం

- వారసత్వ రాజకీయాలు అనేవి ఒట్టి మాటలు
- పీటీఐ ఇంటర్వ్యూలో బీవై విజయేంద్ర

తన తండ్రి, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప నుంచి రాజకీయ వారసత్వం తీసుకున్నారన్న ఆరోపణలను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొట్టిపారేశారు. శనివారం పీటీఐతో ముఖాముఖిలో ప్రస్తావించిన పలు అంశాలు ఆయన మాటల్లోనే..


ఇంటర్వ్యూ

రాజకీయ వారసత్వం

''నా తండ్రి యడియూరప్ప నన్ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం వాస్తవమైతే పార్టీ సీనియర్ నేతలు కేఎస్ ఈశ్వరప్ప, బసవగౌడ పాటిల్ యత్నాల్ ఆరోపణలతో ఏకీభవిస్తా. కానీ నన్ను పార్టీ అధిష్టానం నియమించింది. రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడం, నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తులనే పదవులు వరిస్తాయి. ఇక్కడ రాజకీయ వారసత్వం అన్న మాటే లేదు. అదంతా ఒట్టి మాటలు. పుష్కరకాలంగా నా పనితీరు మెచ్చే నాకు ఈ పదవీబాధ్యతలు అప్పగించారు.

అధ్యక్షుడిగా కొనసాగడంపై..

'కర్ణాటకలోని అన్ని ఎంపీ స్థానాలను బీజేపీ గెల్చుకుంటే పైరవీపై పొందిన పార్టీ చీఫ్ పోస్ట్‌కు ఢోకా ఉండదని కొందరు అనుకోవచ్చు. అదంతా అబద్ధం. నా లక్ష్యం లోక్‌సభ లేదంటే వచ్చే జిల్లా పంచాయతీ ఎన్నికలో కాదు. రాష్ట్రంలో పార్టీని విస్తరించాలి. పార్టీని బలపరచాలి. ఇదే నా సంకల్పం. ఒకప్పుడు రాష్ట్రం బీజేపీకి పెట్టని కోట. తర్వాత కొన్ని అనివార్యకారణాలతో బలహీనపడింది. ఇప్పుడు పాత మైసూరు, హైదరాబాద్ (కల్యాణ) కర్ణాటకసహా రాష్ట్రమంతటా కమలం పార్టీకి పూర్వ వైభవం తెస్తా.

కరిష్మా గల నేతల కొరత

'దాదాపు 40 ఏళ్లపాటు యడియూరప్ప కన్నడ బీజేపీ రాజకీయల్లో కీలకభూమిక పోషించారు. ఇప్పుడు ఆయన స్థానాన్ని భర్తీ చేసే గొప్ప సీనియర్ నేత లేరు అనేది వాస్తవమే. కానీ ఇప్పుడు యువతరానికి ప్రాధాన్యతనివ్వాల్సిన సమయం వచ్చింది. అందుకే నా లాంటి వారికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తోంది. యువత రాజకీయాల్లో మరింత క్రియాశీలకంగా ఉంటూ నాయకులుగా రాణించేందుకు కష్టపడుతున్నా. ఇది సమిష్టి కృషితోనే సాధ్యం. యడియూరప్ప ముందుండి నడిపించకున్నాసరే పార్టీ ముందుకెళ్లడం సవాల్‌తో కూడిన వ్యవహారమే. ఈ క్లిష్ట పరిస్థితులను ఎలాగైనా అధిగమించాల్సిందే.

ఈశ్వరప్ప తిరుగుబాటుపై..

''పార్టీ కేంద్ర నాయకత్వం ఆజ్ఞలను ధిక్కరించి పార్టీ సీనియర్ నేత ఈశ్వరప్ప స్వతంత్ర అభ్యర్థిగా నా సోదరుడు బీవై రాఘవేంద్రపై పోటీకి నిలబడ్డారు. ఈశ్వరప్పపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో పార్టీయే నిర్ణయిస్తుంది. హవేరీలో తన కుమారుడికి టికెట్ ఇవ్వలేదనే అక్కసుతో ఈశ్వరప్ప శివమొగ్గలో పోటీకి దిగారు. పనితీరు, సమర్థతను బట్టే అభ్యర్థుల ఎంపిక జరిగింది. సిట్టింగ్ ఎంపీలు, స్థానిక నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను నమో యాప్ ద్వారా తీసుకునే అధిష్టానం తుది జాబితా సిద్ధంచేసింది.

అసమ్మతి సమసిపోవడంపై..

అభ్యర్థుల ఎంపికపై కొద్దిరోజులుగా ఎగసిన అసమ్మతి ఇప్పుడు సద్దుమణిగింది. ఇది ప్రచారపర్వానికి సానుకూల బాటలు పరిచింది. పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని స్పష్టమైన అంచనా ఉన్నప్పుడు ప్రతి ఎంపీ స్థానంలో టికెట్ కోసం ఆరేడు మంది ఆశావహులు ఉండటం సహజం. మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ప్రతీక ఇది. కేంద్ర నిధుల కోసం వేచిచూడకుండా సీఎం సిద్ధరామయ్య తక్షణ ఉపశమనం కోసం రాష్ట్ర నిధులను ఖర్చుచేయొచ్చుకదా. రాష్ట్ర ప్రజలకు సీఎం అన్యాయం చేస్తున్నారు.

– న్యూఢిల్లీ

తిహార్ జైలులో కేజ్రీవాల్ హత్యకు కుట్ర

- ఇన్సులిన్ ఇవ్వకుండా మృత్యువు దిశగా నడిపిస్తున్నారు
- మంత్రి భరద్వాజ్ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆప్ నేత, ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ శనివారం ఆరోపించారు. కేజ్రీవాల్‌ను క్రమంగా మృత్యువు దిశగా నడిపిస్తున్నారని, ఇందులో భాగంగానే కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వడం లేదని, డాక్టర్లను సంప్రదించేందుకు అనుమతించడం లేదని విమర్శించారు. ఆయనను నెమ్మదిగా మృత్యువు కబళించేలా చేయాలన్నదే జైలు అధికారుల పన్నాగమని మండిపడ్డారు. డయాబెటిస్ బాధితుడైన కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వకపోవడం వెనుక బీజేపీ, కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కుట్ర ఉందని తెలిపారు. అయితే, అరెస్టు కంటే ముందు కేజ్రీవాల్ ఇన్సులిన్ తీసుకోవడం ఆపేశారని అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్రూవర్‌గా మారిన శరత్ చంద్రారెడ్డి నుంచి బీజేపీ రూ.60 కోట్లు నొక్కేసిందని, దీనిపై ఈడీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆప్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ప్రశ్నించారు. శరత్‌చంద్రారెడ్డి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి రూ.60 కోట్లు సమర్పించుకున్నట్లు తేలిందని గుర్తుచేశారు.



ఎన్నికల విచిత్రం

ఓటు హక్కు ప్రాముఖ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన పెయింటింగ్ కార్యక్రమంలో సృజనాత్మకతను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, యువత. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ శనివారం ఇందుకు వేదికైంది.

ఎలక్షన్ బీట్

మొరాదాబాద్ బీజేపీ అభ్యర్థి మృతి



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కువర్ సర్వేశ్ కుమార్(72) అకస్మాత్తుగా కన్నుమూశారు. కొంతకాలంగా గొంతు సంబంధ రుగ్మతతో బాధపడుతున్న కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. శనివారం ఆయన ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచారని యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్ర చౌదరి తెలిపారు. ఆయన బరిలో ఉన్న మొరాదాబాద్ నియోజకవర్గానికి ఈ నెల 19వ తేదీన మొదటి దశలో పోలింగ్ పూర్తయింది. 2014 ఎన్నికల్లో మొరాబాద్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన కుమార్ మొరాదాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే అయ్యారు. కుమార్‌కు భార్య సాధన, కుమారుడు, కూతురు ఉన్నారు.

బీజేపీ కోసమే ఏడు దశలు: మమత

మాల్డా: అధికారాన్ని వాడుకుంటూ ప్రధాని మోదీ, ఆయన మంత్రి వర్గం విస్తృతంగా ప్రచారం చేసుకునేందుకే ఎన్నికల కమిషన్ ఏడు దశల్లో లోక్‌సభ పోలింగ్ చేపట్టిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. మోదీ, ఆయన కేబినెట్ సహచరులు ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ ప్రతి దశ పోలింగ్‌లోనూ ప్రచారంలో ప్రతిపక్షంపై పైచేయి సాధించాలనే ఏప్రిల్ 19 మొదలుకొని జూన్ ఒకటో తేదీ వరకు సుదీర్ఘ ఎన్నికల ప్రణాళిక రూపొందించిందని ఈసీపై మండిపడ్డారు. మాల్డా జిల్లా గజోల్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమత మాట్లాడారు. 'గతంలో మేకల్లా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేది, ఈసారి మాత్రం జూన్ ఒకటో తేదీ వరకు పొడిగించటంతో ప్రధాని మోదీ సైనిక విమానాల్లో ఎన్నికల ప్రచారానికి తిరుగుతున్నారు. బీజేపీ నేతలు హెలికాప్టర్లను కూడా బుక్ చేసుకుంటుండటంతో ప్రతిపక్ష నేతలు ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొనే అవకాశం లేకుండా పోతోంది'అని ఆమె ఆరోపించారు.

మోదీ బీజేపీకే ప్రధాని: శరద్ పవార్

ఛత్రపతి శంభాజీనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ప్రధానమంత్రి హోదాలో ఉన్న యావత్తూ దేశానికి చెందిన వ్యక్తి. దేశాన్ని ముందుకు నడపాల్సిన బాధ్యత ఆయనదే. కానీ, మోదీ ప్రసంగాల్ని చూస్తే ఆయన బీజేపీకే ప్రధాని తప్ప, దేశానికి కాదనిపిస్తోంది'అని పేర్కొన్నారు. 'మోదీ ఒక్కోసారి దేశ ప్రథమ ప్రధాని నెహ్రూను, కొన్ని సార్లు రాహుల్ గాంధీని, నన్ను విమర్శిస్తున్నారు. అందుకు బదులుగా దేశానికి ఏం చేశారో ఆయన, బీజేపీ ప్రజలకు చెప్పాలి'అని అన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో శరద్ పవార్ మాట్లాడారు.

నియంతృత్వ మోదీ ప్రభుత్వం: ప్రియాంక

పత్తనంతిట్ట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా నిప్పులు చెరిగారు. అది అహంకార, నియంతృత్వ ప్రభుత్వమన్నారు. సమరయోధుల రుధిరంతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటూ అహంకారంతో మాట్లాడుతోందని ప్రియాంక మండిపడ్డారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకే రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రతిపక్ష ప్రభుత్వాలను అస్థిర పరుస్తున్నారని ఆరోపించారు. సామాన్యులు పెరుగుతున్న ధరలతో ఓ పక్క సతమతమవుతుండగా తప్పుడు ఆర్థిక గణాంకాలతో ప్రజలను బీజేపీ మభ్యపెడుతోందని తెలిపారు. శనివారం ఆమె కేరళలో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో పాల్గొన్నారు.

సూరత్ కాంగ్రెస్ అభ్యర్థికి తిప్పలు

సూరత్: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్న నీలేశ్ కుంభానీకి కొత్త తిప్పలు మొదలయ్యాయి. ఆయన అభ్యర్థిత్వం ప్రమాదంలో పడింది. గుర్తింపు పొందిన పార్టీ అయితే.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని అదే నియోజవర్గంలో ఓటరుగా ఉన్న ఒకరు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో ప్రతిపాదించే వ్యక్తి సంతకం చేయాలి. కాగా నీలేశ్ కుంభానీ ముగ్గురిని ప్రపోజర్స్‌గా పెట్టుకున్నారు. నీలేశ్ కుంభానీ సమర్పించిన నామినేషన్ పత్రాల్లో సంతకం చేసిన ఈ ముగ్గురు వ్యక్తులూ ఇప్పుడు ఎదురుతిరిగారు. తాము ఆ సంతకాలు చేయలేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారికి ఒక అఫిడవిట్ సమర్పించారు. దీంతో నీలేశ్ కుంభానీకి జిల్లా ఎన్నికల అధికారి ఆదివారం ఉదయం 11 గంటల వరకు సమయం ఇచ్చారు. వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్ అబద్ధాలు: అమిత్ షా

జైపూర్: రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కోటాను ఎత్తివేయాలని కాంగ్రెస్ అనుకుంటే బీజేపీ అలా జరగనివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఇదే మోదీ గ్యారెంటీ అని ఆయన ప్రకటించారు. ఇస్లామిక్ అతివాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)పై నిషేధాన్ని తొలగించాలని కూడా కాంగ్రెస్ భావిస్తోందని అమిత్ షా అన్నారు. 'పార్లమెంట్ మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ గతంలో దేశంలో ఎమర్జెన్సీ తెచ్చింది. 2014, 2019 ఎన్నికల్లో మెజారిటీ సాధించినా, మేం రిజర్వేషన్లను తీసేయలేదు. ఆర్టికల్ 370 రద్దు చేశాం. సీఏఏ తీసుకొచ్చాం. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాం'అని ఆయన వివరించారు.

తొలి దశలో 65.5 శాతం పోలింగ్ !

నేడు తుది శాతాలు వెల్లడించనున్న ఈసీ

న్యూఢిల్లీ: శనివారం అందిన తాజా గణాంకాల ప్రకారం లోక్‌సభ ఎన్నికల తొలి దశలో 65.5 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. గణాంకాలను కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 ఎంపీ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగిన విషయం విదితమే. తొలి దశలోనే ఎక్కువ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈసారి ఎక్కువగానే పోలింగ్ శాతం నమోదైందని ఈసీ ఇప్పటికే తెలిపింది. 2019లో ఇవే స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 69.43 శాతం పోలింగ్ నమోదైంది. ఆనాడు 91 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికల సంఘం ఆదివారం తుది గణాంకాలు వెల్లడించే అవకాశం ఉంది.

సాక్షి కరీంనగర్

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



డిప్లొమా.. భవితకు ధీమా

- వివరాలు 8లో

హెడ్మాస్టరే సూత్రధారి

- టీచర్ల వేతనాల గోల్‌మాల్ వ్యవహారంలో తేల్చిన విచారణ కమిటీ
- ఎల్‌ఎండీ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాజభాను సస్పెన్షన్
- అంతకుముందు 'సాక్షి' కథనంపై పోలీసుల అభ్యంతరం
- 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చేందుకు పిలుపు
- కథ అడ్డం తిరగడంతో వెనక్కి తగ్గిన వైనం

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

జిల్లాలో సంచలనం సృష్టించిన తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వ్యవహారం కీలక మలుపు తిరిగింది. రూ.10 లక్షలకు పైగా టీచర్ల వేతనాల చలాన్ల దుర్వినియోగం వాస్తవమేనని విచారణ కమిటీ తేల్చింది. ఈ మేరకు కలెక్టర్, విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్, వరంగల్‌కు పంపిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, హెడ్మాస్టర్ రాజభాను చంద్రప్రకాశ్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో ఆయన ప్రమేయంపై తాము నివేదిక పంపిన మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారని విచారణాధికారి, డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. ఇటీవల రాజభాను ఫిర్యాదు ఆధారంగా ఆ స్కూల్లో క్లర్కుగా పని చేస్తున్న 80 శాతం అంధురాలైన తిరుమల, 80 శాతం అంధుడైన ఆమె సహాయకుడు, భర్త రాజ్‌కుమార్‌లను సూత్రధారులుగా తిమ్మాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ, రూ.10 లక్షల గోల్‌మాల్ వ్యవహారంలో అసలు సూత్రధారి హెడ్మాస్టర్ రాజభాను అని తేలడంతో కథ అడ్డం తిరిగింది.

ఠాణాకు రమ్మన్నారు.. వద్దన్నారు

ఈ కేసులో అసలేం జరిగింది? ఎవరి పాత్ర ఏంటి? అన్న సమాచారంతో ఈ నెల 16న 'అంధులపై బ్రహ్మాస్త్రం' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై తిమ్మాపూర్ పోలీసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'సాక్షి'పై చిందులు తొక్కి, అసలు మీ దగ్గరున్న ఆధారాలేంటో అందజేయాలని 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చేందుకు శుక్రవారం తిమ్మాపూర్ ఠాణాకు పిలిపించారు. రాత్రి 8.30 గంటలు దాటడం.. ఇతర సాంకేతిక కారణాలతో నోటీసులు ఇవ్వడం సాధ్యపడలేదు. దీంతో మరునాడు నోటీసులు తీసుకునేందుకు రావాలని లేదా తామే వచ్చి ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం ఉదయం ఠాణాకు వెళ్లేందుకు 'సాక్షి ప్రతినిధి' సిద్ధమవుతున్న సమయంలో హెచ్‌ఎం రాజభాను సస్పెన్షన్ ఉత్తర్వులు వాట్సాప్‌లో వైరల్ అయ్యాయి. ఇది చూసి, నాలిక కరుచుకున్న పోలీసులు 160 సీఆర్‌పీసీ నోటీసుల విషయంలో వెనక్కి తగ్గారు. అదే సమయంలో పోలీసులకు 'సాక్షి ప్రతినిధి' ఫోన్ చేయగా.. ఠాణాకు రానవసరం లేదని చెప్పడం గమనార్హం.

అజ్ఞాతంలో అంధ దంపతులు..

తమపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదవడంతో అంధ దంపతులైన తిరుమల–రాజ్‌కుమార్ అజ్ఞాతంలోకి వెళ్లారు. హైకోర్టులో బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. తమకు ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని, అయినా తమపై కేసులు నమోదవడంతో ఇద్దరు పిల్లలను వదిలి రహస్యంగా, దూరంగా బతకాల్సి వస్తోందని 'సాక్షి'తో వాపోయారు. సస్పెండైన హెచ్‌ఎం రాజభానును 'సాక్షి' సంప్రదించగా.. తనపై ఏకపక్షంగా, దుష్ప్రచారంతో సస్పెన్షన్ వేటు వేశారని, తానెలాంటి తప్పు చేయలేదని వివరణ ఇవ్వడం విశేషం.

దర్యాప్తుపై తీవ్ర విమర్శలు..

జీతాల గోల్‌మాల్‌లో కేసు నమోదు, దర్యాప్తు విషయంలో తిమ్మాపూర్ పోలీసులపై తీవ్రస్థాయిలో విమర్శలొస్తున్నాయి. గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న హెచ్‌ఎం రాజభాను దర్యాప్తుపై ప్రభావం చూపిస్తున్నారన్న ప్రచారం మొదటినుంచీ జరుగుతోంది. తనపై ఫిర్యాదు చేసిన టీచర్లకు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి, ఆధారాలు ఇవ్వాలని రాజభాను నోటీసులు ఇవ్వడం, వార్త రాసినందుకు పోలీసులు 160 సీఆర్‌పీసీ కింద విలేకరికి నోటీసులు సిద్ధం చేయడం, అంధ దంపతులు ఫిర్యాదు ఇచ్చేందుకు స్టేషన్‌కి వచ్చిన సమయంలో స్పందించకపోవడాన్ని ఉదహరిస్తున్నారు. కేసులో అసలు సూత్రధారి రాజభాను అని, డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీలోనూ తేలడం ఈ ఆరోపణలకు మరింత ఆజ్యం పోసినట్లయింది. టీచర్లు సెలవులో ఉన్న సమయంలో వారికి జీతాలు వేసి, కుంభకోణానికి కారణమైన హెచ్‌ఎంను వదిలి, పాత్రధారులపై నేరారోపణల కింద కేసు నమోదు చేయడం, వారు 80 శాతం అంధులు కావడంతో తిమ్మాపూర్ పోలీసులు ఇప్పుడు ఎలా ముందుకు వెళ్తారన్న ఆసక్తి నెలకొంది. తమ హక్కులకు భంగం వాటిల్లడంపై అంధ దంపతులు హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.



సాక్షి

అంధులపై బ్రహ్మాస్త్రం!

ఈనెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



హెచ్‌ఎం రాజభాను చంద్రప్రకాశ్



రాజభాను సస్పెన్షన్ ఉత్తర్వులు

న్యూస్‌రీల్

నేడు నగరానికి రాధాకిషన్ రావు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన మాజీ డీసీపీ రాధాకిషన్ రావు ఆదివారం కరీంనగర్ రానున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తన తల్లిని చూసేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో ఆయన నగరానికి వస్తున్నట్లు తెలిసింది. పోలీసుల ఎస్కార్ట్ మధ్య ఆయన కొన్ని గంటలపాటు ఆస్పత్రిలో ఉండనున్నారు.

కళాశాలలు ప్రచారానికి అనుమతి తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలు తమ గురించి పబ్లిసిటీ చేసుకోవాలంటే ఇంటర్ బోర్డు కమిటీ నుంచి అనుమతి తీసుకోవాలని డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. కళాశాలల అఫిలియేషన్ రెన్యువల్, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థులు సాధించిన ఫలితాలను గురించి ప్రకటనలు ఇచ్చే ముందు నిబంధనలు పాటించాలని తెలిపారు. కళాశాలల అనుమతి కోసం సమర్పించే అన్ని రకాల సర్టిఫికెట్లు 31మార్చి 2025 వరకు అమలులో ఉండాలన్నారు. 31 మే 2024 వరకు వేసవి తరగతులు నిర్వహించొద్దని తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి షెడ్యూల్ వచ్చేంత వరకు అడ్మిషన్లు చేయొద్దని సూచించారు. పరిపాలన అధికారి సుధాకర్, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రతినిధులు మహిపాల్‌రెడ్డి, మునీందర్, అంజిరెడ్డి, రమణారెడ్డి, నాగార్జునరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వధశాలలు నిర్వహించొద్దు

కరీంనగర్ కార్పొరేషన్: మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలో వధశాలలు నిర్వహించొద్దని నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మేకలు, గొర్రెలు, ఎద్దుల వధశాలల్లో మహావీర్ జయంతి సందర్భంగా కార్యకలాపాలు నిర్వహించడం నిషేధమన్నారు. ఎవరైనా మాంసం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వేసవి శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు కోచ్‌ల నుంచి దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 10కేంద్రాల్లో 1 మే 2024 నుంచి 31మే వరకు వివిధ క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల పీఈటీలు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తమపూర్తి వివరాలతో ఈ నెల 26లోపు దరఖాస్తులు క్రీడాశాఖలో అందించాలని తెలిపారు. వివరాలకు 8008326913 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

భలే మామిడి



గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో ఓ రైతు మామిడితోటలో ఒక కొమ్మకు గుత్తిగా 22 మామిడి కాయలు కాచి ఆశ్చర్యానికి గురి చేసింది. గ్రామానికి చెందిన కర్ర జగన్‌మోహన్ రెడ్డి తోటలో ఈ వింత చోటు చేసుకుంది. జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది ఈ చెట్టు భారీ గాలివానతో విరిగిపోయిందని, ఎండిపోయే దశలో గుత్తిగా ఒకేచోట 50 కాయలు కాచిందని తెలిపాడు. – గంగాధర

నేడు టీఎస్‌ఆర్జేసీ ప్రవేశ పరీక్ష



మాట్లాడున్న డీఆర్‌వో పవన్ కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్ర గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆదివారం జిల్లావ్యాప్తంగా టీఎస్‌ఆర్జేసీ– 2024 పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఆర్‌వో పవన్‌కుమార్ తెలిపారు. శనివారం పరీక్ష కేంద్రాల సీఎస్, డీవోలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 8,547మంది విద్యార్థులు హాజరుకానున్నారని వీరికోసం 36కేంద్రాలు కరీంనగర్‌లో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు సమయానికి రావాలని, పరీక్షసెంటర్‌లో తాగునీరు, ప్రథమచికిత్స, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఏదైనా సమస్య ఉంటే 9866559701 కో ఆర్డినేటర్ పత్తెం శ్రీనివాస్‌ను సంప్రదించాలన్నారు.

ముగిసిన టీఎస్‌ఎన్పీడీసీఎల్ శిక్షణ



కొత్తపల్లి: టీఎస్‌ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ ప్రారంభించి విద్యుత్ ఉద్యోగులతో భద్రత నిబంధనల ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ... వినియోగదారులకు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. డీటీఆర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డీఈలు విజయేందర్‌రెడ్డి కాళిదాసు రాజా, గోపీకృష్ణ, రాజేశం, ఏడీలు కే.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, రాజలింగు, మల్లేశం, పురుషోత్తం, జి శ్రీనివాస్, తిరుపతి, చంద్రయ్య పాల్గొన్నారు.

చినుకు.. వణుకు

- కల్లాల్లో ధాన్యం కుప్పలు
- ఆందోళనలో అన్నదాతలు
- భయపెడుతున్న వాతావరణం
- నెమ్మదిగా ధాన్యం కొనుగోళ్లు

కరీంనగర్ రూరల్/జమ్మికుంట: గాలివాన అన్నదాతను ఆగం చేస్తోంది. శనివారం ఉదయం చినుకులతో మొదలైన వాన రైతుల్లో వణుకు పుట్టిస్తోంది. పంట చేతికొస్తున్న సమయంలో చెడగొట్టు వాన కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వచ్చే మూడు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించడంతో అన్నదాతలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని కరీంనగర్ అర్బన్ మినహా మిగతా మండలాల్లో వేసిన వరిపంట దాదాపు కోతకు వచ్చింది. 80శాతం వరకు పంట కోయగా.. తేమశాతం కోసం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు గడుస్తుండగా ఇంకా ప్రక్రియ వేగవంతం కాలేదు. ఇప్పుడిప్పుడే ధాన్యం కేంద్రాలకు వస్తుండగా సరైన తేమ శాతం ఉంటేనే నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు కోసిన పంటను నేరుగా కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబోస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ దంచికొట్టగా తరువాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చిగురుమామిడి మండలంలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురియగా.. అక్కడక్కడ ధాన్యం తడిసింది. శుక్రవారం రాత్రి నుంచి చల్లబడిన వాతావరణం రైతుల్లో వణుకు పుట్టిస్తోంది. దీంతో ఆరబోసిన ధాన్యాన్ని కుప్పపోసేందుకు తిప్పలు పడుతున్నారు. శనివారం ఉదయం కరీంనగర్ రూరల్, జమ్మికుంట, శంకరపట్నం, రామడుగు, తదితర మండలాల్లో చినుకులు కురియడంతో టార్పాలిన్లు అద్దెకు తెచ్చి ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అన్నదాతలు ఆరాటపడుతున్నారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



కరీంనగర్‌రూరల్: దుబ్బపల్లిలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు



కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లో టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



చెర్లభూత్కూర్‌లో ధాన్యం కుప్పపోస్తున్న రైతులు



జమ్మికుంటలో టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



నామినేషన్ సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, ఇండిపెండెంట్లు ఆర్.రాంకుమార్, పి.రాజు

మూడో రోజు మూడు నామినేషన్లు

కరీంనగర్: కరీంనగర్ పార్లమెంటు స్థానానికి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శనివారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి నామినేషన్లు స్వీకరించారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్ నామినేషన్ వేశారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వెంకటేశ్వరపల్లికు చెందిన పిడిశెట్టి రాజు, కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన రాపోలు రామ్‌కుమార్ భరద్వాజ్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. మూడు రోజుల్లో మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.నేడు ఆదివారం సందర్భంగా సెలవు దినమని, నామినేషన్ల స్వీకరణ ఉండదని సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రుణమాఫీ చేస్తాం.. బోనస్ చెల్లిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

గంగాధర: ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, వచ్చే పంటకు రూ.500 బోనస్ చెల్లిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గంగాధర మండలం మధురానగర్‌లో శనివారం చొప్పదండి నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. రైతుల మరణాలకు మోదీ ప్రభుత్వమే కారణమని, కొండగట్టు బస్సు ప్రమాదంలో 60మందికి పైగా చనిపోతే అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకున్నపాపాన పోలేదన్నారు. ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని ఏడులక్షల కోట్ల రూపాయల అప్పుల పాలు చేసిందన్నారు. మోదీ మూడోసారి ప్రధాని అయితే భవిష్యత్తులో ఎన్నికలు జరగవన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కార్యకర్తలు 23రోజులు కష్టపడి ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్‌లు వేములవాడ, ధర్మపురి ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, వెలిచాల రాజేందర్‌రావు, కర్ర సత్యప్రసన్నరెడ్డి, పద్మాకర్‌రెడ్డి, ప్రణవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల కాంగ్రెస్.. గారడీల బీజేపీ



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే కమలాకర్ తదితరులు

- పార్లమెంటు ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయి
- కాంగ్రెస్ ఇప్పటివరకు అభ్యర్థినే ప్రకటించలేదు
- ఎంపీగా సంజయ్ ఐదేళ్లలో ఒక్కరూపాయీ తేలేదు
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్: అబద్ధాల కాంగ్రెస్, గారడీల బీజేపీ పార్టీలు పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఒక్కటయ్యాయని ఇప్పటి వరకు కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించకపోవడం దేనికి సంకేతమని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మైనారిటీ నాయకుడు జమీలొద్దీన్‌తో కలిసి నామినేషన్ వేశారు. అనంతరం మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. గారడీ మాటలతో పబ్బం గడుపుతున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నయాపైసా అభివృద్ధి చేయలేదన్నారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. తాను 2014నుంచి 2019వరకు ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్–మనోహరాబాద్ రైల్వేలైన్ తెచ్చానన్నారు. కొండగట్టు ఆలయానికి 332ఎకరాల ఫారెస్టు భూమిని కేటాయించడం జరిగిందని వెల్లడించారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తెస్తానని, ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో అంధకారం నెలకొందన్నారు. కాంగ్రెస్ బీజేపీల మాయమాటలకు మోసపోకుండా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు, రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.

కేంద్రంలోనూ ప్రజా ప్రభుత్వమే

- సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి



గ్యారంటీకార్డు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రం తరహాలోనే కేంద్రంలోనూ ప్రజా ప్రభుత్వం ఏర్పడాలనేది ప్రజల కోరిక అని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మార్కెట్ రోడ్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గడపగడపకు పంచ న్యాయాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ వీధి వ్యాపారులు, వ్యాపారులకు గ్యారంటీకార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు పరచనున్న పంచ న్యాయాలపై ప్రజల్లో స్పందన వస్తోందన్నారు. పదేళ్ల బీజేపీ పాలనపై ప్రజలు విసుగు చెందారని, బండి సంజయ్ ఐదేళ్లలో ఏమీ చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ మునిగిపోయిన నావ అని, ఆ అభ్యర్థికి ఓటు వేస్తే వృథాయేనన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం మార్కెట్లో గ్యారంటీ కార్డులు అందజేశారు. నాయకులు దన్న సింగ్,అబ్దుల్ రెహమాన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ చాంద్, కుర్ర పోచయ్య, బత్తిని చంద్రయ్య, దండి రవీందర్ ఉన్నారు.

సంజయ్ కోసం రిటైర్డ్ ఉద్యోగుల ప్రచారం



కరపత్రం ఆవిష్కరిస్తున్న బీజేపీ అభ్యర్థి సంజయ్

కరీంనగర్‌టౌన్: 'దేశాన్ని రక్షించే వ్యక్తి మోదీ.. పిలిస్తే పలికే వ్యక్తి బండి... బీజేపీని గెలిపిద్దాం.. భవిష్యత్‌కు బాటలు వేసుకుందాం' అంటూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గపరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు వినూత్నరీతిలో ప్రచారం ప్రారంభించారు. దేశానికి మోదీ, కరీంనగర్‌లో బండి సంజయ్ చేసిన అభివృద్ధి గురించి కరపత్రం రూపొందించి శనివారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వచ్చేనెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇవ్వబోయే తీర్పుపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు ఎడమ సత్యనారాయణరెడ్డి, లాల మురళి తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా.. భవితకు ధీమా

- ఉద్యోగ అవకాశాలు మెండు
- పాలిసెట్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 22 చివరి తేదీ
- ప్రవేశ పరీక్ష మే 24న
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 12 కళాశాలలు



అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

వేములవాడ అర్బన్: 2024–25 విద్యాసంవత్సరానికి గానూ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ 22 వరకు ఉందని వేములవాడ మండలంలోని అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ తెలిపారు. డిప్లొమా కోర్సులు విద్యార్థుల భవితకు ధీమానిస్తాయని పేర్కొన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష మే 24న ఉంటుందన్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.500 చెల్లించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

5 ప్రభుత్వ, 7 ప్రైవేటు కళాశాలలు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 5 ప్రభుత్వ, 7 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. మొట్టమొదటి ప్రభుత్వ కళాశాలను రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారంలో శ్రీరాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పేరిట 1979లో ప్రారంభించారు. ఇందులో విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణం, విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయి. ఈ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్, కమర్షియల్ ప్రాక్టీస్, టెక్స్‌టైల్ విభాగాల్లో 420 సీట్లు ఉన్నాయి. కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో 60, ఎలక్ట్రానిక్స్‌లో 60, కంప్యూటర్ విభాగంలో 60 సీట్లు ఉన్నాయి. కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్‌లో 60, మెకానికల్‌లో 60, కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ 60, మెకానికల్ 60, హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ 60, ఎలక్ట్రికల్ విభాగంలో 60 సీట్లు ఉన్నాయి. ఇవన్నీ కలిపితే 960 సీట్లు. ఇక, 7 ప్రైవేటు కళాశాలల్లో 1,560 సీట్లు ఉన్నాయి.

విద్యార్హత, సబ్జెక్టులు..

పదోతరగతి రెగ్యులర్, కంపార్ట్‌మెంటల్‌గా ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టుల నుంచి మల్టిపుల్ ఆప్షన్ ప్రశ్నలతో ప్రవేశ పరీక్ష ఉంటుంది. గణితంలో 60 ప్రశ్నలకు 60 మార్కులు, భౌతిక శాస్త్రంలో 30 ప్రశ్నలకు 30 మార్కులు, రసాయన శాస్త్రంలో 30 ప్రశ్నలకు 30 మార్కులు, జీవశాస్త్రంలో 30 ప్రశ్నలకు 30 మార్కులు మొత్తం 150 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి.

ఒక పరీక్ష.. రెండు ర్యాంకులు

పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ ర్యాంకులు ఉంటాయి. వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, యానిమల్ హస్బెండరీ, ఫిషరీస్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కూడా పాలిసెట్ ర్యాంక్ ఆధారంగానే జరుగుతాయి. ఈ కోర్సులు చేయాల్సిన విద్యార్థులు తప్పనిసరిగా జీవశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. జగిత్యాల జిల్లాలోని పొలాస, జమ్మికుంట వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలు పాలిసెట్ ర్యాంకుల ద్వారా కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంజినీరింగ్ కళాశాలల్లో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు, స్వయం ఉపాధి పొందడానికి పాలిటెక్నిక్ విద్య ఉత్తమ మార్గం. ఇంటర్ పూర్తయ్యాక ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులతో పోలిస్తే పాలిటెక్నిక్ ద్వారా ఇంజినీరింగ్ చేసిన విద్యార్థుల్లో ప్రాక్టికల్ పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎక్కువగా ఉంటాయి. ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా ఉంటాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – రాజగోపాల్, ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ కళాశాల, అగ్రహారం

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణకాంత్
- 'జ్యోతిష్మతి'లో సెమినార్


ప్రొఫెసర్ కృష్ణకాంత్‌ను సన్మానిస్తున్న సాగర్ రావు

తిమ్మాపూర్(మానకొండూర్): ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అనలాగ్ మిక్స్‌డ్ సిగ్నల్ ఆర్ అండ్ ఏఎంఎస్ ఓశ్రమ్ ఇండియా హైదరాబాద్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఐఐటీ హైదరాబాద్ డాక్టర్ కృష్ణకాంత్ అవలూర్ అన్నారు. తిమ్మాపూర్ జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రీసెంట్ ట్రెండ్స్ అండ్ చాలెంజ్ ఇన్ వీఎల్ఎస్ఐ డొమైన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో స్మార్ట్ చిప్, స్మార్ట్ సెన్సార్ డిజైన్ తయారీలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్.రావు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో ఏఎంఎస్ ఓశ్రమ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని, స్మార్ట్ చిప్ అండ్ ఫ్యాబ్రికేషన్, స్మార్ట్ సెన్సార్ డిజైన్ ట్రైనింగ్ సెంటర్ ఓపెన్ చేసి, విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు సత్కరించారు. డీన్ అకాడమిక్స్ వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ పి.సంపత్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఆలయం వెనకవైపు చలువ పందిళ్లు


ఇరుముడులు వేసేందుకు జాలీలు

హనుమాన్ చిన్న జయంతికి ఏర్పాట్లు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఈనెల 22 నుంచి 24వరకు నిర్వహించే హనుమాన్ చిన్న జయంతికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మూడురోజుల పాటు జరిగే స్వామివారి జయంతికి ఏటా లక్షలాది మంది భక్తులు, దీక్షస్వాములు తరలివస్తారు. ఈ మేరకు ఆలయ అధికారులు సకల ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతమున్న పార్కింగ్‌స్థలంతోపాటు అదనం చదును చేస్తున్నారు. జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు సిబ్బందిని ఏర్పాట్ల కోసం పంపించారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేశారు.


లడ్డూ, ప్రసాదం క్యూలైన్


సిద్ధంగా లడ్డూప్రసాదాలు


షవర్స్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదం
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్


మాట్లాడుతున్న వెంకటేశ్

కరీంనగర్: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ మళ్లీ అధకారంలోకి వస్తే దేశానికే ప్రమాదమన్నారు. శనివారం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ సమగ్రతకు, సమైక్యతకు విఘాతం కలిగించేలా మతోన్మాదాన్ని పెంచి పోషించిందని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు. అన్ని సర్వేలు బీజేపీ, దాని మిత్రపక్షాలకు 250 సీట్లు దాటవని చెబుతున్నా.. తమ సొంత సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌ను జోడించి, 400 సీట్లు వస్తాయని అబద్ధపు ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్ముకుంటూ దేశ సంపదను దోచుకున్నారని తెలిపారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలనే ఊడగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడపడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. సీపీఎం తెలంగాణలో భువనగిరి స్థానంలో పోటీ చేస్తుందని మిగతా 16 స్థానాల్లో ఇండియా కూటమికి మద్దతు ఇస్తామని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్‌లో బండి సంజయ్‌ని ఓడించాలన్నారు. కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు ఆయన ఆస్తి ఎంత ఎంపీగా గెలిచాక ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రానైట్ మాఫియా వద్ద రూ.వేల కోట్ల ముడుపులు తీసుకొని, సైలెంట్ అయింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇండియా కూటమి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జిమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, జి.రాజేశం, నరేశ్ పటేల్, శీలం అశోక్, మక్కపల్లి పూజ, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వం స్పందించదా?

- ఏబీవీపీ హాస్టల్ విభాగం రాష్ట్ర కన్వీనర్ రంజిత్‌కుమార్


గురుకులం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్రంలోని పలు హాస్టళ్లలో గత నాలుగు నెలల్లో పదిమంది విద్యార్థులు మరణించినా ప్రభుత్వంలో చలనం లేదని ఏబీవీపీ హాస్టల్ విభాగం రాష్ట్ర కన్వీనర్ రంజిత్‌కుమార్ ధ్వజమెత్తారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల ఎదుట శనివారం విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల బాధలు మంత్రులు, సీఎంకు తెలియదా? అని ప్రశ్నించారు. విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యేందుకు కారణమైన వారిని సస్పెండ్ చేయాలని, బాధిత విద్యార్థులు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు జైళ్లకన్నా హీనంగా ఉన్నాయని పేర్కొన్నారు. సన్నబియ్యంతో కూడిన భోజనం విద్యార్థులకు అందడం లేదన్నారు. శిథిలావస్థలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని అన్నారు. ఈకార్యక్రమం విద్యార్థి సంఘాల నాయకులు రసూరి ప్రవీణ్, విష్ణుభక్తుల రిషి, సిద్ధార్థ, వినయ్, అనిల్, వివేక్, పూర్ణచందర్, అభిషేక్, వేణుగోపాల్, శ్రీహర్ష, ప్రీతం, చొప్పరి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ సమయంలో.. ఎక్కువ సంపాదించాలని..

- గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన యువకులు


గంజాయి, యువకులను చూపుతున్న పోలీసులు

గోదావరిఖని: తక్కువ సమయంలో ఎక్కువగా సంపాదించాలనే ఉద్దేశంతో ఇద్దరు యువకులు గంజాయి వ్యాపారం ఎంచుకున్నారు. ఈమేరకు ఓ ఇంట్లో గంజాయి దాచి ఉంచారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. స్థానిక కాకతీయనగర్‌లో రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా 750గ్రాముల గంజాయి పట్టుకున్నారు. కాకతీయనగర్‌లో నివాసం ఉంటూ క్యాటరింగ్ నిర్వహిస్తున్న బీరవేన అభిలాష్(21), స్థానిక హనుమాన్‌నగర్‌లో ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న గంద్రేటి కార్తీక్(21)ను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ దాడి నిర్వహించారు.

జగిత్యాల 'అగ్నిమాపక శాఖ'లో అక్రమాలు?

- నకిలీ బిల్లులు పెట్టేందుకు, ఫైర్ ఇంజిన్ రీడింగ్ మార్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం
- గత నెల 31న రిటైరైన ఫైర్ ఆఫీసర్ కొమురయ్య
- 20 రోజుల తర్వాత రికార్డుల అప్పగింత


రికార్డులు పరిశీలిస్తున్న రిటైర్డ్ ఆఫీసర్, ఫైర్‌మెన్

జగిత్యాల క్రైం: జగిత్యాల అగ్నిమాపక శాఖ కార్యాలయంలో నకిలీ బిల్లులు పెట్టేందుకు, ఫైర్ ఇంజిన్ దూర ప్రాంతాలకు వెళ్లకున్నా రీడింగ్ మార్చి, డీజిల్ బిల్లులు కాజేసేందుకు రిటైర్డ్ అధికారి ప్రయత్నించినట్లు తెలిసింది. జగిత్యాల ఫైర్ ఆఫీసర్‌గా, ధర్మపురి ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారిగా పనిచేసిన కొమురయ్య గత మార్చి 31న ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం ఫైర్ ఇంజిన్ దూర ప్రాంతాలకు వెళ్లకున్నా వెళ్లినట్లు చూపించి, డీజిల్ బిల్లులు కాజేసేందుకు రికార్డులు మార్చేందుకు యత్నించినట్లు సమాచారం. ఇందుకోసం చొప్పదండిలో పని చేస్తున్న ఫైర్‌మెన్‌ను ఇక్కడికి తీసుకువచ్చినట్లు, పాఠశాలలు, కళాశాలల యజమాన్యాల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషల్ ఆఫీసర్‌ని అంటూ చొప్పదండి ఫైర్‌మెన్ వసూళ్లకు పాల్పడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

వదిలేసి పారిపోయాడు..

స్థానికంగా పని చేస్తున్న అధికారి మధుకు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించారు. కానీ, ఫైర్ అధికారిగా 22 రోజుల క్రితమే రిటైరైన కొమురయ్య శనివారం వరకు రికార్డులను ఆయనకు ఇవ్వలేదు. 3 రోజులుగా చొప్పదండి ఫైర్‌మెన్‌తో కలిసి జగిత్యాల కార్యాలయంలోని రికార్డుల్లో మార్పులు చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ‘సాక్షి’ విలేకరి శనివారం అక్కడికి వెళ్లేసరికి రిటైర్డ్ అధికారి, ఫైర్‌మెన్ రికార్డులను పరిశీలిస్తూ కనిపించారు. ఫైర్‌మెన్ వాటిని వదిలేసి, పారిపోయాడు. ఇన్‌చార్జి అధికారి లేని సమయంలో రిటైర్డ్ అధికారితోపాటు ఫైర్‌మెన్ రికార్డుల్లో పలు మార్పులు చేశారని, నకిలీ బిల్లులు పెట్టారన్న చర్చ జరుగుతోంది.

రికార్డులు అప్పగించారు..

జగిత్యాల అగ్నిమాపక శాఖ అధికారిగా కొమురయ్య ఉద్యోగ విరమణ పొందడంతో ఇన్‌చార్జిగా నన్ను నియమించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయన శనివారం నాకు రికార్డులు అప్పగించారు.
– మధు, ఇన్‌చార్జి అగ్నిమాపక శాఖ అధికారి

క్లుప్తంగా

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం



మల్లాపూర్(కోరుట్ల): ఎలక్ట్రిక్ స్కూటర్‌లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన మల్లాపూర్ మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు కూడలి వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రాణవేని మల్లేశ్ అనే ఆర్‌ఎంపీ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను తన క్లినిక్ ఎదుట నిలిపి, లోపలికి వెళ్లాడు. కాసేపటికే ఆ వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడున్నవారు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. స్కూటర్ పూర్తిగా కాలిపోయింది. ఆ వాహనం విలువ సుమారు రూ.65 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

18 నెలలకే నూరేళ్లు..

- భవనం రెండో అంతస్తు నుంచి పడి పసివాడి మృతి


రాఖీ (ఫైల్)

కరీంనగర్‌క్రైం: ఆ పసివాడికి 18 నెలలకే నూరేళ్లు నిండాయి.. ప్రమాదవశాత్తు భవనం రెండో అంతస్తు నుంచి పడి, మృతిచెందాడు. ఈ ఘటన కరీంనగర్‌లోని విద్యానగర్‌లో చోటుచేసుకుంది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీలు రవికాంత్–రిసా దంపతులు ఉపాధి నిమిత్తం నాలుగు నెలల క్రితం విద్యానగర్‌కు వచ్చారు. వీరికి ఓ కుమారుడు రాఖీ(18 నెలలు) ఉన్నాడు. దంపతులు స్థానికంగా నూతన భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. శనివారం రాఖీని రెండో అంతస్తులో పడుకోబెట్టి, కింద పనిలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం భోజనం చేయడానికి పైకి వెళ్లగా చిన్నారి కనిపించలేదు. భవన పరిసరాల్లో వెతకగా కిందపడి, గాయాలతో కనిపించాడు. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి అక్కడి నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలుడి తండ్రి రవికాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

స్వర్ణకారుడి బలవన్మరణం

రాయికల్(జగిత్యాల): రాయికల్‌కు చెందిన స్వర్ణకారుడు ఇల్లెందుల నారాయణ (56) జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. నారాయణ రెండేళ్లుగా కాలునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యులకు చూపించుకున్నా నయం కావడం లేదు. దీంతోఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ముత్తారం(మంథని): ఖమ్మంపల్లి మానేరు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న లారీని శనివారం సీజ్ చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. సీతంపల్లికి చెందిన పులిపాక మహేశ్ తన సొంత లారీలో మానేరు నుంచి ఇసుక అక్రమంగా తరలించి గ్రామ శివారులో డంప్ చేసి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తనిఖీలు చేసి లారీ పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



గోదావరిఖని: స్థానిక విద్యానగర్–2కు చెందిన గాలిపెల్లి జయవర్ధన్(24) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఐటీఐ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్న జయవర్ధన్.. ఏడాదిక్రితం మధ్యవర్తిత్వం వహించి తన మిత్రుడికి రూ.లక్ష అప్పు ఇప్పించాడు. ఇటీవల ఆ మిత్రుడు రూ.80వేలు తిరిగి జయవర్ధన్‌కు ఇచ్చాడు. మిగతా సొమ్ము కలిపి బాకీ తీర్చేందుకు జయవర్ధన్ లోన్‌యాప్ ద్వారా కొంత అప్పు చేశాడు. స్నేహితుల ద్వారా ఈ విషయం తెలియడంతో తండ్రి తిరుపతి.. జయవర్ధన్‌ను ప్రశ్నించాడు. అయితే, అప్పుగా తీసుకున్న రూ.31వేలు తాను రెండురోజుల్లో చెల్లిస్తానని తండ్రి కుమారుడికి చెప్పాడు. అయితే, ఏమైందో ఏమోగానీ.. ఈనెల19న రాత్రి జయవర్ధన్ వంటింట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అయితే, తన కుమారుడి మృతికి గల కారణాలపై విచారణ జరిపి కారకులపై చర్యతీకోవాలని మృతుడి తండ్రి తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి


సాత్విక్ (ఫైల్)

మేడిపల్లి(జగిత్యాల): ఓ విద్యార్థి అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలంలోని వల్లంపల్లికి చెందిన తమ్మనపల్లి సాత్విక్(11) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం స్కూల్‌కు వెళ్లిన సాత్విక్ ఉన్నట్టుండి కిందపడి పోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. అతను కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు బంధువులు తెలిపారు. మృతుడికి తండ్రి వెంకటరమణ, తల్లి భాగ్యలక్ష్మి, అన్న, అక్క ఉన్నారని పేర్కొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.88 లక్షలు పట్టివేత



కరీంనగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌లో శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.88,49,000 పట్టుకున్నట్లు టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన ఉప్పుల రాఘవాచారి, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సూరోజు రమేశ్ వద్ద రూ.71,00,000, టూ టౌన్ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో అశోక్ నగర్‌కు చెందిన అంకిత్ తివారి వద్ద రూ.2,60,000, సుభాష్‌నగర్‌కు చెందిన దామెర అరుణ్ కుమార్ వద్ద రూ.14,89,000 పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ డబ్బులను స్వాధీనం చేసుకొని, సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


సురేశ్ (ఫైల్)

కరీంనగర్ క్రైం: బైక్ అదుపుతప్పి, ఫుట్‌పాత్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా తోగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన పాక సురేశ్ అలియాస్ సూరజ్(26) శుక్రవారం కరీంనగర్‌లోని తన బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చాడు. రాత్రి తిరిగి వెళ్తుండగా స్థానిక మానేరు బ్రిడ్జిపై వాహనం అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేశ్ తల బ్రిడ్జి రెయిలింగ్‌కు బలంగా తగలడంతో తీవ్రగాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు జైబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వెల్గటూర్‌లో కల్తీ మద్యం విక్రయం?


ఓ కంపెనీ బాటిల్‌పై కింగ్‌ఫిషర్ బీరు స్టిక్కర్

వెల్గటూర్ (ధర్మపురి): మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో కల్తీ మద్యం విక్రయించారని వినియోగదారులు ఆరోపించారు. వారి వివరాల ప్రకారం.. వెల్గటూర్‌లోని వైన్స్‌లో శనివారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కింగ్‌ఫిషర్ బీరు కొనుగోలు చేశాడు. ఆ బాటిల్‌పై మరో కంపెనీ పేరు రాసి ఉండటం చూసి, కల్తీ బీరు ఎందుకు విక్రయిస్తున్నారని నిర్వాహకులతో గొడవకు దిగాడు. దీంతో వారు ఆ బీరు బాటిల్‌ను వెనక్కి తీసుకొని, మరొకటి ఇవ్వడంతో వివాదం సర్దుమణిగింది. అయితే ఈ బీర్లు కంపెనీలో తయారు కాలేదని, స్థానికంగా తయారు చేసిన కల్తీవి విక్రయిస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కింగ్‌ఫిషర్ బీర్లకు డిమాండ్ ఉండటంతో ఆ బ్రాండ్ స్టిక్కర్లు అంటించి, కల్తీ మద్యం విక్రయిస్తున్నారని, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ధర్మపురి ఎక్సైజ్ సీఐ మహేందర్‌ను వివరణ కోరగా విచారణ జరిపి, కల్తీ మద్యం విక్రయిస్తున్నట్లు తేలితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గంగాధర(చొప్పదండి): తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు పడి, బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారని ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంగాధర మండలంలోని మధురానగర్‌కు చెందిన ఒడ్నాల ప్రశాంత్ శుక్రవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి కొడిమ్యాల మండలంలోని కోనాపూర్ వెళ్లాడు. శనివారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించి, దాదాపు 14 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.4.06 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధిలోని పోతనకాలనీ, న్యూమారేడుపాక చౌరస్తాలో బైక్‌పై నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కొందరు గుడుంబా(నాటుసారా) రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పోతనకాలనీ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపటారు. ఈక్రమంలో అల్లూరుతండా నుంచి బైక్‌పై వస్తున్న గుగులోత్ కిషన్‌నాయక్‌ను ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద 4 లీటర్ల నాటుసారా లభించడంతో అరెస్టు చేశారు. బైక్ స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుళ్లు ఖాదిర్, ప్రసాద్, శ్రావణ్, శ్రీలక్ష్మి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వాకింగ్

- పలు వ్యాధులను దూరం చేస్తున్న నడక
- ప్రజల్లో వాకింగ్‌పై పెరుగుతున్న ఆసక్తి
- నగరంలో కిటకిటలాడుతున్న మైదానాలు

కరీంనగర్‌టౌన్‌: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నడక తప్పనిసరి అయింది. జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల చాలా మంది శారీరక శ్రమ లేని పనులే ఎక్కువగా చేస్తున్నారు. దీంతో తిన్న ఆహారం ఖర్చుకాక శరీరం క్యాలరీలతో నిండిపోతుంది. దాని ఫలితమే ఊబకాయం, మోకాళ్ల నొప్పులు, మధుమేహం, రక్తపోటు. ఒకప్పుడు నగర, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన జబ్బులు ఇప్పుడు పల్లెల్లోకి కూడా పాకాయి. అందుకే రోజూ నడవమని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. శారీరక శ్రమ లేనివారు ఎలాంటి వ్యాయామం చేయకపోయినా కనీసం ప్రతిరోజూ అరగంట ఆరోగ్యం కోసం నడవాలి. కడుపు మాడ్చుకోనవసరం లేదు.. బరువులు ఎత్తే పనిలేదు.. క్లిష్టమైన వ్యాయామాలు చేయనక్కర్లేదు.. శారీరక వ్యాయామాల్లో అన్నింటికంటే తేలికైనది నడక. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు నడక ఎంతో ఉపయోగకరమైంది. ఇప్పుడు అన్ని వయస్సుల వారు అనుసరిస్తున్న చక్కటి మార్గం ఇది. ఉదయం 6 గంటలకు కరీంనగర్‌లో ఏ ప్రాంతంలో చూసినా వాకర్సే దర్శనమిస్తున్నారు. దీంతో నగరంలోని అన్ని మైదానాలు ఉదయం సాయంత్రం వేళల్లో వాకర్స్‌తో కిటకిటలాడుతున్నాయి.


వాకింగ్‌ చేస్తున్న నగరవాసులు

నడకతో ప్రయోజనాలెన్నో..

ప్రతిరోజూ ఇతర వ్యాయామాలతో పాటు నడక సాధన చేయడం వల్ల అనేక లాభాలున్నాయని క్రీడా, వైద్య నిపుణులు సూచిస్తున్నారు. శరీర సౌష్టవాన్ని కాపాడుకోవడంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు. సూర్యరశ్మి శరీరంపై పడటం వల్ల డీ–విటమిన్‌ లోపాన్ని అధిగమించవచ్చు. ఎముకలు గట్టిపడటానికి దోహదపడుతుంది. ఉద్యోగ, ఉపాధి పనుల్లో రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఆహారపు అలవాట్లను కూడా మార్చుకుని ఉదయం, సాయంత్రం కనీసం గంటపాటు వాకింగ్‌ చేస్తే ఎన్నో ప్రయోజనాలుంటాయని, జీవితకాలం కూడా పెంచుకోవచ్చని తెలుపుతున్నారు. పెద్దలు కూడా పిల్లలకు చిన్ననాటి నుంచే వ్యాయామం, వాకింగ్‌ పై ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కరీంనగర్‌లోని వాకింగ్‌ ట్రాక్‌లు ఇవే..

నగరంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ స్టేడియం, జ్యోతిబాపూలే సర్కస్‌గ్రౌండ్‌, ఆర్ట్స్‌ కళాశాల మైదానం, ఉమెన్స్‌ కళాశాల, ఎస్సారార్‌ కళాశాల మైదానం, శాతవాహన యూనివర్సిటీ, ఎల్‌ఎండీ కట్ట, ఎల్‌ఎండీని ఆనుకొని ఉన్న స్పోర్ట్స్‌స్కూల్‌ మైదానం, హౌసింగ్‌బోర్డుకాలనీలలో వాకింగ్‌ ట్రాక్‌లు ఏర్పాటు చేసుకొని నిత్యం వేలాది మంది నడక కొనసాగిస్తున్నారు. ఇవే కాకుండా ప్రధాన రహదారుల వెంట సైతం చాలా మంది వాకింగ్‌ చేస్తున్నారు. ఇటీవల మహిళలు కూడా అధికంగా కనిపిస్తున్నారు.

ఐదేళ్లుగా వాకింగ్‌ చేస్తున్నా..



అంబేడ్కర్‌ స్టేడియంలో ఐదేళ్లుగా రెగ్యులర్‌గా వాకింగ్‌ చేస్తున్నా. రోజూ గంటపాటు సాధన చేయడం ఆనవాయితీగా పెట్టు కున్నా. నడకతో పాటు వ్యాయామం చేయడం వల్ల ఫిటినెస్‌ మెరుగుపడుతుంది. ఎలాంటి రుగ్మతులు రాకుండా కాపాడుతుంది. వాకింగ్‌ చేయకుంటే ఆ రోజు ఏదో కోల్పోయినట్లుగా అనిపిస్తుంది.

– పి. హరీశ్‌

వాకింగ్‌, జాగింగ్‌ చేస్తా



నేను ప్రతీరోజు స్కూల్‌ నుంచి వచ్చాక వాకింగ్‌, జాగింగ్‌ చేస్తా. నాతో పాటు మా ఫ్రెండ్స్‌ కూడా వాకింగ్‌కు వస్తారు. అందరం కలిసి గంట పాటు వాకింగ్‌, జాగింగ్‌ చేసి ఇంటికి వెళ్తాం. స్కూల్‌లో కూడా రన్నింగ్‌ పోటీల్లో పాల్గొంటా. వాకింగ్‌ చేయడం వల్ల శరీరం తేలికగా అనిపిస్తుంది.

– హితాక్షిశ్రీ

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి



ఆరోగ్య పరిరక్షణకు నడక ఎంతో అవసరం. నడక ప్రారంభించిన మొదటి ఐదు నిమిషాలు చాలా మెల్లగా నడవాలి. దీంతో శరీరం వ్యాయామం చేయటానికి అనువుగా మారి కండరాలు, కీళ్లు కదులుతాయి. నడిచే సమయంలో తేలికపాటి దుస్తులు, షూస్‌ ధరించాలి. ప్రతి ఒక్కరూ ఉదయాన్నే నడవడం అలవాటు చేసుకోవాలి. తారు రోడ్డుపై కాకుండా మట్టి రోడ్డుపై, ట్రాక్‌పై నడవడం ఎంతో మేలు.

– డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ కొండపాక

ఆరోగ్యం కోసం మొదలు పెట్టా



చాలా తేలికైన.. అందరూ చేయదగిన వ్యాయామం నడక. నేను పదేళ్లుగా నడక సాధన చేస్తున్నా. రోజు నాలుగు కిలోమీటర్ల వరకు నడక కొనసాగిస్తా. నిత్యం వాకింగ్‌ చేయడంతో గుండె సమస్యలు, హైబీపీ, కొలెస్ట్రాల్‌ తగ్గడంతో పాటు శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుందని వైద్యులు చెప్పారు.

– మాధవి

రోజంతా ఉత్తేజం



వాకింగ్‌ వల్ల రోజంతా ఉత్తేజంగా ఉంటుంది. పనిలో కూడా చాలా చురుగ్గా ఉంటున్నాం. ఇంట్లోనే సంప్రదాయమైన ఆహారాన్ని తీసుకోవడం, మాంసాహార భోజనాలు చాలా వరకు తగ్గించుకోవడం మేలు. ప్రాణాయామం, యోగా చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయి.

– మనోహర్‌రావు

కాంగ్రెస్‌ పార్టీకి మద్దతు


మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్‌

విద్యానగర్‌(కరీంనగర్‌): పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రజామిత్ర ప్రోగ్రెసివ్‌ డెమోక్రటిక్‌ ఫ్రంట్‌ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్‌ తెలిపారు. శనివారం కరీంనగర్‌ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుటుంబపాలన, అవినీతి దోపిడీ విధానాలకు తెరలేపిన బీఆర్‌ఎస్‌ పార్టీని తమ సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహించిన ఫలితంగా మొన్నటి ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని కూడా గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సిగిరి శ్రీధర్‌, బాపురెడ్డి, తరల్ల నరసయ్య, నేత కిషన్‌ తదితరులు పాల్గొన్నారు

మెస్‌ చార్జీల బకాయిలు విడుదల చేయాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): జిల్లాలోని పాఠశాలల, కళాశాల స్థాయి బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు సంబంధించి మెస్‌ చార్జీలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిపెద్ది శ్రీధర్‌ రాజు ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఆగస్టు నెల నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం కేవలం నిధులు మాత్రమే విడుదల చేయగా వాటికి సంబంధించిన మొత్తాన్ని మాత్రం విడుదల చేయలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు, డైట్‌ బిల్లులు చెల్లించాలని, ప్రతినెలా నిధులు విడుదల చేయాలని కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌ పట్టణంలోని విద్యుత్‌ వైర్లకు ఇబ్బందిగా మారిన చెట్లను తొలగించే నేపథ్యంలో హౌసింగ్‌బోర్డుకాలనీ, కాపువాడ, విట్స్‌ కళాశాల, వరాహస్వామి ఆలయం ఏరియా, మంగళివాడ, అశోక్‌నగర్‌, అహ్మద్‌పురా ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సాయినేని నరేందర్‌ తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

టిఫిన్‌ సెంటర్లకు జరిమానా


జరిమానా విధిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: ప్లాస్టిక్‌ వాడుతున్న హోటళ్లపై నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. శనివారం నగరంలోని పలు హోటళ్లు, దుకాణాలను నగర పాలక సంస్థ కమిషనర్‌ బోనగిరి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రెండు హోటళ్లలో ప్లాస్టిక్‌ ప్లేట్‌లను గుర్తించిన పర్యావరణ ఇంజినీర్‌ స్వామి ఒక హోటల్‌కు రూ.1,000, మరో హోటల్‌కు రూ.500 జరిమానా విధించారు.

సీఎంను కలిసిన 'ఆకారపు'


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

కరీంనగర్‌ కార్పొరేషన్‌: కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్‌ ఆకారపు భాస్కర్‌రెడ్డి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. భాస్కర్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈక్రమంలో భాస్కర్‌రెడ్డి సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిని గెలిపించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం సూచించినట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

నాగర్‌ కర్నూల్‌ తరలిన బీఎస్పీ నాయకులు


నాగర్‌ కర్నూల్‌ వెళ్తున్న బీఎస్పీ నాయకులు

కరీంనగర్‌కల్చరల్‌: చలో నాగర్‌కర్నూల్‌ కార్యక్రమంలో భాగంగా శనివారం కరీంనగర్‌ నుంచి బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్‌ నిషాని రాచంద్రం ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. నాగర్‌కర్నూల్‌లో మాజీ ఎంపీ మంద జగన్నాథం నామినేషన్‌ వేస్తున్న సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు కార్యకర్తలందరూ స్వచ్ఛందంగా వెళ్తున్నారని అన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చేస్తామని మాట్లాడే బీజేపీని ఓడించాలని తెలిపారు. భారత రాజ్యాంగ రక్షణ బహుజన సమాజ్‌ పార్టీతో మాత్రమే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్‌ అసెంబ్లీ అధ్యక్షుడు మాతంగి తిరుపతి, తిమ్మాపూర్‌ మండల అధ్యక్షుడు కనకం రఘు, నేదునూర్‌ సెక్టార్‌ అధ్యక్షుడు ఎనగందుల సదానందం, సీనియర్‌ నాయకులు నిషాని రాజమల్లు తదితరులున్నారు.

నిరుపేద కుటుంబానికి కూలర్‌ అందజేత


కూలర్‌ అందజేస్తున్న స్వప్న

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): కరీంనగర్‌లోని మేము సైతం యువసేన ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శనివారం నిరుపేద కుటుంబానికి కూలర్‌ను అందించారు. సంస్థ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్‌తో పాటు రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

22న మండల పరిషత్‌ సమావేశం

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. ఎంపీపీ టి.లక్ష్మయ్య అధ్యక్షతన మండల పరిషత్‌ సమావేశమందిరంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి గౌరవ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

25న జాబ్‌మేళా

చొప్పదండి: పట్టణంలోని చైతన్య జూనియర్‌ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఎంఎస్‌ఎన్‌ లాబరోటరీస్‌ కంపెనీ ద్వారా నిర్వహించే జాబ్‌మేళాకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంటర్‌ మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులయిన వారు తమ వెంట ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌ కార్డు తీసుకొని రావాలని సూచించారు.

కొత్త ఓటరు కార్డులు పంపిణీ చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలో కొత్తగా ఓటు నమోదు చేయించుకున్న యువ ఓటర్లకు ప్రతి ఒక్కరికీ ఓటరు కార్డులు వెంటనే అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఎలక్షన్‌ ఎఫైర్స్‌ కమిటీ మెంబర్‌ పొన్న వెంకటరమణ, బీజేపీ స్టేట్‌ కౌన్సిల్‌ మెంబర్‌ నాంపల్లి శ్రీనివాస్‌లు శనివారం కరీంనగర్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి, కలెక్టర్‌ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. అలాగే పలు ఎన్నికల అంశాలను కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరగడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు


శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్‌: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు, హక్కుల సాధన కోసం పలు ఉద్యమాలు చేపడుతున్నట్లు సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పర్శరాములు, వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సత్యనారాయణగౌడ్‌, సభ్యుడు మల్లేశం అన్నారు. శనివారం కరీంనగర్‌లో నిర్వహించిన సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పాపన్న చరిత్రను ప్రజలకు తెలిపే విధంగా ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్‌ చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కరీంనగర్‌ మండలం ఇరుకుల్లకు చెందిన ముత్యం శంకర్‌గౌడ్‌, గౌరవ అధ్యక్షుడిగా పంజాల రామ్‌ శంకర్‌గౌడ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దొమ్మాటి రాజమల్లు, ఉపాధ్యక్షులుగా పల్లెల కొమురయ్య, బుర్ర పర్శరాం గౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్‌ను సన్మానించారు.

ఆయుర్వేద వైద్యశిబిరానికి స్పందన

తిమ్మాపూర్‌: రేణికుంటలో పరిపూర్ణ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి స్పందన లభించింది. గ్రామంలోని సబ్‌ స్టేషన్‌ వద్ద క్యాంపు ఏర్పాటు చేసి ఉపాధి కూలీలు, సెంటర్లో పని చేస్తున్న హమాలీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌ హేమలత, మేనేజర్‌ మమత, థెరపిస్టులు లతామాధవి, భరత్‌, మౌనిక, నాయకులు బోయిన రాములు, బోయిని సంపత్‌ పాల్గొన్నారు.

ఓటు ప్రగతికి మూలం



ఓటుపై మెహందీతో అవగాహన కల్పిస్తున్న మహిళా అధికారులు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: ఓటు ప్రగతికి మూలమని, ప్రతిఒక్కరూ స్వతంత్రంగా ఓటు వేయాలని మెప్మా పీడీ రవీందర్‌ అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించడంలో భాగంగా మెహందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, అధికారులు మెహందీతో ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రచారం కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఎన్నికల పర్వం దేశానికి గర్వం అనే నినాదంతో ప్రతీ మహిళా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఓటును అమ్ముకోరాదని, ఓటు వేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్‌ డీడీ పద్మావతి, నగరపాలకసంస్థ అదనపు కమిషనర్‌ స్వరూపరాణి, డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ అనిత, సీవోలు, మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'నానో'పై అవగాహన కరువు

- వినియోగించేందుకు ఆసక్తి చూపని రైతులు
- అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం


దుర్శేడ్‌ సింగిల్‌విండోలో నానో యూరియా బాటిళ్ల స్టాక్‌

కరీంనగర్‌రూరల్‌: వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నప్పటికీ రైతులకు చేరువ చేయడంలో వ్యవసాయశాఖ నిర్లక్ష్యం చేస్తోంది. సాగులో వ్యయ,ప్రయాసలు తగ్గించి ఎక్కువ దిగుబడులు సాధించేందుకు అమలు చేస్తున్న సాంకేతిక పద్ధతులు రైతులకు అందుబాటులో ఉండటం లేదు. ఎరువుల వినియోగం, కూలీలకు ఎక్కువ మొత్తంలో రైతులు ఖర్చు చేస్తున్నారు. భవిష్యత్‌లో సాగు పనులు పూర్తిగా యంత్రాలపైనే చేసేందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం నానో యూరియా(లిక్విడ్‌) అందుబాటులోకి తెచ్చింది. రైతులు పొలాల్లోకి దిగి ఎరువులను చల్లే విధానానికి బదులుగా డ్రోన్ల ద్వారానే నానో యూరియాను పిచికారీ చేస్తే పంటపైనే పడి ఎక్కువ లాభం కలుగుతోంది. రూ.266 వెచ్చించి 45కిలోల యూరియా బస్తాకు బదులుగా రూ.220 పెట్టి అరలీటరు నానో యూరియా వినియోగిస్తే పంటకు మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే మార్కెట్‌లోకి వచ్చి మూడు నెలలవుతున్నప్పటికీ అవగాహన కల్పించక పోవడంతో రైతులు వినియోగించడం లేదు.

ప్రభుత్వరంగ సంస్థల్లో విక్రయాలు

నానో యూరియాను ప్రభుత్వ రంగ సంస్థలైన డీసీఎంఎస్‌, పీఏసీఎస్‌, ఆగ్రోస్‌ కేంద్రాల్లో మాత్రమే యాసంగి సీజన్‌ ఆరంభం నుంచి రైతులకు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఇఫ్కో, క్రిభ్‌కో కంపెనీలు మాత్రమే నానో యూరియాను ఉత్పత్తి చేస్తున్నాయి. కరీంనగర్‌ సింగిల్‌విండోలో 60లీటర్లకు 25లీటర్లు విక్రయించారు. ఇంకా 35లీటర్లు స్టాక్‌ ఉంది. దుర్శేడ్‌ సింగిల్‌విండోలో మొత్తం 146 లీటర్లకు కేవలం 38 లీటర్లు మాత్రమే విక్రయించారు. మిగితా 60లీటర్లకు విక్రయ గడువు ముగియడంతో పక్కన పెట్టారు. సాధారణ యూరియా బస్తా వేస్తే 30శాతం పంటకు అందుతుందని, నానో యూరియా వినియోగిస్తే 80శాతం అందుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే నానో యూరియాపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు వినియోగించేందుకు ముందుకు రావడంలేదు. యాసంగి సీజన్‌ ముగిసిన అనంతరం ఇటీవల గోపాల్‌పూర్‌లో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటికైనా వానాకాలం సీజన్‌ ఆరంభంలో ఉత్పత్తి సంస్థలతోపాటు వ్యవసాయశాఖ రైతువేదికల్లో అవగాహన కల్పిస్తే ప్రభుత్వ ఉద్దేశ్యం నెరవేరుతుందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

నోరు అదుపులో పెట్టుకోవాలి



మాట్లాడుతున్న పద్మాకర్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న బీజేపీ నాయకులు తమ నోరు అదుపులో పెట్టుకోవాలని డీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్‌, పీసీసీ కార్యదర్శి రహమత్‌ హుస్సేన్‌ హెచ్చరించారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ కడిగిన ముత్యమని, ఆయన ఎక్కడినుంచైనా పోటీ చేసి గెలిచే నాయకుడన్నారు. ఎంపీగా బండి సంజయ్‌ చేసిందేమీలేదని, తీసుకొచ్చిన ఒక్క తీగలగుట్టపల్లి ఆర్‌వోబీ పనులు కూడా అరకొరగానే జరుగుతున్నాయని తెలిపారు. ఎంపీగా పొన్నం ఏం అభివృద్ధి చేశారో బీజేపీ నాయకులు వస్తే తాము చూపిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు హైమద్‌ అలీ, ఎస్‌ఏ. మోసిన్‌, రామిడి తిరుపతి, ధన్నా సింగ్‌ బొబ్బిలి విక్టర్‌, కుంబాల రాజ్‌ కుమార్‌, ఆమీర్‌, సిరికొండ శివప్రసాద్‌, గంగుల దిలీప్‌, పోరండ్ల రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించండి


మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న ఉదయ్‌, రాము

గన్నేరువరం: గన్నేరువరం మండలం మైలారం గ్రామ మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్‌లోని మానేరు డ్యాం కట్ట వరకు మానేరు వాగుపై కిలోమీటరన్నర బ్రిడ్జి నిర్మించాలని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్‌ సంపతి ఉదయ్‌కుమార్‌, కార్యదర్శి పుల్లెల రాము విన్నవించారు. కరీంగనర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. బ్రిడ్జి లేని కారణంగా గన్నేరువరం మండలంతోపాటు బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన 80 గ్రామాల ప్రజలకు ప్రయాణ భారంగా పెరిగిందన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య, పేద ప్రజలకు వైద్యం సరైన సమయంలో అందని దుస్థితి నెలకొందని వాపోయారు.

కూలీలకు వసతులు కల్పించండి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న అభయ్‌కుమార్‌

సైదాపూర్‌: ఉపాధి కూలీలు ఎండ దెబ్బకు గురి కాకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఉపాధిహామీ పథకం జిల్లా ప్రత్యేకాధికారి అభయ్‌కుమార్‌ ఆదేశించారు. శనివారం వెన్కెపల్లి, జాగీర్‌పల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సందర్శించి పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న పనుల ద్వారా కూలీలకు గిట్టుబాటవుతుందా? లబ్ధి చేకూరుతుందా అని కూలీలనడిగి తెలుసుకున్నారు. పనులు జరిగే ప్రాంతంలో కూలీలకు అన్ని వసతులు కల్పించాలని ఎంపీడీవో యాదగిరిని ఆదేశించారు. డీఆర్‌డీవో శ్రీధర్‌, అదనపు డీఆర్‌డీవో సంధ్యారాణి, ఏపీవో రాణి, సిబ్బంది ఉన్నారు.



విజయానికి 'కసరత్తులు'

బీఆర్ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం ఉదయం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాసేపు వాకర్లతో కలిసి నడిచి సెల్ఫీలు దిగిన ఆయన.. అనంతరం జిమ్‌లో కసరత్తులు కూడా చేశారు. - ఖమ్మం మయూరి సెంటర్



మామిడి చెట్టెక్కి.. మంత్రిగారి ముచ్చట్లు

ఎన్నికల ప్రచారంలో మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం బోదబండతండాలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. అక్కడే ఉన్న మామిడి చెట్టెక్కి.. తాను కొడంగల్‌లో చదువుకుంటున్నప్పుడు చెట్లెక్కి ఆడుకున్న జ్ఞాపకాలను జూపల్లి గుర్తు చేసుకున్నారు. - కొల్లాపూర్ రూరల్



ఓటు హక్కు మీ బాధ్యత

ఓటు చైతన్యంపై ఎంజీబీఎస్‌లో ఫొటో ఎగ్జిబిషన్

సాక్షి, హైదరాబాద్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా చైతన్యాన్ని పెంపొందించేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో శనివారం ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనను తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ప్రారంభించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ, ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటును ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కును బాధ్యతగా భావించి అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కుపైన అవగాహన కల్పించేందుకు అన్ని ప్రధాన కూడళ్లలో సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ, ఎంజీబీఎస్ నుంచి ప్రతి రోజూ లక్ష మందికి పైగా ప్రయాణం చేస్తారని, ప్రతి ఒక్కరిలో ఓటింగ్‌పైన అవగాహన పెంచేందుకు ఈ ప్రదర్శన దోహదం చేస్తుందని చెప్పారు.

దేశ ప్రజలు బీజేపీని తిరస్కరించబోతున్నారు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మేళ్లచెరువులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు (హుజూర్‌నగర్): పార్లమెంట్ ఎన్నికల్లో దేశ ప్రజలు బీజేపీని తిరస్కరించబోతున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. మోదీ ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందని ధ్వజమెత్తారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశ ప్రజలకు స్వేచ్ఛ ఉండదన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలతో ప్రతిపక్షాలను వేధిస్తున్నారని, జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులను జైల్లో వేశారని విచారం వ్యక్తం చేశారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ వంటి విషయాల్లో మొండిచేయి చూపిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, ఎన్నికల తరువాత ఆ పార్టీ మనుగడ కష్టమని ఉత్తమ్ అన్నారు. రాష్ట్రంలో 15 ఎంపీ స్థానాలను కాంగ్రెస్ గెలువబోతుందన్నారు.

మూడో రోజు 70 మంది నామినేషన్లు దాఖలు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాలకు గానూ నామినేషన్ల ప్రక్రియ మొదలైన మూడో రోజు శనివారం మొత్తం 77 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ నామినేషన్లు సమర్పించారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్, ఆయన సతీమణి ఈటల జమున చెరో సెట్ నామినేషన్‌ను సమర్పించారు. శనివారం దాఖలైన నామినేషన్లలో పెద్ద సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులే ఉన్నారు. మొత్తం 70 మంది అభ్యర్థులు, 77 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. కాగా, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికకు సంబంధించి ఒక్క నామినేషన్ దాఖలైనట్టు రిటర్నింగ్ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో నామినేషన్లను తీసుకోవడం లేదని అధికారులు తెలిపారు.

పువ్వాడ.. గోవింద నామస్మరణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

కొణిజర్ల: మాజీ మంత్రి ఖమ్మం మాజీ ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోవింద నామస్మరణతో కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో శనివారం రాత్రి జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి పువ్వాడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రస్తుత ప్రభుత్వం తొలగించడమే కాక.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. ఈ మేరకు 'కల్యాణలక్ష్మి లేదు గోవిందా, రైతుబంధు గోవిందా, రుణమాఫీ గోవిందా, తులం బంగారం గోవిందా, రైతు భరోసా గోవిందా, మహాలక్ష్మి గోవిందా, కరెంట్ గోవిందా, మిషన్ భగీరథ గోవిందా, కాంగ్రెస్ వచ్చి గోవిందా.. పథకాలన్నీ గోవిందా' అని పాడుతూ.. కార్యకర్తలతో పాడించారు. ఈ గోవింద నామస్మరణను ప్రతి ఊరిలో ఇంటింటా వినిపించాలని కార్యకర్తలకు మాజీ మంత్రి సూచించారు.

తేల్చేది ఆదివాసీలే..



ఆదిలాబాద్ స్కాన్

ఎస్టీ రిజర్వుడ్ అయిన ఆదిలాబాద్‌లో ఆదివాసీ ఓట్లే కీలకం

సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు బీజేపీ కృషి.. వేధిస్తున్న రెబెల్స్ బెడద

పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ కసరత్తు.. చేరికలతో ఊపు

పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ యత్నం.. 'కారు' వీడిన నేతలతో బెంగ

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో త్రిముఖ పోరు నెలకొంది. బీజేపీ నుంచి గొడం నగేశ్, కాంగ్రెస్ నుంచి ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ నుంచి ఆత్రం సక్కు పోటీలో ఉన్నారు. సిట్టింగ్ స్థానం నిలుపుకోవాలని బీజేపీ, పూర్వ వైభవం సాధించాలని కాంగ్రెస్, గతంలో మాదిరి తిరిగి పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్‌లో ఈ మూడు పార్టీలు ఆదివాసీ గోండులనే బరిలోకి దింపాయి. ఆదివాసీ ఓట్లు కీలకంగా పరిగణించే ఈ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులూ ఆదివాసీలు కావడంతో ఓట్ల చీలికపై బెంగ నెలకొంది.

ఇదీ పరిస్థితి..

బీజేపీ నుంచి టికెట్ ఆశించిన ఎంపీ సోయం, రాథోడ్ రమేశ్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వీరు రెబెల్ అభ్యర్థులుగా బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం ఉంది. కాగా శాసనసభ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు (ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్) చోట్ల బీజేపీ గెలుపొందింది. అయితే గొడం నగేశ్‌పై ఆదిలాబాద్ మినహా మిగతా ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం సాగగా, జాతీయ, రాష్ట్ర నేతల జోక్యంతో ఎమ్మెల్యేలు తమ పార్టీ అభ్యర్థి విజయం కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లో మాత్రం దూకుడు కనిపిస్తోంది. ఈ నియోజకవర్గంలో ముఖ్యనేతలు ఇటీవల పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎంపీ వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, విఠల్ రెడ్డి హస్తం గూటికి చేరారు. మొదట బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 22న ఆదిలాబాద్ పర్యటనకు రానుండగా, ఆరోజు భారీ చేరికలపై దృష్టి సారించారు.

నగేశ్ మినహా ఇద్దరు కొత్త ముఖాలు



బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్



కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ



బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు

బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు టికెట్ ఆశించారు. అలాగే అభ్యర్థి ఎంపికకు ముందు బీజేపీలో ఉండి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో చేరిన రాథోడ్ జనార్దన్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు కూడా ఆశావహుల జాబితాలో ఉన్నారు. అయితే అనూహ్యంగా బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన నాలుగు రోజులకే మాజీ ఎంపీ గొడం నగేశ్‌ను అధిష్టానం పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఎంపీ సోయం, రమేశ్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ నుంచి ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్, ఎల్ఐసీ ఉద్యోగి దౌలత్‌రావు టికెట్ ఆశించారు. ఆత్రం సుగుణ, ఆత్రం భాస్కర్, దౌలత్‌రావు స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని కాంగ్రెస్‌లో చేరారు. ఆత్రం సుగుణకు హైకమాండ్ టికెట్ కేటాయించింది. రేఖానాయక్ పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తానని చెప్పినప్పటికీ ఎక్కడా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. నరేశ్‌జాదవ్ కూడా కనిపించడం లేదు. ఇక బీఆర్ఎస్ నుంచి అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఎంపీ టికెట్ కేటాయింపుపై ఆత్రం సక్కుకు అధినేత కేసీఆర్ హామీ ఇవ్వడం, ఈ ఎన్నికల్లో ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించడం జరిగిపోయాయి. గొడం నగేశ్‌కు ఇదివరకు ఎంపీ ఎన్నికల అనుభవం ఉండగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రం తొలిసారి ఎంపీ ఎన్నిక బరిలో నిలిచారు.

ప్రధానంగా వ్యవసాయంపైనే..

ఈ నియోజకవర్గంలో రెండున్నర లక్షల మంది ఆదివాసీ, లక్ష మంది లంబాడా ఓటర్లు ఉన్నారు. ప్రధానంగా ఆదివాసీల ఆదరణ కోసం పార్టీలన్నీ విస్తతంగా కృషిచేస్తున్నాయి. ఇక్కడ ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పత్తి, సోయా, వరి, కంది వంటివి పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో పత్తి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలనే డిమాండ్ ఉంది. పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో పార్టీలు మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

మొదటి ఎంపీ సోషలిస్టు పార్టీ నుంచి..

దేశంలో తొలి సాధారణ ఎన్నికలు జరిగిన 1952లో ఆదిలాబాద్ స్థానం నుంచి చెరుకు మాధవరెడ్డి (సోషలిస్టు పార్టీ) గెలుపొందారు. గతంలో ఏపీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన పి.నర్సారెడ్డి 1989లో ఎంపీగా గెలిచారు. డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి 1996, 1998, 1999లో వరుసగా టీడీపీ నుంచి విజయం సాధించారు. 1996–98 వరకు హెచ్‌డీ దేవెగౌడ, ఐకే గుజ్రాల్ కేబినెట్‌లలో పనిచేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి 1991లో టీడీపీ నుంచి గెలుపొందగా, 2008 ఉప ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ నుంచి గెలిచారు.

ఎన్నికల్లో ప్రధాన డిమాండ్లు..

- ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆర్మూర్ వరకు రైల్వే లైన్ నిర్మించాలి.
- విమానాశ్రయ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి.
- ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టుల నుంచి కాల్వల నిర్మాణం, రోడ్ల నిర్మాణం కోసం ఫారెస్ట్ క్లియరెన్స్ లభించకపోవడంతో నిర్మాణంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలి.
- విద్య, వైద్యం మెరుగుపర్చాలి.
- ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
- గతంలో కేంద్రం ప్రకటించిన గిరిజన విశ్వ విద్యాలయం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయాలని అప్పట్లో డిమాండ్ చేయగా, ఆ వర్సిటీ ములుగుకు పోయింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఇక్కడ విశ్వవిద్యాలయం మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	:	16,44,715
పురుషులు	:	8,02,575
మహిళలు	:	8,42,054
ఇతరులు	:	86

Affidavit

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా అఫిడవిట్‌లో స్థిర,చర ఆస్తులు.. అప్పులు, బంగారం, వాహన వివరాలన్నీ పొందుపరిచారు. అవేంటో చూద్దాం. - సాక్షి నెట్‌వర్క్

స్థిరాస్తులు లేని వినోద్‌కుమార్



సాక్షిప్రతినిధి, కరీంనగర్, జోగిపేట(అందోల్): బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కుటుంబానికి రూ.13.91 కోట్లు ఆస్తులు ఉన్నట్లు తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అందులో తన పేరు మీద చరాస్తులు రూ.1.53 కోట్లు, తన భార్యకు రూ.77.48 కోట్లు ఉన్నట్లు చూపారు. తన చేతిలో రూ.30వేలు, తన భార్య దగ్గర రూ.14,682 ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. తనకు 5గ్రాముల గోల్డ్ రింగ్, తన భార్యకు రూ.1.20 కోట్ల విలువైన ఆభరణాలు ఉన్నట్లు తెలిపారు. తన పేరిట ఎటువంటి స్థిరాస్తులు లేవని, తన భార్యకు రూ.4.89 కోట్ల విలువైన వ్యవసాయ, కమర్షియల్ స్థలాలు ఉన్నట్లు చూపారు.

గాలి అనిల్ అప్పులు 3కోట్లు.. ఆస్తి 31కోట్లు



జోగిపేట (అందోల్): జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ స్థిరాస్తులు(భూములు, భవనాల) విలువ రూ.31,50,00, 000 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ఆయన సతీమణి సంధ్య స్థిరాస్తుల విలువ రూ.50,07,40,571గా పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో ఆయన తీసుకున్న అప్పులు (లోన్లు) రూ.3,16,00,000 కాగా, ఆయన సతీమణి సంధ్య పేరుతో ఎలాంటి అప్పులు లేవని పేర్కొన్నారు. ఆయనకు 22.05 ఎకరాల వ్యవసాయ భూమి, ఆయన భార్యకు 27.06 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. వాహనాలు ఏమీ లేవని, 20 తులాల బంగారం, 6 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు అఫిడవిట్‌లో తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మైండ్ గేమ్ ఆడుతున్నాయి

బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రధాని మోదీపై సానుకూలత వ్యక్తమవుతుండటంతో ప్రజల ఆలోచనలను దారి మళ్లించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు మైండ్ గేమ్ ఆడుతున్నాయని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మండిపడ్డారు. 21 రాష్ట్రాల్లో 102 ఎంపీ స్థానాలకు జరిగిన తొలివిడత ఎన్నికల ఓటింగ్ సరళి చూస్తుంటే మోదీ హవా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండటంతో ఇక్కడ పార్టీ 12 సీట్లు గెలుస్తుందనే నమ్మకం కలుగుతోందన్నారు. శనివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కనుమరుగయ్యే పరిస్థితుల్లో ఉందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. వికసిత్ భారత్ తరహాలో వికసిత్ తెలంగాణ పత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కు లేదు

హామీల పేరిట ప్రజలను దగా చేసింది	వందరోజుల్లో గ్యారంటీల అమలు ఏమైంది ?	ఎమ్మెల్యేలను కాపాడుకోలేని కేసీఆర్.. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారు?	తెలంగాణలో రేవంత్‌రెడ్డి బెయిళ్లు ఇప్పిస్తారా?

మీడియాతో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



బీజేపీ కార్యాలయంలో భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌కి బీఫాం అందజేస్తున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో గ్యారంటీలు అమలు చేస్తామంటూ పెద్ద పెద్ద వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ వాటి అమలు విషయం ఏమైందో స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అవి అసలు కాంగ్రెస్ గ్యారంటీలా? గారడీలా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియమ్మ, ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, రాహుల్ గాంధీ రాజ్యం వస్తుందని రకరకాల రకాలుగా గ్యారంటీల పేరుతో గారడీ చేసి రేవంత్ రెడ్డి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. ఇప్పుడు తల్లి ఎటు పోయింది, కొడుకు ఏమయ్యాడని నిలదీశారు. జూన్ 4 తోనే ఎన్నికల కోడ్ ముగుస్తుండగా, జూన్ 5 నుంచైనా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. మళ్లీ ఆగస్టు 15 నుంచి అంటూ మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీపై కేసీఆర్ విమర్శలు

తెలంగాణలో పీఎం మోదీ పట్ల పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరతారంటూ మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల వెన్నుపోట్లు, పార్టీ నుంచి వలసలు.. ఫోన్ ట్యాపింగ్ అంశం, కూతురు లిక్కర్ స్కాంతో అరెస్టు వంటి పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ సతమతమవుతోందని చెప్పారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు కేసీఆర్ మధ్యలో బీజేపీని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు ఎమ్మెల్యేలను కాపాడుకోలేని పరిస్థితిలో కేసీఆర్.. ఏ ముఖం పెట్టుకుని ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు.

తెలంగాణలో రేవంత్ రెడ్డి బెయిళ్లు ఇప్పిస్తారా?

కేసీఆర్ కుమార్తె కవితకు బెయిల్ ఇప్పించేందుకు బీజేపీ ఐదు సీట్లలో సుపారీ తీసుకుందంటూ రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగైతే తెలంగాణలో అన్నిరకాల బెయిళ్లను సీఎం ఇప్పిస్తారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలోనూ రేవంతే బెయిల్ ఇప్పిస్తారా?.. సమాధానం చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు గతంలో వచ్చిన 40 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ అత్యధిక ఎంపీ సీట్లను గెలుచుకుంటుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌కు బీ ఫాంను కిషన్‌రెడ్డి అందజేశారు.

'ఉచిత బస్సు' ఒక్కటే సర్వరోగ నివారణా?

ఉచిత బస్సు ఒక్కటే అన్ని స్కీమ్‌లకు పరిష్కారమా అని కాంగ్రెస్ పార్టీ నేతలను కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ప్రచారయాత్రలో భాగంగా బాగ్‌లింగంపల్లికి వచ్చిన ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ ఉచిత బస్సు ప్రయాణ హామీనే సర్వరోగ నివారిణి అన్నట్లుగా చెప్పి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ నేతలు ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు.

సీపీఐతో ఓకే

రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ మధ్య కుదిరిన రాజకీయ అవగాహన

- మఖ్దూం భవన్‌కు వెళ్లి చర్చలు జరిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి
- అన్ని స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతిస్తామని ప్రకటించిన సీపీఐ
- భువనగిరిలో సీపీఎం పోటీ చేసినా కాంగ్రెస్‌కే మద్దతని స్పష్టీకరణ



డిప్యూటీ సీఎం భట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కూనంనేని, చాడ తదితరులు


సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు ఓ కొలిక్కి వచ్చింది. శనివారం సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీపీఐ రాష్ట్ర కార్యాలయమైన మఖ్దూం భవన్‌కు వెళ్లారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేసే అంశంపై సీపీఐ నేతలతో చర్చించారు. ఈ చర్చల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషా, పల్లా వెంకట్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రావు, బాలమల్లేశ్, వీఎస్.బోస్ పాల్గొన్నారు. చర్చల అనంతరం ఇరు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలూ కలిసి పనిచేస్తాయని ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అన్ని లోక్‌సభ స్థానాల్లో తమ మద్దతు ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ పతనావస్థ దశకు చేరుకుందని వ్యాఖ్యానించిన ఆయన బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇక భువనగిరిలో సీపీఎం పోటీ చేసినా తమ మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని స్పష్టం చేశారు. 'ఇద్దరం బలంగా ఉండి కలిసి ఉన్నప్పుడు పరిస్థితులు వేరు. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో మాకు సీపీఎంతో పొత్తు లేదు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేశాం. ఇప్పుడు వామపక్షాల ఐక్యత పేరుతో మేం భువనగిరిలో సీపీఎంకు మద్దతిస్తే బీజేపీకి లాభం జరగొచ్చు. అందుకే మేం కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నాం. కానీ, ప్రజా సమస్యలపై పోరాటంలో సీపీఎంతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు.

సీపీఎంతో పొత్తుపై త్వరలోనే స్పష్టత: భట్టి

మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీపీఐ నేతలకు భట్టి కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎంతో చర్చలు జరిపామని, భువనగిరి బరి నుంచి తప్పుకునే విషయంలో ఆలోచించి చెప్తామని వారు చెప్పారని అన్నారు. సీపీఎంతో పొత్తు విషయం త్వరలోనే తేలుతుందని వెల్లడించారు.

పోటీనా... విరమణా?

భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకే సీపీఎం మొగ్గుచూపుతున్న నేపథ్యంలో ఆ ఒక్కచోట మినహా రాష్ట్రంలోని 16 లోక్‌సభ స్థానాల్లో సీపీఎం శ్రేణులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వనున్నాయి.



స్టేట్ స్కాన్

కన్నడ నాడి పట్టేదెవరో!

గత ఎన్నికల్లో బీజేపీ క్లీన్‌స్వీప్

ఈసారి కాంగ్రెస్ గట్టిపోటీ • సర్వేల మొగ్గు కమలనాథులకే

దేశంలో కీలక ఐటీ హబ్‌గా ఆర్థికాభివృద్ధిలో దూసుకెళ్తున్న దక్షిణాది రాష్ట్రం కర్ణాటక. ఇక్కడ రాజకీయాలు నాటకీయంగా మారుతుంటాయి. ఒకప్పుడు జనతాదళ్ (ఎస్) వంటి ప్రాంతీయ పార్టీల హవా సాగిన ఈ రాష్ట్రాన్ని జాతీయ పార్టీలు పూర్తిగా గుప్పెట పట్టాయి. కొన్నేళ్లుగా రాజకీయాలు కాంగ్రెస్, బీజేపీ కూటముల మధ్యే నడుస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన కాషాయదళానికి కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తోంది... - సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కన్నడిగుల ఓటింగ్ ధోరణి భిన్నంగా ఉంటుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 300 సీట్ల మైలురాయిని అధిగమించడంలో దన్నుగా నిలిచిన రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. మొత్తం 28 స్థానాల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఏకంగా 25 సీట్లతో స్వీప్ చేసింది. యూపీఏ కూటమిగా పోటీ చేసిన కాంగ్రెస్, జేడీఎస్ చెరో స్థానంతో పూర్తిగా చతికిలపడ్డాయి. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ విజయం సాధించడం విశేషం. రామకృష్ణ హెగ్డే నేతృత్వంలోని జనతా పార్టీ కాలం నుంచీ కర్నాటకలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. 1984 లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం చవిచూసిన జనతా కొన్ని నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది. గడిచిన నాలుగు దఫాల్లో కూడా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు భిన్నంగానే వచ్చాయి.

కుల రాజకీయాలు...

కన్నడనాట రాజకీయాలు కులాలతో పెనవేసుకున్నాయి. అభ్యర్థుల బలాబలాలు, పార్టీ సామర్థ్యాలతో పాటు కులాలు కూడా గెలుపోటముల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో శివారాధకులైన లింగాయత్‌లను ప్రధానంగా చెప్పుకోవాలి. కర్ణాటకలో ఓబీసీ జాబితాలో ఉన్న లింగాయత్‌లకు 17% ఓటు బ్యాంకుంది. దక్షిణాదిన తొలిసారి బీజేపీకి అధికారం సాధించిపెట్టిన బీఎస్ యడ్యూరప్పది లింగాయత్ సామాజికవర్గమే. దాంతో వారి మద్దతు బీజేపీకి పుష్కలంగానే ఉంటుంది. రాష్ట్ర బీజేపీలో మరో కీలక నాయకుడు బసవరాజ్ బొమ్మై కూడా లింగాయత్ కులానికి చెందిన వ్యక్తే. అందుకే కాంగ్రెస్‌ను లింగాయత్ వ్యతిరేక పార్టీగా బీజేపీ చిత్రీకరిస్తుంటుంది. ముస్లింల 4% ఓబీసీ రిజర్వేషన్ కోటాను గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బసవరాజ్ బొమ్మై సర్కారు రద్దు చేసి వాటిని లింగాయత్, వొక్కలిగలకు చెరో 2% చొప్పున పంచడం తెలిసిందే. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రముఖ లింగాయత్ నేత, మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి దూకడం ఆ పార్టీకి బాగానే కలిసొచ్చింది. ఇక వొక్కలిగ సామాజిక వర్గానికి రాష్ట్రంలో 14 శాతం ఓటు బ్యాంకుంది. ఇదే సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ పార్టీ జనతాదళ్(ఎస్) ఈ ఓటు బ్యాంకును ఇప్పటికీ నియంత్రిస్తోంది. ఓల్డ్–మైసూరు ప్రాంతంలో ప్రాబల్యము ఉన్న వొక్కలిగల ఓట్లపై దృష్టి సారించిన బీజేపీ ఈసారి జేడీ(ఎస్)తో పొత్తు పెట్టుకుంది. కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ది ఇదే సామాజికవర్గం. గత ఎన్నికల డేటాను పరిశీలిస్తే వొక్కలిగ ఓటు బ్యాంకును జేడీ(ఎస్), కాంగ్రెసే పంచుకుంటున్నాయి. తాము అధికారంలోకి వస్తే ముస్లింలకు 4 శాతం కోటాను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీంతో వాళ్ల ఓటు బ్యాంకు తమవైపేనని భావిస్తోంది. ఇక ఓబీసీ కమ్యూనిటీకి చెందిన కురబలు రాష్ట్రంలో 9 శాతం దాకా ఉన్నారు. వీరు చాలా నియోజకవర్గాల్లో ప్రభావం చూపగలరు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యది ఇదే కులం కావడం ఈసారి తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. 1977లో కోల్పోయిన తమ గిరిజన గుర్తింపును పునరుద్ధరించాలనేది కురబల ప్రధాన డిమాండ్. జనాభాలో 24 శాతం వాటా ఉన్న దళిత, గిరిజన ఓట్లను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.



పోలింగ్ తేదీలు
ఏప్రిల్ 26, మే 7

సర్వేలు ఏం చెబుతున్నాయి...

గత ఎన్నికల మాదిరిగానే ఈసారీ కర్నాటక లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే హవా అని ఒపీనియన్ పోల్స్ లెక్కలేస్తున్నాయి. ఎన్డీఏ కూటమిలో బీజేపీకి 22, జేడీఎస్‌కు 2 సీట్లు వస్తాయని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి 4 సీట్లకు పరిమితం అవుతుందని మెజారిటీ సర్వేల అంచనా.

బీజేపీ పట్టు నిలుపుకుంటుందా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బీజేపీ లోకసభ పోరులో మాత్రం పైచేయి సాధించాలని పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని జేడీ(ఎస్)తో ముందుగానే పొత్తు పెట్టుకుంది. మోదీ ఫ్యాక్టర్, కాంగ్రెస్ సర్కారు అవినీతి, అభివృద్ధి అజెండా, అయోధ్య రామమందిరం... ఈ నాలుగింటిని ప్రచారాస్త్రాలుగా మలచుకుంది. జేడీ(ఎస్)కు మూడు సీట్లతో సరిపెట్టి బీజేపీ 25 చోట్ల పోటీ చేస్తోంది. జేడీ(ఎస్) 3 స్థానాల్లో రెండింట దేవెగౌడ కుటుంబమే పోటీ చేస్తోంది. మండ్యలో కుమారస్వామి, హసన్ నుంచి దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ బరిలో ఉన్నారు. జగదీశ్ షెట్టర్ మళ్లీ కమలం గూటికి తిరిగొచ్చి బెళగావి నుంచి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో మండ్య నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచిన ప్రముఖ నటి సుమలతా అంబరీశ్ బీజేపీలో చేరినా ఈసారి పోటీ నుంచి వైదొలగి కుమారస్వామికి మద్దతిస్తున్నారు. మైసూర్ ఎంపీ సీటు ఈసారి దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ సిన్హాను పక్కనబెట్టి మైసూరు రాజకుటుంబ వారసుడు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడయార్‌ను బరిలో దించింది. ఇది సీఎం సిద్ధరామయ్య సొంత జిల్లా. దాంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.లక్ష్మణ్ విజయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఆయన తీవ్రంగా కష్టపడుతున్నారు. బెంగళూరు సౌత్‌లో బీజేపీ యువ నేత, సిట్టింగ్ ఎంపీ తేజస్వి సూర్యకు కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యా రెడ్డి గట్టి పోటీ ఇస్తున్నారు. సీనియర్లకు షాకిస్తూ రాష్ట్ర బీజేపీ పగ్గాలు దక్కించుకున్న యడ్యూరప్ప కుమారుడు బీవై విజయేంద్ర (ప్రస్తుతం ఎమ్మెల్యే)) ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

కాంగ్రెస్ 'లోకల్' ఫోకస్...

తమ గత మిత్రపక్షం జేడీ(ఎస్) కాషాయదళం పంచన చేరడంతో కాంగ్రెస్ పార్టీ ఈసారి ఒంటరి పోరు చేస్తోంది. లోకల్ అంశాలకే ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం సిద్దరామయ్య ప్రధానంగా ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రచారంలో దీన్నే కీలకంగా చేసుకుంటోంది. మోదీ సర్కారు రాష్ట్రానికి చేసిందేమీ లేదంటూ ఖాళీ 'చెంబు'లతో ప్రకటనలు కుమ్మరిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల విజయంలో కీలకపాత్ర పోషించిన 5 గ్యారంటీలను కూడా కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా మలచుకుంటోంది. కుల గణన, రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, 6 న్యాయాలు, 25 గ్యారంటీలతో కూడిన జాతీయ మేనిఫెస్టోను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. మోదీ పాలనలో నిరుద్యోగం, కార్పొరేట్లకు అనుచిత లబ్ధి వంటివాటిని రాహుల్ గాంధీ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు.

కేరళ ప్రచారంలో... బెంగళూరు ట్రాఫిక్ లొల్లి!



బెంగళూరు ట్రాఫిక్ ఏమిటి, కేరళలో ఎన్నికల ప్రచారంలో హాట్ టాపిక్‌గా మారడం ఏమిటి అనుకుంటున్నారా?! కేరళ రాజధాని తిరువనంతపురం లోక్‌సభ స్థానంలో ఈసారి హోరాహోరీ నెలకొంది. కాంగ్రెస్ నుంచి సిటింగ్ ఎంపీ శశిథరూర్ హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ బీజేపీ తరఫున కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ రూపంలో బలమైన అభ్యర్థి బరిలో ఉన్నారు. దాంతో ఆయన్ను దెబ్బకొట్టే ప్రయత్నాల్లో భాగంగా బెంగళూర్ ట్రాఫిక్ అంశాన్ని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రచారంలోకి తీసుకొస్తోంది! బెంగళూరు ట్రాఫిక్ సమస్యలు దేశమంతటా ఫేమసే. దాన్ని బూచిగా చూపించి తిరువనంతపురం ఓటర్లను తమవైపు ఆకర్షించేలా కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా బెంగళూరు ఎయిర్‌పోర్ట్ రోడ్డులో హెబ్బాల్ నుంచి ఎంజీ రోడ్ దాకా కేవలం ఏడు కిలోమీటర్ల ప్రయాణానికి గంటకు పైగా పట్టడం పరిపాటి. దీనివల్ల నిత్యం వందలాది మంది సకాలంలో విమానాశ్రయానికి చేరుకోలేకపోతుంటారు కూడా. దీనికి పరిష్కారంగా సిద్దరామయ్య సర్కారు రూ.1,300 కోట్లతో 6.7 కిలోమీటర్ల పొడవున స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని 2016లో ప్రతిపాదించినా అది పట్టాలెక్కలేదు. రాజీవ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని 'నమ్మ బెంగళూరు ఫౌండేషన్' సంస్థ దుష్ప్రచారమే ఈ ప్రాజెక్టు అటకెక్కేందుకు కారణమని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. తిరువనంతపురంలో ఇదే విషయాన్ని జోరుగా ప్రచారం చేస్తోంది. బెంగళూరు వంటి ఐటీ హబ్‌లో అత్యంత ముఖ్యమైన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి జరిగిన ప్రయత్నాలను అడ్డుకున్న వ్యక్తి తిరువనంతపురంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఏం చేస్తారంటూ ప్రశ్నిస్తోంది. - సాక్షి, నేషనల్ డెస్క్

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో వెయిటింగ్ సీఎం, కాబోయే సీఎం, సూపర్ సీఎం, షాడో సీఎం... ఇలా చాలామంది సీఎంలున్నారు. మరో కరేమో అధిష్టానికి నిధులు సమకూర్చేందుకు ఢిల్లీలో కూర్చున్న కలెక్షన్ మంత్రి. వీళ్లంతా కలిసి ప్రభుత్వాన్ని నడపడానికి కూడా సొమ్ము లేకుండా నిధులన్నీ నొక్కేశారు.
- శివమొగ్గ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ



బీజేపీలో అసమ్మతి నేతలు తిరుగుబాటు చేసి రోడ్లపై కొట్టుకుంటున్నారు. రెబెల్స్‌పై చర్యలు తీసుకోవడం చేతకాని ప్రధాని మీరు. నేను మీలా బలహీనున్ని కాదు. మా పార్టీలో సూపర్, షాడో సీఎంలు ఎవరూ లేరు. ఉన్నది ఒకరే బలమైన సీఎం.
- మోదీకి సీఎం సిద్ధరామయ్య కౌంటర్




ఎలక్టోరల్ బాండ్లు ప్రపంచంలోనే అతిపెద్ద స్కాం. అవి అక్రమమని సుప్రీంకోర్టే తేల్చింది. అయినా వాటిని మోదీ సమర్థించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి కాంట్రాక్టుల లబ్ధి పొందిన వారే బీజేపీకి ఈ బాండ్ల రూపంలో భారీగా ముడుపులు కుమ్మరించారు. వారిపై సీబీఐ, ఈడీ దర్యాప్తులు, కేసులూ మాయమయ్యాయి.
- మాండ్య సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వమంతా వారసులమయం! అలాంటి పార్టీ నాది వారసత్వ కోటా అనడం హాస్యాస్పదం. నాకు పదవి ప్రతిభ, పనితీరు ఆధారంగా దక్కింది. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఘనవిజయం కట్టబెట్టడమే గాక కర్నాటకలో బీజేపీని మళ్లీ తిరుగులేని శక్తిగా నిలిపి కాంగ్రెస్ విమర్శలకు చేతలతో బదులిస్తా.
- కర్నాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర



తొలి సంకీర్ణం



• వీపీ సింగ్

కొలువుదీరిన నేషనల్ ఫ్రంట్ సర్కారు

బీజేపీ, సీపీఎం బయటి నుంచి మద్దతు

11 నెలలకే వీపీ సింగ్ ప్రభుత్వ పతనం

రెండేళ్లకే లోక్‌సభకు మళ్లీ ఎన్నికలు

ఐటీ, టెలికం అభివృద్ధి, పరిశ్రమల ఆధునీకరణ, పేదరిక నిర్మూలన, ఆర్థిక వృద్ధి, మెరుగైన విద్య... ఇలా పలు రంగాల్లో రాజీవ్ సర్కారు చెప్పుకోదగ్గ కృషి చేసినా 1989 లోక్‌సభ ఎన్నికల నాటికి ఎన్నో అంశాలు ప్రతికూలంగా పరిణమించాయి. ఐదేళ్ల పాలనపై జనం అసంతృప్తికి విపక్షాల ఐక్యత తోడైంది. ఫలితంగా కాంగ్రెస్ గద్దె దిగి కేంద్రంలో తొలి సంకీర్ణ సర్కారు ఏర్పాటైంది. అలా తొమ్మిదో లోక్‌సభ ఎన్నికలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయాయి.
- సాక్షి, నేషనల్ డెస్క్

తొమ్మిదో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 525)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	197
జనతాదళ్	143
బీజేపీ	85
సీపీఎం	33
సీపీఐ	12
అన్నాడీఎంకే	11
ఇతరులు	32
స్వతంత్రులు	12

గతం

విశేషాలు...


- 1989 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఉత్తరాది రిక్త హస్తం చూపితే దక్షిణాదే ఆదుకుంది. పార్టీకి ఏపీలో ఏకంగా 39, కర్ణాటక, తమిళనాడుల్లో చెరో 27, కేరళలో 14 స్థానాలు దక్కాయి.
- తొమ్మిదో లోక్‌సభలో ఏకంగా 275 మంది తొలిసారి నెగ్గినవారే!
- వీపీ సింగ్, చంద్రశేఖర్ హయాంలో పంజాబ్, జమ్మూ కశ్మీర్లో పరిస్థితులు మరింత దిగజారాయి.
- రికార్డు స్థాయిలో 6,160 మంది అభ్యర్థులు పోటీ చేశారు.
- 1980 నాటి మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు ఓబీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వీపీ సింగ్ సర్కారు చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇది దేశవ్యాప్త నిరసనలు, ఆందోళనలకు దారితీసింది.

ప్రతిపక్షాల ఐక్యత

బోఫోర్స్ అవినీతితో పాటు 1984 నాటి భోపాల్ గ్యాస్ లీకేజీ విషాదం కూడా 1989 ఎన్నికల్లో విపక్షాలకు బ్రహ్మాస్త్రంగా మారడం విశేషం. రక్షణ మంత్రి విశ్వనాథ్ ప్రతాప్ (వీపీ) సింగ్‌ను మంత్రివర్గం నుంచి రాజీవ్ తొలగించడంతో ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. అరుణ్ నెహ్రూ, ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఫ్తీ మహమ్మద్ సయీద్‌తో కలసి జనమోర్చా పేరిట కొత్త పార్టీ పెట్టారు. వీపీ సింగ్‌కు ఆదరణ పెరుగుతుండటంతో 1988లో జనతా పార్టీ, లోక్‌దళ్, కాంగ్రెస్ (ఎస్) జనమోర్చాలో విలీనమై జనతాదళ్ (పీపుల్స్ పార్టీ)గా అవతరించాయి. జనతాదళ్, టీడీపీ, అసోం గణపరిషత్, డీఎంకే కలిసి నేషనల్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని బరిలో దింపాయి. కాంగ్రెస్‌ను అధికారానికైతే దూరం అయితే చేశాయి గానీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన బలాన్ని సాధించలేకపోయాయి. బోడో ఉద్యమంతో అసోంలో ఎన్నికలు వాయిదా పడటంతో 543 లోక్‌సభ స్థానాలకు గాను 525 స్థానాలకే ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 197 స్థానాలకు పరిమితం కాగా 143 సీట్లతో జనతాదళ్ రెండో అతి పెద్ద పార్టీగా నిలిచింది. బీజేపీకి 85 స్థానాలు లభించాయి. సీపీఎం 33, సీపీఐ 12 సీట్లు గెలవగా టీడీపీ 2 స్థానాలతో చతికిలపడింది. అన్నాడీఎంకే 11, అకాలీదళ్ 6, బీఎస్పీ 3 స్థానాల్లో గెలిచాయి.

బలపడ్డ బీజేపీ

1984 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లతో సరిపెట్టుకున్న బీజేపీ 1989లో 85 స్థానాలకు ఎదిగింది. ఓట్ల శాతాన్ని కూడా 7.74 నుంచి 11.36కు పెంచుకుంది. 1949 నుంచి తాళాలున్న బాబ్రీ మసీదును హిందువుల రోజువారీ ప్రార్థనల కోసం 1985లో రాజీవ్ తెరిపించారు. దీన్ని బీజేపీ అనుకూలంగా మలుచుకుంది. అయోధ్య రామమందిరం నిర్మాణం హామీతో హిందువులకు చేరువైంది. వీహెచ్‌పీ చేపట్టిన ఈ ఉద్యమాన్ని బీజేపీ ప్రధాన ఎన్నికల అంశంగా మలచుకుంది. అయోధ్య అంశం కూడా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బతీసింది.



• చంద్రశేఖర్

రెండేళ్లు, రెండు సర్కార్లు

జనతాదళ్ మినహా మిగిలిన పార్టీలు మంచి ఫలితాలు సాధించలేకపోయాయి. నేషనల్ ఫ్రంట్‌కు బీజేపీ, సీపీఎం బయటి నుంచి మద్దతివ్వడంతో 1977 తర్వాత మరో కాంగ్రెసేతర సర్కారుకు మార్గం సుగమమైంది. వీపీ సింగ్ ప్రధానిగా 1989లో నేషనల్ ఫ్రంట్ సర్కారు ఏర్పాటైంది. ఇది దేశంలో తొలి సంకీర్ణ, మైనారిటీ సర్కారు. కానీ 11 నెలలకే ప్రభుత్వం పడిపోయింది. అద్వానీ రథయాత్రను బిహార్ సర్కారు అడ్డుకోవడాన్ని వీపీ సింగ్ సమర్థించడంతో ఆయన సర్కారుకు బీజేపీ మద్దతు ఉపసంహరించుకుంది. దాంతో 1990 నవంబర్ 7న జరిగిన విశ్వాస పరీక్షలో వీపీ సర్కారు ఓడింది. ఫలితంగా జనతాదళ్ ముక్కలైంది. 64 మంది ఎంపీలతో చంద్రశేఖర్ సమాజ్‌వాదీ జనతాదళ్ పేరిట వేరుకుంపటి పెట్టుకున్నారు. కాంగ్రెస్ మద్దతుతో నవంబర్ 10న ప్రధానిగా ప్రమాణం చేశారు. కానీ రాజీవ్‌పై కేంద్రం నిఘా పెట్టిందంటూ కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించడంతో 1991 మార్చి 6న రాజీనామా చేశారు. అనంతరం రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేసి అస్థిరతకు తెరదించారు.



ఆరాటం

లోక్‌సభ ఎన్నికల విషయంలో ఐటీ హబ్ బెంగళూరుకు ఒక అవాంఛనీయ రికార్డుంది. నగరం నుంచి ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా లోక్‌సభలో అడుగు పెట్టలేదు! ఈ చెత్త రికార్డును సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు కర్నాటక రవాణా మంత్రి రామలింగారెడ్డి కూతురు సౌమ్యారెడ్డి (41). బీజేపీ కంచుకోటైన బెంగళూరు సౌత్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో దిగారామె. సిట్టింగ్ ఎంపీ, బీజేపీ యువజన విభాగం అధ్యక్షుడైన 33 ఏళ్ల తేజస్వీ సూర్యను ఢీకొంటున్నారు. దాంతో ఈ యంగ్ గన్స్ మధ్య పోటీ అత్యంత ఆసక్తికరంగా మారింది.

సౌమ్యారెడ్డి అయ్యేనా...

బెంగళూరు తొలి మహిళా ఎంపీ?

సౌమ్య రాజకీయాలకు కొత్తేమీ కాదు. 2018లో బెంగళూరులోని జయనగర్ నుంచి తొలిసారి అసెంబ్లీకి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 16 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. ఇక బెంగళూరు సౌత్ లోక్‌సభ స్థానంలో 1977 నుంచి ఇప్పటిదాకా కాంగ్రెస్ ఒకే ఒక్కసారి గెలిచింది. తమకు కొరకరాని కొయ్యగా మారిన ఈ సీటును ఈసారి ఎలాగైనా దక్కించుకోవాలని పట్టుదలగా ఉంది. అందుకే సౌమ్యకు తండ్రితో పాటు సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కూడా అన్నివిధాలా దన్నుగా నిలుస్తున్నారు. ఆమె కూడా సుడిగాలి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. ''సూర్య ఐదేళ్లుగా నియోజకవర్గంలో చేసింది విభజన రాజకీయాలు, విద్వేష వ్యాప్తి మాత్రమే. రాష్ట్ర ప్రయోజనాల గురించి లోక్‌సభలో ఒక్కసారైనా మాట్లాడలేదు'' అంటూ దుయ్యబడుతున్నారు. అదే సమయంలో సూర్యకు ముందు బెంగళూరు సౌత్‌కు ఏకంగా ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించిన దివంగత రాజకీయ దిగ్గజం హెచ్.ఎన్.అనంత్‌కుమార్‌పై ప్రశంసలు కురిపిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు సౌమ్య. ''అనంత్‌కుమార్ పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని పోయేవారు. కేంద్ర మంత్రిగా ఎంత బిజీగా ఉన్నా నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. అందుకే ఇక్కడ బీజేపీ వరుసగా గెలుస్తూ వచ్చింది. ఇప్పుడా పరిస్థితి లేదు'' అని ఆమె స్పష్టం చేస్తున్నారు. ''సూర్య మాత్రం ప్రజలకు అస్సలు అందుబాటులో ఉండరు. ఆయన తీరుతో వారంతా తీవ్రంగా విసిగిపోయారు. అందుకే ఈసారి గెలుపు నాదే'' అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వీటిలో ఏకంగా ఐదింటిని బీజేపీ గెలుచుకుంది.
- సాక్షి, నేషనల్ డెస్క్

మార్పే లక్ష్యంగా...

బెంగళూరు వంటి మహానగరం నుంచి ఇప్పటిదాకా ఒక్క మహిళా ఎంపీ కూడా లేకపోవడం ఆశ్చర్యకరమే. మనది ప్రధానంగా పితృస్వామిక సమాజం గనుక మహిళల పట్ల అన్ని రంగాల్లోనూ ఉన్న వివక్ష దీనికి కొంతవరకూ కారణమన్నది సౌమ్య అభిప్రాయం. ''ఈ పరిస్థితిని మార్చేందుకే ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చాను. పార్టీ కార్యకర్తలు మొదలుకుని ప్రజల దాకా అందరూ నన్ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారు. బెంగళూరు నుంచి తొలి మహిళా ఎంపీ అనే రికార్డు నాకు దక్కడం ఖాయమని వారి ఆదరణే చెబుతోంది. మహిళలను కేంద్రంగా చేసుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, చేపడుతున్న పథకాలు నాకు గెలుపును మరింత సునాయాసం చేస్తాయి'' అని అన్నారామె. తమది కుటుంబ పార్టీ అంటున్న బీజేపీ నుంచే లెక్కలేనంత మంది వారసులు బరిలో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. ''రాజకీయ నేపథ్యం కొంతవరకే కలిసొస్తుంది. ప్రజలు అన్నీ గమనిస్తుంటారు. మనం కష్టపడి సామర్థ్యాన్ని నిరూపించుకోకపోతే నిర్మొహమాటంగా పక్కన పెట్టేస్తారు'' అని అభిప్రాయపడ్డారు.

నేపథ్యం...

సౌమ్య పేరొందిన పర్యావరణవేత్త. న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీలోనే మాస్టర్స్ చేశారు. బెంగళూరులో ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే గాక కాంక్రీట్ జంగల్‌గా మారిన నగరంలో పచ్చదనం పెంచేందుకు చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2021లో కాంగ్రెస్ తలపెట్టిన చలో రాజ్‌భవన్ ధర్నా సందర్భంగా మహిళా కానిస్టేబుల్‌పై చేయిచేసుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట



పేదింటి పిల్లలు గొప్పవాళ్లు కావాలంటే చదువొక్కటే మార్గం. నిబద్ధతతో విద్యారంగానికి పెద్ద పీట వేసిన ఏకైక సీఎం జగన్. విద్యా రంగం అభివృద్ధి చెందితే అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతాయనేది నిర్వివాదాంశం. పాఠశాలల్లో అభివృద్ధి లేదనేవారెవరైనా ప్రభుత్వ స్కూళ్లను ఓసారి చూస్తే వారి అభిప్రాయం మార్చుకోక తప్పదు. విద్యార్థుల భవిష్యత్ కోసం పలు పథకాలు చేపట్టి పేదవారి చదువులకు చేయూత అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రతి విద్యావేత్త అభినందించాలి. కాసిన చెట్టుకే రాళ్ల దెబ్బలన్న విషయం తెలిసిందే. ఈ ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా అభినందనలు.

– ఉండవిల్లి కిశోర్ కుమార్, సీనియర్ అధ్యాపకులు, విజయనగరం

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

జగనన్న పాలనలో సామాజిక విప్లవం



స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇన్నేళ్లలో బడుగు బలహీన వర్గాల గురించి ఏపీలో ఇంతగా పరితపించిన నాయకుడు జగనన్న తప్ప మరెవరూ లేరనే చెప్పాలి. చట్ట సభల్లో, కార్పొరేషన్ల ఏర్పాటులో బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్లు, నవరత్నాల్లో సింహ భాగం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన తదితర పథకాలతో పేదలకే ఎక్కువగా లబ్ధి చేకూరింది. జగనన్న సీఎం అయ్యాక పేద ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో చాలా ఎదుగుదల కనిపించింది. బలహీన వర్గాల కోసం తపించే జగనన్నే మళ్లీ సీఎం కావాలి.

– సోము సనత్ కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్(టీసీఎస్),రెడ్డిపాలెం, ప్రకాశం

ఫస్ట్ ఆఫ్..

నేను గుంటూరులోనే పుట్టాను..
నేను పల్నాడులో పుట్టానని మర్చిపోకండీ..
బాపట్లలో పుట్టినోడ్నిరా నేను..
నేను చిన్నప్పుడు చీరాలలో పెరిగినోడ్ని..
ఒంగోలు గోపాలనగరం
వీధి బడిలో చదువుకున్నానురా నేను..
సిద్ధవటాన్ని చూసి అనుకుంటున్నా..
ఇక్కడ నేను పుట్టి ఉంటే ఎలా ఉండేదో అని..
గాజువాక నాకు జన్మస్థానం వంటిది..
భీమవరం నాకు పుట్టిల్లులాంటిది..
పిఠాపురం గురించి విన్నప్పుడల్లా
ఇక్కడ పుట్టి ఉంటే బాగుండేదనిపించింది..
(కట్ చేస్తే..)
చివరకు నేను ఎక్కడ పుట్టానో
నాకు సరిగ్గా గుర్తులేదు..

సెకండాఫ్..

చదువంటే నాకు ఇష్టం.. టెన్త్.. ముక్కీ మూలిగి
గ్రేస్ మార్కులతో పాసయ్యాను..
నేను.. చదువు బై చాయిస్ ఆపేశాను..
నెల్లూరు వీఆర్ కాలేజీలో సీటు ఇవ్వలేదు
సీఈసీ ఇచ్చారు. కానీ నాకు ఎంపీసీ ఇష్టం..
పదో తరగతిలో మార్కులు సరిగా రాక
నేను ఇంటర్‌లో ఎంఈసీ తీసుకున్నాను..
ఇంటర్ చదువుతున్నప్పుడు నా ఫ్రెండ్స్‌తో కలిసి
ఎంపీసీ ట్యూషన్‌కని వినయ్‌బాబు దగ్గరికి వెళ్లేవాడిని..
ఇంగ్లిష్ నాకిష్టం.. కానీ నాకు ఇంగ్లిష్ రాదు..
అందుకే ఇంటర్ ఫెయిలయ్యాను..
నెల్లూరులో సెవెన్త్ గ్రేడ్‌లో నేను ఇంగ్లిష్ స్కూల్ ఫస్ట్..
విసుగొచ్చి.. ఇంటర్‌తోనే చదువు ఆపేశాను..
ఎలక్ట్రానిక్ డిప్లమా చేయడానికి ట్రై చేశాను..
కంప్యూటర్ సైన్స్ డిప్లమా చేశాను.. ఆటో క్యాడ్ చేశాను..
డాక్టర్ అవ్వాలనుకొని అన్నీ ట్రై చేశాను..
ఇప్పటి దాకా రెండు లక్షల పుస్తకాలు చదివాను.
(కట్ చేస్తే..)
టీచర్లు చెప్పే చదువు నాకు నచ్చలేదు.
అందుకే నేను పెద్దగా చదువుకోలేదు..

క్లైమాక్స్..

టీడీపీ వాళ్లు ఏమంటారు.. 10, 15 సీట్లు కుక్క బిస్కెట్లు పడేసినట్లు పడేస్తే.. జనసేన నాయకులు పడి ఉంటారు అని టీడీపీ వాళ్లంటారు. మీరు పడేస్తే మేం పడుంటామా? మేమిస్తాం.. మీరు తీసుకోండి.. ఎన్ని కావాలో తీసుకోండి.. తెలుగుదేశం నాయకుల్ని సీఎం చేయడానికి జనసేన లేదు.. (కట్ చేస్తే..) 2019లో 10 సీట్లు అయినా గెలిచి ఉంటే.. నేను ఎక్కువ డిమాండ్ చేసేందుకు అవకాశం ఉండేది. కానీ.. అది జరగలేదు.. ఈసారి తక్కువ స్థానాలతో పొత్తు పెట్టుకుంటున్నాం. అయినా మనకు వాళ్లు ఎక్కువ సీట్లు ఇస్తే మనం ఏజెంట్లను పెట్టుకోగలమా? వెంట తిప్పుకున్నోళ్లకు భోజనాలు, టీలు, టిఫిన్‌ల మాటేమిటి? అసలు మన బలం ఎంత? ఇవన్నీ ఆలోచించే.. మన వాళ్లకు ఇబ్బందులు ఉండకుండా అడుగులు ముందుకేస్తున్నా.



ఆ తిక్కకు లెక్కే లేదు!

బుర్రకు.. బుద్ధికి లింకు లేదు

వెండి తెరపై ఈలలు వేయించుకున్న పవన్..
రాజకీయ తెరపై మాత్రం కామెడీ
కేఏ పాల్‌ని మించిపోయేలా మాటల కోటలు
నమ్ముకున్నోళ్లను నట్టేట ముంచి బాబు కోసం శ్రమ
మనకు బలం లేదంటూ 'పచ్చ' పార్టీకి దాసోహం
జనసేనాధిపతి తీరుపై అభిమానుల్లో ఆగ్రహం
అసెంబ్లీలోకి వెళ్లే పరిస్థితి లేనేలేదంటూ పందేలు

వెండి తెరపై ఈలలు వేయించుకున్న పవన్.. రాజకీయ తెరపై మాత్రం కామెడీ పండిస్తూ.. కేఏ పాల్‌ని మించిపోతున్నారంటే.. పాల్‌కు కోపం వచ్చి.. నా స్థాయి ఎక్కడ.. పవన్ స్థాయి ఎక్కడ? అని విరుచుకుపడతారేమో! నిజమే మరి.. ప్రపంచంలోనే అతి పెద్ద బహిరంగ సభల్లో ఒకదానికి సారథ్యం వహించిన పాల్ ఎక్కడ? పావలా రాజకీయాలు చేసే పవన్ ఎక్కడ? అంటూ పాల్ అభిమానులు దుమ్మెత్తిపోస్తున్నారు. 'ఈసారైనా అసెంబ్లీ గేటు దాటి లోపలకు వెళ్లాలని మా వపనాలన్న గట్టిగా.. చేత్తో గ్లాసు పట్టుకుంటే పగిలిపోయేంత గట్టిగా.. ఫిక్స్ అయ్యాడు. కానీ ఏరికోరి ఎంచుకున్న పిఠాపురంలో మాత్రం సీన్ చిత్రాన్నం అవుతోంది. జనసేన జెండా కనిపిస్తేనే అక్కడ గూబ గుయ్య్..మనిపించేలా పచ్చ జెండా వాళ్లు తరుముతున్న పరిస్థితి.. ఏమవుతుందో ఏమో..' అని ఇటీవల అక్కడ ప్రచారం కోసమని వెళ్లి.. తిరిగే పరిస్థితి లేక వెనక్కు వచ్చిన ఓ అభిమాని బావురుమన్నాడు.

మాటలతో 'మూటలు'

సాక్షి టాస్క్‌ఫోర్స్: సినిమాకో క్యారెక్టర్‌కి మారిపోవడం హీరో లక్షణం. సరిగ్గా.. అదే మ్యాకప్‌తో రాజకీయాల్లోనూ రాణించాలని పవన్ కల్యాణ్ అనుకుంటున్నారు. తమ్ముడు సినిమాలో గాలికి తిరిగే స్టూడెంట్‌గా ఉన్న పవన్.. రాష్ట్ర రాజకీయాల్లోనూ అదే వైఖరితో పదేళ్ల పాటు పార్టీని, నమ్ముకున్న నాయకుల్ని.. కదిలి వస్తున్న కేడర్‌ని గాలి కొదిలేశారు. అన్నవరం సినిమాలో పోతరాజు మాదిరిగా.. పార్టీని చంద్రబాబు ప్యాకేజీకి బలి ఇచ్చేస్తున్నారు. అత్తారింటికి దారేది సినిమాలో వచ్చినట్లుగా.. 2019 ఎన్నికల్లో ఆవేశంగా వచ్చిన పవనం.. చివరికి చంద్రబాబు షేక్(ప్యాక్) హ్యాండ్‌తో చల్లబడిపోయింది. అత్తని తీసుకెళ్లడానికి వచ్చి.. క్లైమాక్స్‌లో అత్త కుటుంబాన్ని తీసుకెళ్లినట్టు.. చంద్రబాబుని తిట్టడానికి వచ్చి.. చివరికి చంద్రబాబుతో చెట్టాపట్టాలేసుకొని చల్లగా మూటా ముల్లె సర్దుకుని చెక్కేసి.. కొన్నాళ్ల పాటు అజ్ఞాతవాసిగా మారిపోయారు. బాబు జైలుకెళ్లగానే.. వకీల్‌సాబ్‌లా వచ్చేసి.. నా ప్రయాణం ప్యాకేజీతోనే.. సారీ.. సారీ.. చంద్రబాబుతోనే అని జైలు ఎదురుగానే వాదించిన.. పవనాలు.. ఈసారి కొమరం పులి పంజా విసురుతుందన్నట్లుగా డైలాగులు చెప్పారు.



ఉస్తాద్ వచ్చాడురా.. ఇక గ్లాస్ పదునెక్కిపోతుంది.. అన్నే సీఎం అని తీన్‌మార్ చేసుకుంటూ ఎగిరిన పిల్లసేన గాలి మొత్తం ఒక్కసారిగా తీసేశారు. మనకి 175 అవసరం లేదు.. 21 చాలు.. అవే 200 సీట్లతో సమానం.. మీరంతా గ్లాసుతో పాటు పువ్వు పట్టుకొని సైకిల్ తొక్కాల్సిందే.. జెండా కూలీలుగా మారాల్సిందేనని లాలా.. భీమ్లా తెగేసి చెప్పేశారు. ఇంకేముందీ.. కార్యకర్తల పరువు పోయింది. రోజూ మూడు కండువాలు వేసుకోలేక.. మూడు జెండాలు మొయ్యలేక.. ఇక సెలవంటున్నారు. ఇన్నాళ్లూ ఊడిగం చేసిన మా జానీ.. ఈసారైనా పంజా విసురుతాడనుకుంటే, కెమెరామెన్ చంద్రబాబుతో అన్నట్లుగా మారిపోవడం పిల్లసేనలకు మింగుడు పడటం లేదు. టీడీపీ నాయకులకు ఊడిగం చేయడం కంటే ఎంగిలి విస్తరాకులు ఏరుకోవడం నయం.. మీకు పౌరుషం లేదా అని ఊగిపోయి మాట్లాడిన బద్రి అన్నా.. ఇప్పుడు అదే విస్తరాకులు ఏరుకోవడం ఏందయ్యా అంటూ చీవాట్లు పెడుతున్నా.. మాటలతో 'మూటలు' కట్టుకొని పవనాలు పబ్బం గడుపుతున్నారు.

అసలు నివాసం మాత్రం హైదరాబాదే

మొన్న పిఠాపురం వెళ్లి.. నన్ను గెలిపించండి.. ఒక్కసారి అసెంబ్లీకి పంపించండి.. అభ్యర్థిస్తున్నాను.. అర్థిస్తున్నాను.. అంటూ అడుక్కోవడమేంటన్నా.. అని పిల్ల సేనంతా ఆక్రోశంతో రగిలిపోతోంది. జగన్ మోహన్‌రెడ్డి ఎప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు సీఎం కాలేరు.. నా మాటే శాసనం.. అని 2019లో ఊగిపోయారు. ఇప్పుడు జగా...న్... గుర్తుపెట్టుకో.. అథఃపాతాళానికి తొక్కకపోతే నా పేరు పవన్ కల్యాణ్ కాదు.. నా పార్టీ జనసేనే కాదు అని రెచ్చిపోయారు. పవనన్న ఇంకా ఆ భ్రమరావతిలోనే ఉండిపోయినట్లున్నాడంటూ గ్లాసు నేలకేసి కొట్టేస్తున్నారు జన సైనికులు.

2019లో గాజువాక నా గుండెకాయ.. భీమవరం నా మెడకాయ అని మాట్లాడిన పవన్‌ను.. అక్కడి ప్రజలు ఓటుతో కొట్టగానే.. గుండెకాయని గాజువాకలో.. మెడకాయని భీమవరంలో వదిలేసి పారిపోయిన పవన్.. ఇప్పుడు కొత్త అవతారమెత్తి ఇక నుంచి పిఠాపురమే నా స్థిరనివాసమంటూ చెబుతున్నారు. ఈయన అసలు నివాసం మాత్రం హైదరాబాదేనన్న విషయం స్కూల్‌కెళ్లిన పిల్లాడినడిగినా చెబుతారులే అని జనసేన కార్యకర్తలే పెదవి విరుస్తున్నారు. ఆయన నిలకడ లేని మనస్తత్వం.. రెండు మూడు నెలలకు మారిపోయే మాటల సంగతి ప్రస్తావిస్తే... ఇప్పుడు చాంతాడంత అవుతుంది.

గోదావరి ▼ ఉప్పొంగిన
తీరం.. అభిమానం
జగన్ మళ్లీ సీఎం అయితేనే మాకు ఉజ్వల భవిష్యత్తు

- మా ప్రాంత రూపురేఖలు మారాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి
- గోదావరి జిల్లాల్లో ప్రతి పది మందిలో ఎనిమిది మందిది ఇదే మాట
- మంచి చేసిన సీఎం జగన్ వెంట నడుస్తున్న ప్రజానీకం
- బస్సు యాత్రలో సీఎం జగన్‌కు బ్రహ్మరథం పట్టిన జనం
- టీడీపీ, బీజేపీ, జనసేన వెన్నులో వణుకు పుట్టించిన రాజమహేంద్రవరం రోడ్ షో
- గోదావరి జిల్లాల చరిత్రలో అతి పెద్దవిగా భీమవరం, అచ్చంపేట జంక్షన్ సభలు



వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రాష్ట్రంలో మహిళల తల రాతలు మార్చిన సీఎం జగన్
వివిధ పథకాల ద్వారా రూ.1,89,519.08 కోట్ల లబ్ధి

శక్తి స్వరూపిణి



ఈ మొత్తంతో పేద మహిళలు కొత్తగా వ్యాపారాలు, చిన్న పరిశ్రమల ఏర్పాటు

- ఐదేళ్లలో **18,37,568** మంది పేద మహిళలకు శాశ్వత జీవనోపాధి
- **54** శాతం మంది పొదుపు సంఘాల మహిళల ఆదాయాల్లో భారీగా పెరుగుదల
- **14,01,519** మంది మహిళల ఆదాయం ఏటా కనీసం లక్షకు పైగా పెరుగుదల
- మరో **31,04,314** మంది ఆదాయం రూ.60 వేలు-లక్ష మధ్య పెరుగుదల
- పెరిగిన ఆర్థిక పరపతి.. బ్యాంకుల ద్వారా రూ.**1.73** లక్షల కోట్ల రుణాలు
- ఐదేళ్ల క్రితం ఎక్కువ మంది ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచే రుణం
- ఇప్పుడు తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణాలు
- వడ్డీ రూపంలో ఒక్కో కుటుంబానికి రూ.**60** వేల దాకా ఆదా
- ఉపాధి అవకాశాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ మహిళలకు పెద్దపీట
- కేవలం సచివాలయాల ఉద్యోగాల భర్తీ ద్వారా **63,791** మంది మహిళలకు కొలువు
- కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకు పదవుల్లోనూ సీఎం వైఎస్ జగన్ పెద్దపీట
- నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం
- బాలికలు, మహిళల రక్షణ కోసం 'దిశ'

బాబు హయాంలో

రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు.. మాట తప్పారు. సున్నావడ్డీ పథకం సైతం రద్దు చేశారు. దీంతో అప్పులు తడిసి మోపెడయ్యాయి. అప్పట్లో అక్కచెల్లెమ్మలే బ్యాంకులకు అపరాధపు వడ్డీతో సహా వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. తద్వారా ఏ, బీ గ్రేడ్‌లలో ఉన్న సంఘాలు సీ, డీ గ్రేడ్‌లలోకి పడిపోయాయి. ఎన్‌పీఏ(రుణాలు సకాలంలో చెల్లించలేనివి)లు 18.36 శాతానికి చేరాయి.

జగన్ హయాంలో

తన పాదయాత్రలో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల కష్టాలు వైఎస్ జగన్ కళ్లారా చూశారు.. నేనున్నానని మాటిచ్చారు. ఇచ్చిన మాట మేరకు 2019లో అధికారంలోకి రాగానే ఆ మాట నిలుపుకున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్ర బ్యాంకర్ల సంఘం (ఎస్ఎల్‌బీసీ) వివరాల ప్రకారం మహిళల పేరిట పొదుపు సంఘాలలో ఉండే రూ.25,571 కోట్ల రుణాన్ని నాలుగు దఫాలుగా ప్రభుత్వమే నేరుగా మహిళల చేతికి అందజేసింది. మొత్తం 7,98,395 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని మొత్తం 78,94,169 మంది మహిళల పేరిట అప్పట్లో బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తం వైఎస్ జగన్ ప్రభుత్వమే భరించింది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా లబ్ధి పొందిన అక్కచెల్లెమ్మల పొదుపు సంఘాలు తిరిగి క్రియాశీలకంగా మారాయి. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.45 శాతానికి తగ్గాయి.

మహిళకు ఆర్థికంగా 'ఆసరా' కల్పిస్తే.. ఆ ఇల్లు ఆనందాల పొదరిల్లే.. అతివకు చేయూత'నిస్తే.. ఆ సమాజం సంక్షేమ రాజ్యమే.. నైపుణ్యం పెంచి.. ఉపాధి కల్పించి అన్నింట్లోనూ సగం అని భరోసానిస్తే.. ఆమె రక్షణకు ఉక్కు కవచంలా దశ'దిశ'లా అండగా నిలిస్తే.. అప్పుడు ఆ సంక్షేమ ప్రభుత్వానికి, అభివృద్ధి నినాదానికి అక్కచెల్లెమ్మలంతా జై కొడతారు.. రాష్ట్రంలో ఇప్పుడు అదే జరుగుతోంది. అర్ధరాత్రి వరకూ క్యూలైన్లలో నిలబడి తమ నాయకుడిని గెలిపించుకుంటామంటూ.. మేమంతా సిద్ధం అంటూ బ్రహ్మరథం పడుతున్నారు.

– మేడికొండ కోటిరెడ్డి, సాక్షి, అమరావతి

అక్కచెల్లెమ్మల జీవితాల్లో ఎన్నడూ ఊహించని మార్పు.. వారికి ఆర్థికంగా చేయూతనివ్వడమే కాకుండా.. ఆ డబ్బుతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి కుటుంబ ఆదాయానికి చేదోడువాదోడుగా ఉండేలా తోడ్పాటునిచ్చారు. నచ్చిన వృత్తి, వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందేలా ప్రముఖ కంపెనీల సాయంతో నైపుణ్య శిక్షణ అందించారు. అవసరమైతే అతి స్వల్ప వడ్డీతో రుణ సాయం అందించారు.

అప్పుల ఊబిలో కూరుకుపోయిన పొదుపు సంఘాలకు ఇచ్చిన మాటను సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. చంద్రబాబు చేసిన మోసంతో బ్యాంకుల్లో అప్పులు పేరుకుపోయి ఆస్తులు అమ్ముకోవాల్సిన స్థితిలో ఆ డ్వాక్రా సంఘాలకు నేనున్నానంటూ ఆసరాగా నిలబడ్డారు. బ్యాంకుల్లో పేరుకున్న రుణం తీర్చేలా రూ.25,571 కోట్లను నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేశారు. 78,94,169 మంది మహిళల అప్పుల్ని ప్రభుత్వమే చెల్లించింది. డ్వాక్రా సంఘాల వడ్డీ మాఫీ చేస్తూ.. రూ.4,969.04 కోట్లను ప్రభుత్వమే జమ చేసింది.

మహిళా సాధికారతకు 'చేయూత'

ప్రభుత్వం గత ఐదేళ్లలో వైఎస్సార్ చేయూత పేరుతో వినూత్న కార్యక్రమాన్ని అమలు చేసింది. ఈ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 45–60 ఏళ్ల మధ్య వయసుండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు నాలుగు విడతల్లో మొత్తం రూ.75 వేల చొప్పున 26,98,931 మందికి రూ.19,189.60 కోట్లను అందించింది. కేవలం ఆర్థిక సాయానికే పరిమితం కాకుండా చిన్న, మధ్య తరహా వ్యాపారాల ఏర్పాటుకు ముందుకొస్తే వారికి అదనపు తోడ్పాటు అందించారు. మహిళలకు శిక్షణనిచ్చేలా, వారి ఉత్పత్తులు అమ్ముకునేందుకు నాలుగేళ్ల క్రితమే హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్, ఐటీసీ , ప్రాక్టర్ అండ్ గాంబుల్, రిలయన్స్ రిటైల్, అమూల్, అజియో వంటి కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ వ్యాపార సంస్థలు మహిళలకు శిక్షణ ఇస్తాయి. తక్కువ ధరలకే ఈ సంస్థలు ముడి సరుకులు ఇవ్వడంతో పాటు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయి. మహిళలకు వ్యాపారం కోసం చేయూతలో నగదు ఇవ్వడమే కాకుండా, అవసరమైన మొత్తాన్ని బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలుగా అందిస్తున్నారు. ఇంతవరకూ చేయూతలో 18,37,568 పేద మహిళలు వివిధ ఉపాధి మార్గాలతో నెలనెలా రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ ఆదాయం పొందుతున్నారు.

డ్వాక్రా సంఘాలకు ఊపిరి

- బాబు హయాంలో డ్వాక్రా పొదుపు సంఘంలో మొత్తం 10 మంది సభ్యులుంటే అందరికీ కలిపి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు మించి బ్యాంకు రుణం ఇచ్చేవారు కాదు. ఈ ప్రభుత్వం ఆసరాతో బ్యాంకు రుణాలు తీరడం, కొత్త రుణాలు సకాలంలో చెల్లించడంతో ఇప్పుడు ఒక్కో సంఘానికి ఏకంగా రూ.20 లక్షల రుణం ఇస్తున్నారు.
- పొదుపు సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకే (సున్నా వడ్డీ కింద మాఫీ) రుణాలు తీసుకొని, మళ్లీ ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. గత 58 నెలల్లో ఏకంగా రూ. 1,73,474.94 కోట్లు బ్యాంకుల ద్వారా రుణంగా పొందారు.
- గతంలో బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణం పొందడం కష్టంగా ఉండేది. ఇప్పుడు పొదుపు సంఘాల మహిళలకు ఎంత కావాలంటే అంత రుణం ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నాయి. మహిళల కుటుంబ ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి మందికి పైగా పొదుపు సంఘ మహిళలకు ప్రత్యేకంగా ఆర్థిక అంశాలపై శిక్షణ ఇస్తోంది.
- ఐదేళ్ల కిత్రం మహిళలు ప్రైవేట్ వ్యాపారుల నుంచి రూ. 2 అంతకంటే ఎక్కువ రేటుకు అప్పులు తెచ్చుకునేవారు. ఇప్పుడు తక్కువ వడ్డీకి అప్పులు పొందడం ద్వారా ఈ ఐదేళ్లలో ఏకంగా రూ. 60 నుంచి రూ.70 వేల దాకా వడ్డీల రూపంలోనే ఆదా చేసుకున్నారు.

ఈ 5 ఏళ్లలో ఉపాధి పొందిన మహిళలు

వ్యాపారం	ఏర్పాటు చేసుకున్న వారి సంఖ్య
కిరాణా దుకాణాలు	1,27,174
బట్టలషాపులు	56,580
డెయిరీ (గేదెలు, ఆవులు)	3,80,466
మేకలు, గొర్రెల పెంపకం	1,34,514
కోళ్ల పెంపకం	1,37,826
చేయూత మార్టులు భాగస్వామ్యులు	3,60,000
చేపల పెంపకం	10,580
ఫుడ్ ప్రాసెసింగ్	20,989
వ్యవసాయ అనుబంధ యూనిట్లు	3,95,469
ఇతర జీవనోపాధులు	2,13,970
మొత్తం	8,37,568

31 లక్షల మందికి రూ.60 వేలకు పైగా ఆదాయం

జగన్ ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాల్లోని 54 శాతం మంది మహిళలు ఏటా రూ.60 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారని కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో తేలింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గ్రామీణ ప్రాంతాల్లో 84.80 లక్షల మంది ఆదాయాల్లో పెరుగుదలపై పరిశీలనలో.. రాష్ట్రంలోని 14,01,519 మంది పొదుపు సంఘాల మహిళలు ఏటా రూ.లక్ష స్థిర ఆదాయం పొందుతున్నారు. 31,04,314 మంది నెలకు రూ. 5వేల నుంచి రూ. 8వేలు అందుకుంటున్నారు. 33,27,219 మంది ఆదాయం ఏడాదికి రూ. 25 వేల నుంచి రూ. 60 వేల మధ్య ఉన్నట్లు వెల్లడైంది. 98 శాతం మంది పేద మహిళల ఆదాయంలో స్పష్టమైన మార్పు కనిపించింది.

సున్నావడ్డీ కింద రూ.4,969 కోట్ల సాయం

చంద్రబాబు రుణాలు మాఫీ చేయకుండా మహిళల్ని మోసగించడమే కాకుండా.. సున్నా వడ్డీ పథకం సైతం రద్దు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సున్నా వడ్డీ పథకాన్ని మళ్లీ అమలు చేసి నాలుగేళ్లలో కోటి మందికి పైగా మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో రూ.4,969.04 కోట్లను ఖాతాల్లో జమచేసింది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీతో పొదుపు సంఘాలు క్రియాశీలకంగా మారడంతో నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) 18.36 శాతం నుంచి 0.45 శాతానికి తగ్గాయి. దీంతో 99.5 శాతం మంది మహిళలు ఇప్పుడు సకాలంలో రుణాలు చెల్లించే స్థాయికి ఎదిగారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 21-4-2024



వైరల్

వరల్డ్ క్లాస్ డ్యాన్స్

హృతిక్ రోషన్ కాలు తిరిగిన డ్యాన్సర్. అతడి డ్యాన్స్‌కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. అలాంటి సూపర్ డాన్సరే ఈ వైరల్ డ్యాన్స్ వీడియోను చూసి 'వరల్డ్ క్లాస్' అంటూ ప్రశంసల వర్షం కురిపించాడు. ఒక రియాల్టీ షోలో ఒక డ్యాన్స్ గ్రూప్ బాలీవుడ్ సినిమా 'భుల్ భులైయా' లోని 'అమి జే తోమార్' పాటకు అద్భుతంగా డ్యాన్స్ చేసింది. ఈ వీడియో 7 లక్షల వ్యూస్‌ను దక్కించుకుంది. ఇక మరో డ్యాన్స్ వైరల్ వీడియో విషయానికి వస్తే...'పుష్ప' సినిమాలోని 'ఊ అంటావా' పాటలో సమంత డ్యాన్స్ మూమెంట్స్‌ను అక్షరాలా అనుసరిస్తూ అద్భుతంగా డ్యాన్స్ చేసింది ఆర్యా మార్యమ్ అనే చిన్నారి. ఆర్యా నృత్యప్రతిభకు సమంత, త్రిషా క్రిష్ణన్‌లాంటి సెలబ్రిటీలు కూడా శభాష్ అన్నారు.







ది అశోకా మేకప్ ట్రెండ్

కొత్త వైరల్ మేకప్ ట్రెండ్ ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రియేటర్‌లు, మేకప్ ఆర్టిస్ట్‌లు ఈ ట్రెండ్‌లో జాయిన్ అవుతున్నారు. ఇంతకీ ఏమిటీ మేకప్ ట్రెండ్ అనే విషయానికి వస్తే....

షారుఖ్ ఖాన్–కరీనా కపూర్ 'అశోకా' సినిమాలోని 'సన్ సనానన' పాటలోని కరీనా కపూర్ మేకప్‌ను ఫాలో కావడమే ఈ ట్రెండ్‌కు సెంట్రల్ పాయింట్. హెన్నా డిజైన్ నుంచి జువెలరీ మెరుపుల వరకు ఈ ట్రెండ్‌లో భాగం అవుతున్నాయి. ఈ ట్రెండ్‌ను 'ది అశోకా మేకప్ ట్రెండ్' అని కూడా పిలుస్తున్నారు.

కొన్ని నెలల క్రితం బ్లాగర్, ఆర్టిస్ట్ అజ్మా టేగర్ 'అశోక' సినిమాలోని కళింగ మహారాణి ఆహార్యాన్ని అనుసరిస్తూ చేసిన వీడియో వైరల్ అయింది. ఒక్కముక్కలో చెప్పాలంటే అప్పుడెప్పుడో వచ్చిన 'అశోక' సినిమా డ్యాన్స్ నుంచి మేకప్ వరకు ఏదో రకంగా 'ట్రెండ్' రూపంలో పలకరిస్తోంది.

అయ్యా... ఇదిగో ఆమ్యామ్యా



పరీక్ష పేపర్‌లో ఏముంటాయి? ప్రశ్నలు, జవాబులు.

అయితే ప్రశ్నలకు జవాబులు రాయలేని విద్యార్థులు మాత్రం 'విన్నపాలు వినవలె' టైప్‌లో రకరకాల కామెంట్స్ రాస్తుంటారు. 'నా మీద దయ ఉంచి ఈ పేపర్‌లో పాస్ మార్కులు వేయండి. నా చర్మంతో మీకు చెప్పులు కుట్టిస్తాను'... ఇలాంటి కామెంట్స్ పరీక్ష పత్రాలలో కనిపించడం కొత్తేమీ, వింతేమీ కాదు. అయితే ఒక స్టూడెంట్ మాత్రం 'ఆమ్యామ్యా' రూట్‌లో వెళ్లాడు. పరీక్ష పేపర్ మడతలో రెండు వందల నోటు పెట్టి 'నన్ను పాస్ చేయగలరు' అని రిక్వెస్ట్ చేశాడు. సదరు స్టూడెంట్ ప్రశ్నలకు జవాబు రాయకుండా ఆ ప్రశ్నలనే తిరిగి రాసి తన అపూర్వ ప్రతిభను ప్రదర్శించాడు. ఈ ఆన్సర్ షీట్ వీడియో వైరల్ అయింది.

ఎంజాయ్ చేయండి... రొట్టెలు చేయకండి!



ఈ వైరల్ వీడియోను చూస్తూ రోటీ అభిమానులు కిచెన్‌లో ఎగిరి గంతేస్తున్నారు. తీరా విషయం తెలిశాక ఉత్సాహాన్ని ఉట్టిలో పెట్టి కామ్ అయిపోతున్నారు. ప్రెషర్ కుకర్‌తో నిమిషాల వ్యవధిలోనే 'రోటీ రెడీ' కాన్సెప్ట్‌ను ఆవిష్కరించింది ఒక గృహిణి. అయితే ఇది 'ఉత్తుత్తి మానిప్యులేటెడ్ వీడియో. అన్‌సేఫ్. ప్రమాదాలు జరుగుతాయి' అంటూ చాలామంది హెచ్చరించారు. సారాంశం ఏమిటంటే ఈ వీడియో చూసి ఎంజాయ్ చేయాలే కానీ, రొట్టెలు చేయాలనుకోకూడదు. ఎందుకొచ్చిన లొల్లి!

అయిగిరి నందిని... ఆహా జల తరంగిణి



ప్రాచీన సంగీత వాయిద్యం 'జల్ తరంగ్'తో శశికళ ధని 'అయిగిరి నందిని' పాట ట్యూన్‌ను అద్భుతంగా, అలవోకగా ప్లే చేసింది. ఈ వైరల్ వీడియో 3.2 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది. వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా పదిహేడవ శతాబ్దానికి చెందిన ఈ సంగీత పరికరం గురించి నెటిజనులు బోలెడు విషయాలు షేర్ చేసుకుంటున్నారు. ఈ సంగీత పరికరాన్ని 'జల్–యంత్ర' అని కూడా పిలుస్తారు.

'ఆహ్లాదకరమైన అద్భుత సౌండ్. ఇక నుంచి ఇదే నా రింగ్‌టోన్'

'జల్ తరంగ్ నేర్చుకోవాలని డిసైడైపోయాను'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

అతనో సామాన్య ఉద్యోగి.
లంచ్ టైమ్‌లో తోటి ఉద్యోగులతో భోం చేస్తున్నాడు ఆఫీసులో.
ఒక కుర్రాడు దర్జాగా తలుపు తీసుకొని వచ్చాడు.
'లేచి నిలబడు నాన్నా' అన్నాడు.
'ఎందుకురా?' అన్నాడు తండ్రి.
'ఒక పై అధికారి వస్తే లేచి నిలబడాలి కదా' అన్నాడు.
ఆ తర్వాత ఏం జరిగింది.
సివిల్స్‌లో 441వ ర్యాంక్ సాధించిన క్షితిజ్ అనే కుర్రాడు
తన తండ్రికి ఇచ్చిన సర్‌ప్రైజ్.
ఇది వైరల్ అవకుండా ఎలా ఉంటుంది?

పై అధికారి వచ్చాడు నాన్నా



అదేదో సినిమాలో వెంకటేశ్ 'నేను కలెక్టరయ్యి మీటింగ్‌లో ఉంటే బయట మా బాబు నన్ను కిటికీలో నుంచి చూస్తూ ఆనందబాష్పాలు రాలుస్తూ ఉంటే' అని కలలు కంటాడు. అతనిది ఉత్తుత్తి కలే అయినా నిజంగా దాదాపు అలాంటి ఘటన మొన్న సివిల్స్ రిజల్ట్స్ వచ్చిన రోజున జరిగింది. రూర్కీ (హరిద్వార్ జిల్లా, ఉత్తరాఖండ్)లో క్షితిజ్ గుర్బలే అనే కుర్రాడు తన తండ్రిని ఆఫీసులో కలిసి ఆనందపరిచాడు. కలీగ్స్‌తో భోజనం చేస్తున్న తండ్రి గదిలోకి దూసుకెళ్లి 'లేచి నిలబడు నాన్నా' అన్నాడు. అర్థం కాని తండ్రి 'ఏంట్రా' అన్నాడు.



'పెద్ద ఆఫీసరొస్తే లేచి నిలబడాలి కదా' అన్నాడు. అప్పటికే తండ్రికి కొడుకు సివిల్స్ రాశాడని తెలుసు కనుక ఆనందంతో లేచి తబ్బిబ్బవుతూ హత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. రూర్కీ ఐఐటిలో చదువుకున్న క్షితిజ్ 'రెండేళ్లు కష్టపడి 441 ర్యాంక్ సాధించి మా నాన్నను సంతోష పెట్టాను' అని ఇన్‌స్టాలో ఆ వీడియోను పోస్ట్ చేశాడు. దాంతో ఈ వీడియోకి 25 లక్షల లైకులు.. పది వేల కామెంట్లు వచ్చాయి.'ఉప్పొంగిన తండ్రి ఛాతీని హత్తుకోవాలంటే కొడుకు అంత కష్టపడాలి' అని చాలామంది రాశారు. కొంతమంది సరదా కామెంట్లు కూడా చేశారు. తండ్రితో పాటు ఉన్న ముగ్గురు కలీగ్స్‌ను ఉద్దేశిస్తూ 'వాళ్ల పిల్లలకు ఇవాళ బడితె పూజే' అని కొందరన్నారు. తండ్రి పక్కన ఉన్న ఒక కలీగ్‌ని ఉద్దేశిస్తూ 'అతని ఉత్సాహం చూస్తే అల్లుడు దొరికేసినట్టే అనుకుంటున్నట్టున్నాడు' అని మరికొందరు కామెంట్ చేశారు. పుత్రోత్సాహం అనే పద్యం మన కుంది. ఆ పద్యాన్ని గుర్తు చేసుకునే సందర్భం మాత్రం ఇదిగో ఇలాంటి సమయాల్లోనే వస్తుంది.

హెల్త్



మనిషి గుండెలో నాలుగు గదులూ (ఛాంబర్స్), నాలుగు కవాటాలూ (వాల్వ్స్) ఉంటాయి. వీటిల్లో కుడివైపున ఉండే వాటిని ట్రైకస్పిడ్ వాల్వ్, పల్మనరీ వాల్వ్ అని, ఎడమవైపున ఉండే వాటిని మెట్రల్ వాల్వ్, అయోర్టిక్ వాల్వ్ అనీ అంటారు. వీటి మార్పిడి జరగాలంటే నిన్న మొన్నటివరకు తప్పనిసరిగా గుండెను పూర్తిగా తెరిచే ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయాల్సి వచ్చేది. దాంతో గాయం మానడానికి చాలా సమయం పట్టేది. హాస్పిటల్‌లో ఉండాల్సిన వ్యవధీ పెరిగేది. కానీ ఇప్పటి పురోగతి, సదుపాయాల వల్ల శస్త్రచికిత్స లేకుండా కూడా కవాటాల మార్పిడి జరుగుతోంది. అందువల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయి. ఆ వివరాలివి...

శస్త్రచికిత్స లేకుండానే గుండె కవాటాల మార్పిడి!

గుండె కవాటాలు దెబ్బతినడానికి అనేక కారణాలు ఉంటాయి. ప్రధానంగా మన దేశంలో రుమాటిక్ హార్ట్ డిసీజ్ అనే జబ్బు కవాటాలను ఎక్కువగా ప్రభావితం చేస్తోంది. ఇదేకాకుండా పెరుగుతున్న వయసుతో పాటు క్రమంగా క్యాల్షియం చేరుతుండటం వల్ల గానీ, లేదా గుండెకు సంబంధించిన రక్తనాళాల జబ్బులతో, అలాగే పుట్టుకతోనే బలహీనంగా ఉన్న కవాటాల వల్ల, వాటితో పాటు ఇన్ఫెక్షన్లు లేదా డయాబెటిస్ వల్ల కూడా గుండె కవాటాలు దెబ్బ తినే ప్రమాదం ఉంది.

లక్షణాలు...

ఆయాసం, కళ్లు తిరగటం, ఛాతీలో నొప్పి, కాళ్ల వాపులు, గుండె దడ, నిస్సత్తువ, జ్వరం వంటి లక్షణాలతో కవాటాల జబ్బులు వ్యక్తం అవుతాయి. కొన్ని రకాల కవాటాల జబ్బుల్లో ముఖ్యంగా అయోర్టిక్ వాల్వ్ జబ్బుల్లో ఆకస్మిక మరణాలూ సంభవించే ముప్పు ఉంటుంది.

చికిత్స...

గుండె కవాటాల జబ్బుల్లో నాలుగుదశలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు దశల్లో మందులతోనే చికిత్స చేస్తారు. నాలుగోదశలో జబ్బు తీవ్రతను బట్టి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం రావచ్చు. సాధారణంగా ఇప్పటి వరకు వాల్వ్‌లో సమస్యలు ఉన్నవాళ్లకి వాల్వ్ మార్చటమే ప్రధానమైన చికిత్సగా ఉండేది. ఒక్క మైట్రల్ స్టినోసిస్ అనే జబ్బుకి మాత్రం బెలూన్ సహాయంతో కవాటాన్ని రిపేర్ చేయగలిగే అవకాశం ఉండేది. గుండె కవాటాల పరిమాణం మూడు నుంచి ఐదు సెంటీమీటర్లు ఉండటంతో వీటిని మార్చడమనేది కేవలం శస్త్ర చికిత్స ద్వారా మాత్రమే సాధ్యమయ్యేది. సాధారణంగా గుండె రక్తనాళాలకు ఉపయోగించే స్టెంట్లు కేవలం రెండు నుంచి నాలుగు మిల్లీమీటర్ల వ్యాసంతో ఉంటాయి. వీటిని చేతి మణికట్టు ద్వారా లేదా తొడ రక్తనాళం నుంచి అమర్చే అవకాశం ఉంటుంది. అయితే వాల్వ్‌ల విషయంలో మాత్రం ఇది ఇప్పటివరకూ వీలు కాలేదు.



డా. ఎమ్.ఎస్.ఎస్. ముఖర్జీ, సీనియర్ కార్డియాలజిస్ట్

కవాటాల చికిత్సలో ఇప్పుడు కొత్తగా వచ్చిన పరిణామాలివి...

మునుపటిలా కాకుండా ఇప్పుడు గుండె కవాటాల మార్పిడి తొడ ద్వారా కూడా అమర్చే ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. గడచిన పది సంవత్సరాల్లో జరిగిన సాంకేతికమైన అభివృద్ధి ఇందుకు దోహదపడింది. గుండెలో నాలుగు కవాటాలనూ కాలి నుంచే మార్చేందుకు తగిన సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు సమకూరింది. వీటిలో అత్యధికంగా చేస్తున్న ప్రక్రియ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్మెంట్. దీన్ని టావర్ (టీఏవీఆర్) అనీ, టావి (టీఏవీఐ) అని గాని పిలుస్తారు.

శస్త్రచికిత్సతో పోలిస్తే టావర్‌తో ప్రయోజనాలివి...

కవాటాలకు సంబంధించిన శస్త్రచికిత్సలో ఛాతీని పూర్తిగా తెరిచిన తర్వాతే కవాటాన్ని మార్చడం సాధ్యమవుతుంది. అందువల్ల ఈ తరహా శస్త్రచికిత్సలన్నీ ఓపెన్ హార్ట్ పద్ధతిలోనే జరగాల్సి ఉంటుంది. దీని కోసం పూర్తిస్థాయిలో మత్తు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే 'టావర్' చేసేటప్పుడు మత్తు ఇవ్వాల్సిన అవసరం కాని, గుండెని ఓపెన్ చేయాల్సిన అవసరం కానీ ఉండదు. తద్వారా టావర్లో త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. శస్త్ర చికిత్సకు సంబంధించిన అనేక దుష్ఫలితాలు ఉండవు. ముఖ్యంగా ఊపిరితిత్తుల జబ్బు, పక్షవాతంలాంటి సమస్యలు ఉన్నవారికి, ఎక్కువ వయసు ఉన్నవారికి, గుండె పంపింగ్ సామర్థ్యం బాగా తక్కువగా ఉన్న వాళ్లకి శస్త్రచికిత్స కన్నా టావర్ బాగా ఉపయోగపడుతుంది.

శస్త్రచికిత్స లేకుండా కూడా మైట్రల్ వాల్వ్ చికిత్స పద్ధతులు


ఇందులో మైట్రా క్లిప్ అని, టిఎమ్‌వీఆర్ అనే రెండు ప్రధానమైన పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో కూడా గుండెని ఓపెన్ చేయకుండానే అంటే... శస్త్ర చికిత్స చేయకుండానే మైట్రల్ వాల్వ్‌ని రిపేర్ లేదా రీప్లేస్ చేయవచ్చు. ఇదేవిధంగా గుండెకి కుడివైపు ఉన్న కవాటాలకు టీపీవీఆర్ లేదా ట్రిక్ వాల్వ్ అనే పద్ధతులూ అందుబాటులో ఉన్నాయి.

ఈ సాంకేతికత మన దగ్గర ఉందా?

తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రధానమైన ఆసుపత్రుల్లో ఇలా కాలి ద్వారా చేసే చికిత్స ఇప్పటికే అందుబాటులో ఉంది. అయితే ఇప్పటికి ఈ చికిత్స కాస్త ఖరీదైనదే. భారతదేశంలో తయారైన కృత్రిమ కవాటాలు అమర్చేందుకు సుమారుగా 15 లక్షలు, పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయిన కవాటాలను అమర్చేందుకు సుమారుగా 25 లక్షల వరకు ఖర్చు అవుతుంది. త్వరలోనే మరింత చవకగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

కోలోరెక్టల్ క్యాన్సర్ అంటే...?

పెద్దపేగు కోలన్ జీర్ణమైన ఆహారంలోని నీటిని పీల్చుకుంటుంది. ఇక మిగిలిన పిప్పి (వ్యర్థాలన్నీ) మలంగా మారి మలాశయం వద్దకు చేరుతుంది. ఇలా పెద్దపేగూ, మలాశయం... ఈ రెండూ కలిసే చోట లేదా జీర్ణ వ్యవస్థ చివరి భాగాల్లో వచ్చే క్యాన్సర్‌ను కోలో-రెక్టల్ క్యాన్సర్ అంటారు. గతంలో ఈ క్యాన్సర్ పాశ్చాత్య దేశాల్లోనే ఎక్కువగా కనిపించేది. ఇటీవల మన దగ్గరా పెరిగింది. మనకు వచ్చే క్యాన్సర్లలో ఇది నాలుగో అతి ప్రమాదకరమైన క్యాన్సర్. దీనిపై అవగాహన కోసమే ఈ కథనం.



పెద్దపేగు లేదా మలద్వారానికి ముందు భాగం తాలూకు లోపలి పొరల్లో మొదట కండ (పాలిప్స్) పెరగడంతో మొదలై... తర్వాత అది క్యాన్సర్‌కు దారితీయవచ్చు. అయితే తొలుత ఇలా పెరిగిన కండ క్యాన్సర్‌ది కాకపోవచ్చు. కానీ ఇలా పెరిగే క్రమంలో అక్కడి కణాల్లోని జన్యుపదార్థంలో మార్పుల వల్ల ఇది క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంటుంది. ఒకసారి కణం క్యాన్సర్‌గా మారాక అది నిరంతరం పెరుగుతూ క్యాన్సర్ గడ్డలా పెరగవచ్చు. ఈ క్యాన్సర్ కణాలు రక్తప్రవాహంలోకి చేరి, పేగు, కాలేయం, ఊపిరితిత్తుల వంటి చోట్లకు పాకవచ్చు.

రిస్క్ ఫ్యాక్టర్లు...

● పెరిగే వయసు అనివార్యమైన ముప్పు. అందుకే 45 ఏళ్లు దాటినవారిలో ఇది కనిపిస్తుంది (ఇటీవల 20, 30లలో ఉన్న కొందరిలోనూ ఇది కనిపించింది). ● మద్యం అలవాటు, పొగతాగడం ● స్థూలకాయం, మధుమేహం (డయాబెటిస్) ● ఆహారంలో వేటమాంసం (రెడ్ మీట్) లేదా పీచుపదార్థాలు తక్కువగా ఉంటూ, కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం (పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు బాగా తక్కువగా తీసుకునే వారిలో ఇది కనిపించడం సాధారణం). ● క్రోన్స్ డిసీజ్ లేదా అల్సరేటివ్ కొలైటిస్ వంటి ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్‌ల వల్ల. ● కుటుంబ ఆరోగ్య చరిత్రలో ఈ వ్యాధి ఉన్న వారి కుటుంబ సభ్యులకు. ● జన్యుపరంగా వచ్చే కొన్ని వ్యాధులు ఉండటం కూడా కోలోరెక్టల్ క్యాన్సర్‌కు ఒక ముప్పు కావచ్చు. ఉదాహరణకు లించ్ సిండ్రోమ్, ఫెమీలియల్ అడినొమాటోసిస్ పాలిపోసిస్ సిండ్రోమ్, కౌడెన్స్ సిండ్రోమ్ వంటివి.

లక్షణాలు...

● మలంలో రక్తం పడటం లేదా మలం నల్లగా రావడం. ● రక్తహీనత (పెద్దపేగులో పెరిగిన కండ నుంచి నిరంతర రక్తస్రావం వల్ల ఇలా రక్తహీనత ఏర్పడుతుంది). ● మలవిసర్జక అలవాట్లు మారడం (అంటే గతంలో పోలిస్తే ఎక్కువసార్లు లేదా తక్కువసార్లు మలవిసర్జనకు వెళ్లడం. కొన్నిసార్లు విరేచనాలు లేదా కొన్నిసార్లు మలబద్ధకం. అలాగే కొన్ని సందర్భాల్లో మలవిసర్జన తర్వాత కూడా కొంత లోపలే ఉండిపోయిందన్న ఫీలింగ్. అలాగే కొన్ని సార్లు మలంతో పాటు బంక పడటం. ● ఇటీవలే గుర్తించిన కొత్త లక్షణం ఏమిటంటే... మలధార పెన్సిల్ అంత సన్నగా ఉండటం. అందుకే దీన్ని 'పెన్సిల్ థిన్ / న్యారో స్టూల్స్' అంటారు.

నిర్ధారణ...

సీబీపీ, సీరమ్ ఫెరిటిన్, ఎల్ఎఫ్‌టీ వంటి రక్తపరీక్షలు, ఫీకల్ అక్కల్ట్ బ్లడ్ టెస్ట్, ఫీకల్ ఇమ్యునలాజికల్ టెస్ట్ వంటి కొన్ని మలపరీక్షలతో పాటు కోలనోస్కోపీ, సీటీ కొలనోగ్రఫీ, ఎమ్మారైతో పాటు కొన్ని సందర్భాల్లో పెట్ సీటీ వంటి పరీక్షలు.

చికిత్స...


కోలోరెక్టల్ క్యాన్సర్ వ్యాధి ఏ దశలో ఉంది, అది ఏ మేరకు వ్యాపించింది, క్యాన్సర్ గడ్డలు ఎంత పెద్దగా ఉన్నాయి, బాధితుల ఆరోగ్యపరిస్థితి ఎలా ఉందనే... అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని చికిత్స ప్రక్రియను నిర్ణయిస్తారు. శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి ప్రక్రియలతో చికిత్స జరుగుతుంది.

చికిత్సల్లో ఇటీవలి పురోగతి

గతానికి భిన్నంగా... సర్జరీకి ముందుగానే రేడియేషన్, కీమో చికిత్స ఇచ్చి గడ్డ సైజు బాగా తగ్గిపోయాక అప్పుడు శస్త్రచికిత్స నిర్వహించే 'టోటల్ నియో అడ్జువెంట్ ట్రీట్‌మెంట్ – (టీఎన్‌టీ) ప్రక్రియను ఇటీవల ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీనితో ఫలితాలు బాగుండటంతో పాటు మలద్వారపు ముడి (స్ఫింక్టర్) గట్టిగా బిగుసుకునే ఉండటం (లీక్ కాకపోవడం) వంటి ప్రయోజనాలు ఉండటంతో పాటు ఆ తర్వాత ఇచ్చే మందులకు బాధితులు బాగా స్పందించడం వల్ల ఇటీవల డాక్టర్లు ఈ మార్గాన్ని ఎక్కువగా అవలంబిస్తున్నారు.

నివారణ / జాగ్రత్తలు

ప్రజలందరితో పాటు ముఖ్యంగా 45 ఏళ్లు నిండినవారంతా... ● దేహానికి పీచుపదార్థాలు అందేలా మంచి ఆకుకూరలు, కాయగూరలు, తాజాపండ్లతో సమతులాహారం తీసుకోవడం, మాంసాహారంలో వేట మాంసం చాలా పరిమితంగా తీసుకుంటూ ఉండటం. (దానికి బదులు వైట్‌మీట్ అంటే చికెన్, చేపలు తీసుకోవడం మంచిది). ● క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం. ● పొగతాగడం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం. ● బరువు పరిమితికి మించి పెరగకుండా జాగ్రత్తపడటం.



డా. శరత్ కుమార్ రెడ్డి ఆవుల, సీనియర్ కోలోరెక్టల్ క్యాన్సర్ సర్జన్

మెడి టిప్

నడుము చుట్టూ నలుపు చారిక తగ్గేదెలా?

మహిళలు నాడా లేదా పురుషులు బెల్ట్ బిగుతుగా కట్టుకుంటుంటే ఆ ప్రదేశంలో నడుము చుట్టు నల్లగా మచ్చ ఏర్పడే అవకాశం ఉంటుంది. ఆ నలుపును నివారించేందుకు కొన్ని సూచనలు...


● మరీ గట్టిగా లాగి లేదా బాగా బిగుతుగా కట్టుకోవడం కాకుండా సౌకర్యవంతంగా కట్టాలి. వీలైతే నడుము సైజుకు సరిగ్గా అమరేలా ఎలాస్టిక్ నాడాలు వాడటం మంచిది. ● అదేపనిగా కూర్చోవడం లేదా నిల్చుని ఉండటం నడుము చుట్టూ నలుపు మచ్చ పడటానికి దారితీస్తుంది. కొన్ని భాగాల్లో రక్తప్రసరణ సరిగా జరగకపోవడమే ఇందుకు కారణం. అందుకే గంటకు ఒకసారైనా కనీసం 5 – 10 నిమిషాలపాటు అటూ ఇటూ నడుస్తూ ఉండాలి. ● కాళ్ల కింద తలగడ పెట్టుకోవడం, పడక కంటే కాళ్లు కాస్త పైకి ఉండేలా చూసుకోవడం వల్ల నడుము చుట్టూ ఉండే మరక తాలూకు నలుపు క్రమంగా తగ్గిపోవచ్చు. ● ఆహారంలో పీచు పదార్థాలు (ఫైబర్) ఎక్కువగా ఉండేవాటిని తీసుకోవడం వల్ల శరీరం నునుపుగా కనిపిస్తుంది.



రెండో టి20లో పాకిస్తాన్ విజయం

రావల్పిండిలో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో పాకిస్తాన్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా కివీస్ 18.1 ఓవర్లలో 90 పరుగులకే ఆలౌటైంది. చాప్‌మన్ (19)దే అత్యధిక స్కోరు. పాక్ బౌలర్లలో షాహిన్ అఫ్రిది 3 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా... మొహమ్మద్ ఆమిర్, అబ్రార్, షాదాబ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం పాక్ 12.1 ఓవర్లలో 3 వికెట్లకు 92 పరుగులు సాధించింది. మొహమ్మద్ రిజ్వాన్ (34 బంతుల్లో 45 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యంత వేగంగా (79 ఇన్నింగ్స్‌లలో) 3 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లి (81 ఇన్నింగ్స్‌లు) రికార్డును రిజ్వాన్ సవరించాడు. తాజా ఫలితంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ 1–0తో ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా... మూడో టి20 నేడు ఇదే మైదానంలో జరుగుతుంది.

ఈ సారి ఢిల్లీపై దాడి



హెడ్

- లీగ్ చరిత్రలో నాలుగో అత్యధిక స్కోరు సాధించిన హైదరాబాద్
- 67 పరుగుల తేడాతో ఢిల్లీపై గెలుపు
- చెలరేగిన హెడ్, అభిషేక్, షహబాజ్

సొంతగడ్డపై ఈ సీజన్‌లో ఆలస్యంగా ఢిల్లీ మొదటి మ్యాచ్ ఆడితే... పండగ చేసుకుంది మాత్రం హైదరాబాదే! ఓపెనర్లు హెడ్, అభిషేక్‌లతో పాటు మిడిలార్డర్‌లో షహబాజ్ సిక్సర్ల సునామీతో సన్‌రైజర్స్ ఐపీఎల్ చరిత్రలో నాలుగో టాప్ స్కోరు సాధించింది. 2013లో బెంగళూరు ఒకే ఒక్కసారి సాధించిన 263/5 రికార్డు స్కోరును హైదరాబాద్ ఈ సీజన్‌లోనే 287/3 (బెంగళూరు), 277/3(ముంబై), 266/7లతో మూడుసార్లు అధిగమించడం పెద్ద విశేషం.

న్యూఢిల్లీ: ఈ సారి సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసం తారా స్థాయికి చేరింది. దీంతో ఐపీఎల్, ఓవరాల్ టి20ల రికార్డులతో జట్టు ఖాతాలో మరో గెలుపు చేరింది. హైదరాబాద్ 67 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. ఓపెనర్లు ట్రవిస్ హెడ్ (32 బంతుల్లో 89; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (12 బంతుల్లో 46; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) సిక్సర్ల సునామీని చూపించారు. షహబాజ్ అహ్మద్ (29 బంతుల్లో 59 నాటౌట్ 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), నితీశ్ కుమార్ (27 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. కుల్దీప్ (4/55) అడ్డుకట్ట లేకపోతే మాత్రం ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 300 చేసేది! తర్వాత ఢిల్లీ 19.1 ఓవర్లలో 199 పరుగుల వద్ద ఆలౌటైంది. జేక్ ఫ్రేజర్ (18 బంతుల్లో 65; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) క్రీజులో ఉన్న ఆ కాసేపు దంచేశాడు. నటరాజన్‌కు 4 వికెట్లు దక్కాయి.

6 ఓవర్లు బాదారిలా...

పవర్ ప్లేలో ఓపెనర్లు హెడ్, అభిషేక్‌ల బ్యాటింగ్ విశ్వరూపం చూపెట్టారు. దీంతో 6 ఓవర్లలో వరుసగా 19, 21, 22, 21, 20, 22 పరుగుల వరద పారడంతో సన్‌రైజర్స్ 125/0 స్కోరు చేసింది. అప్పటికే రెండు రికార్డులు కూడా నమోదయ్యాయి. 5 ఓవర్లలో 103 స్కోరు ఓవరాల్ టి20 చరిత్రలోనే వేగవంతమైన వంద స్కోరు కాగా... ఐపీఎల్ పవర్ ప్లే (105 పరుగులు - కోల్‌కతా)లో అత్యధిక స్కోరు రికార్డునూ 125/0తో హైదరాబాద్ చెరిపేసింది. పవర్ ప్లేలో 13 ఫోర్లు, 11 సిక్సర్లు బాదడంతో 118 పరుగులు బౌండరీల రూపంలోనే వచ్చాయి. ఇక ఈ పవర్ ప్లే సగం ఓవర్ల(3)లోనే హెడ్ కేవలం 16 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

సునామీకి కుల్దీప్ అడ్డుకట్ట

ఓపెనర్ల విధ్వంస రచనతో వాయు వేగంతో దూసుకెళ్తున్న స్కోరు బోర్డుకు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అడ్డుకట్ట వేశాడు. ఏడో ఓవర్లో అభిషేక్‌ను అవుట్ చేసి 131 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని కూల్చిన కుల్దీప్... మార్క్‌రమ్ (1)నూ బోల్తా కొట్టించాడు. అక్షర్ పటేల్ బౌండరీ లేని ఎనిమిదో ఓవర్ వేసి 5 పరుగులు ఇచ్చాడు. అప్పటి దాకా ఢిల్లీకి ఊరటనిచ్చిన ఓవర్ ఇదే! మళ్లీ కుల్దీప్ 9వ ఓవర్ ఆఖరి బంతికి హెడ్ మెరుపు సెంచరీ అవకాశాన్ని అడ్డుకుని పెవిలియన్ చేర్చగా, అక్షర్ పటేల్ తర్వాతి ఓవర్ తొలిబంతికే క్లాసెన్ (15)ను బౌల్డ్ చేయడంతో ఢిల్లీ శిబిరం తేలిక పడింది. నితీశ్ కుమార్ (27 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), షహబాజ్‌ల జోడి కుదురుకొని జట్టు స్కోరును 200 మార్క్‌ను దాటించారు. అయితే 7 నుంచి 17వ ఓవర్ పూర్తయ్యేదాకా 11 ఓవర్లలో సన్‌రైజర్స్ కేవలం 96 పరుగులు చేసి 5 వికెట్లను కోల్పోయింది. డెత్ ఓవర్లలో షహబాజ్ మెరుపులతో సన్‌రైజర్స్ 250 పైచిలుకు స్కోరు చేసింది. షహబాజ్ 28 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు.

మెరిపించిన ఫ్రేజర్

కష్టమైన కొండంత లక్ష్యం ముందు ఓపెనర్లు పృథ్వీ షా (16), వార్నర్ (1) చేతులెత్తేశారు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన జేక్ ఫ్రేజర్, అభిషేక్ పోరెల్ అండతో మెరుపు వేగంతో ఢిల్లీ స్కోరును 6.4 ఓవర్లలో వందకు చేర్చాడు. కానీ రెండు బంతుల వ్యవధిలోనే అదే ఓవర్లో ఫ్రేజర్ అవుట్ కావడంతో క్యాపిటల్స్‌కు లక్ష్యఛేదన అసాధ్యమైంది. అభిషేక్ పోరెల్ (22 బంతుల్లో 42; 7 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు ధాటిని కొనసాగించాడు. అనంతరం కెప్టెన్ రిషభ్ పంత్ (35 బంతుల్లో 44; 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంలో విఫలమయ్యాడు. స్టబ్స్ (10), అక్షర్ (6) చెప్పుకోదగ్గ స్కోరు చేయలేకపోయారు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 89; అభిషేక్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 46; మార్క్‌రమ్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 1; క్లాసెన్ (బి) అక్షర్ 15; నితీశ్ (సి) వార్నర్ (బి) కుల్దీప్ 37; షహబాజ్ నాటౌట్ 59; సమద్ (సి) నోర్జే (బి) ముకేశ్ 13; కమిన్స్ రనౌట్ 1; సుందర్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 266. వికెట్ల పతనం:** 1–131, 2–133, 3–154, 4–154, 5–221, 6–250, 7–256. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3–0–51–0, లలిత్ 2–0–41–0, నోర్జే 3–0–31–0, కుల్దీప్ 4–0–55–4, ముకేశ్ 4–0–57–1, అక్షర్ 4–0–29–1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీషా (సి) సమద్ (బి) సుందర్ 16; వార్నర్ (సి) కమిన్స్ (బి) భువనేశ్వర్ 1; ఫ్రేజర్ (సి) క్లాసెన్ (బి) మార్కండే 65; పోరెల్ (స్టంప్) క్లాసెన్ (బి) మార్కండే 42; స్టబ్స్ (సి) షహబాజ్ (బి) నితీశ్ 10; పంత్ (సి) నటరాజన్ (బి) నితీశ్ 44; లలిత్ (బి) నటరాజన్ 7; అక్షర్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 6; నోర్జే (బి) నటరాజన్ 0; కుల్దీప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నటరాజన్ 0; ముకేశ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.1 ఓవర్లలో ఆలౌట్) 199. వికెట్ల పతనం:** 1–16, 2–25, 3–109, 4–135, 5–154, 6–166, 7–199, 8–199, 9–199, 10–199. **బౌలింగ్:** వాషింగ్టన్ సుందర్ 2–0–46–1, భువనేశ్వర్ 4–0–33–1, కమిన్స్ 4–0–35–0, నటరాజన్ 4–0–19–4, మార్కండే 2–0–26–2, షహబాజ్ 1–0–22–0, నితీశ్ కుమార్ 2.1–0–17–2.



అభిషేక్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X బెంగళూరు
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

పంజాబ్ X గుజరాత్
వేదిక: ముల్లన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	7	6	1	12	0.677
హైదరాబాద్	7	5	2	10	0.914
కోల్‌కతా	6	4	2	8	1.399
చెన్నై	7	4	3	8	0.529
లక్నో	7	4	3	8	0.123
ముంబై	7	3	4	6	-0.133
ఢిల్లీ	8	3	5	6	-0.477
గుజరాత్	7	3	4	6	-1.303
పంజాబ్	7	2	5	4	-0.251
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

వినేశ్ సగర్వంగా...

- ఒలింపిక్ కోటా సాధించిన భారత రెజ్లర్
- అన్షు, రితిక కూడా



బిషెక్ (కిర్గిస్తాన్): లైంగిక వేధింపుల వివాదంలో మహిళా రెజ్లర్ల తరపున పోరాటం...దేశ రాజధానిలో నిరసన ప్రదర్శనలు...సెలక్షన్స్‌నుంచి తప్పించుకునేందుకు అంటూ విమర్శలు...తీవ్ర అవమానాలు...సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్‌కు దూరం ...దాదాపు ఏడాది కాలం పాటు భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పరిస్థితి ఇది. కానీ ఇప్పుడు వాటన్నింటినీ దాటి ఆమె తమ ఆటలో తన సత్తాను చూపించింది. వరుసగా మూడో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధమైంది. ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఫైనల్ చేరడం ద్వారా వినేశ్ పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు కోటాను ఖాయం చేసింది. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో కూడా వినేశ్ పాల్గొంది. 50 కేజీల కేటగిరీలో ఆమె అర్హత సాధించింది. శనివారం జరిగిన బౌట్‌లలో వినేశ్ వరుసగా మిరాన్ చియాన్ (కొరియా), స్మానంగ్ దిట్ (కంబోడియా)లను ఓడించి సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టింది. సెమీస్‌లో కజకిస్తాన్‌కు చెందిన లౌరా గనికిచ్‌ను ఓడించడంతో ఫైనల్ చేరడంతో పాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖాయమైంది. వినేశ్‌తో పాటు మరో ఇద్దరు భారత రెజ్లర్లు కూడా బెర్త్‌లు సంపాదించారు. 2021 వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అన్షు మలిక్ (57 కేజీలు), అండర్-23 వరల్డ్ చాంపియన్ రితిక (76 కేజీలు) కూడా ఫైనల్ చేరడంతో ద్వారా పారిస్‌కు టికెట్ సాధించారు. దీంతో రెజ్లింగ్ మహిళల విభాగంలో నాలుగు కోటాలు ఖరారయ్యాయి. గత ఏడాదే భారత్‌నుంచి అంతిమ్ పంఘాల్ (57 కేజీలు) ఒక కోటాను సాధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో కూడా భారత్‌నుంచి నలుగురు బరిలోకి దిగారు. మరోవైపు పురుషుల విభాగంలో భారత్‌నుంచి ఇంకా ఒక్క ఒలింపిక్స్ కోటా కూడా ఖాయం కాలేదు.

డేవిడ్, పొలార్డ్‌లపై చర్య



ముల్లన్‌పూర్: ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించిన ముంబై ఇండియన్స్ బ్యాటర్ టిమ్ డేవిడ్, బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్‌లపై గవర్నింగ్ కౌన్సిల్ చర్య తీసుకుంది. నియమావళిలోని లెవల్ 1 తప్పు కింద వీరిద్దరి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానాను విధించారు. గురువారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో జరిగిన ఘటన వీరిపై చర్యకు కారణమైంది. సూర్యకుమార్‌కు అర్ష్‌దీప్ వేసిన బంతి బ్యాటర్‌కు దూరంగా వెళ్లింది. దీనికి అంపైర్ 'వైడ్' ఇవ్వలేదు. అయితే తర్వాతి క్షణంలో భారీ స్క్రీన్‌పై దాని రీప్లే కనిపించింది. ఇది చూసిన డేవిడ్, పొలార్డ్ వైడ్‌పై 'రివ్యూ' కోరమంటూ డగౌట్‌నుంచి సూర్యకుమార్‌కు సైగలు చేశారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం. దీనిపై పంజాబ్ కెప్టెన్ స్యామ్ కరన్ అంపైర్‌కు ఫిర్యాదు కూడా చేశాడు.

కెప్టెన్లకు జరిమానా...

శుక్రవారం చెన్నై, లక్నో మధ్య మ్యాచ్‌లో ఇరు జట్ల కెప్టెన్లు ఓవర్ రేట్‌లో వెనుకబడి శిక్షకు గురయ్యారు. నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్‌కు గవర్నింగ్ కౌన్సిల్ చెరో రూ. 12 లక్షల జరిమానా విధించింది.

'ప్రపంచకప్‌కు నేను సిద్ధం'

కోల్‌కతా: ఐపీఎల్‌లో అద్భుత ఫామ్‌తో చెలరేగిపోతున్న 39 ఏళ్ల దినేశ్ కార్తీక్ త్వరలో జరిగే టి20 ప్రపంచకప్‌లో భారత్ తరఫున మళ్లీ బరిలోకి దిగాలని ఆశిస్తున్నాడు. ఆర్‌సీబీ తరఫున కార్తీక్ 6 ఇన్నింగ్స్‌లలో 205.45 స్ట్రైక్ రేట్‌తో 226 పరుగులు చేశాడు. 'నా జీవితంలోని ఈ దశలో మళ్లీ భారత్‌కు ఆడాలని కోరుకుంటున్నా. అదే జరిగితే చాలా సంతోషిస్తాను. టి20 ప్రపంచ కప్ ఆడితే అంతకన్నా గొప్ప విషయం ఉండదు. జట్టు ఎంపిక నా చేతుల్లో లేదు. కానీ నేను వంద శాతం సిద్ధంగా ఉన్నా. ఎంపికయ్యేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తా' అని కార్తీక్ చెప్పాడు.

వెర్‌స్టాపెన్‌కు పోల్



షాంఘై: స్టార్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఫార్ములా వన్ సీజన్‌లో తన జోరును కొనసాగిస్తూనే ఉన్నాడు. చైనీస్ గ్రాండ్ ప్రి ఈవెంట్‌లో శనివారం వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) పోల్ పొజిషన్ సాధించాడు. 1 నిమిషం 33.66 సెకన్లలో క్వాలిఫయింగ్ రేస్‌ను పూర్తి చేసిన వెర్‌స్టాపెన్ అగ్ర స్థానంలో నిలిచాడు. సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఫెర్నాండో అలోన్సో (ఆస్టిన్ మార్టిన్) తర్వాతి రెండు స్థానాలు సాధించారు. ఈ సీజన్‌లో ప్రతీ పోల్ సాధించిన వెర్‌స్టాపెన్ ఓవరాల్‌గా 37వ సారి పోల్ పొజిషన్ సాధించాడు. అతని టీమ్‌కు ఇది 100వ పోల్ కావడం విశేషం.

సినిమా

భయపెట్టు... వసూళ్లు పట్టు!



రాశీ ఖన్నా
ప్రభాస్
తమన్నా
బెల్లంకొండ సాయి శ్రీనివాస్

హారర్ జానర్‌ను తెలుగు ప్రేక్షకులు బాగానే ఆదరిస్తుంటారు. ఈ మధ్యకాలంలో ఈ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన 'విరూపాక్ష', 'మసూద' వంటి చిత్రాలు సాధించిన వసూళ్లను అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రేక్షకులను ఎంత భయపెడితే అంత విజయం అన్నమాట. తాజాగా 'భయపెట్టు... వసూళ్లు పట్టు' అంటూ కొన్ని చిత్రాలు వెండితెరపైకి రావడానికి సిద్ధమవుతున్నాయి. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.

రాజా సాబ్ రెడీ

సిల్వర్ స్క్రీన్‌పై ప్రభాస్ కటౌట్‌ను చూస్తే విలన్స్ భయపడుతుంటారు. ఆడియన్స్ ఎంజాయ్ చేస్తుంటారు. మరి.. ప్రభాస్ సినిమా ఆడియన్స్‌లో భయం పుట్టిస్తే ఎలా ఉంటుందో 'రాజా సాబ్'లో చూడొచ్చట. ఎందుకంటే ఈ సినిమాలో కాస్త హారర్ బ్యాక్‌డ్రాప్ ఉంది. ప్రభాస్ టైటిల్ రోల్ చేస్తున్న 'రాజా సాబ్'కు మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇటీవల ఓ స్టూడియోలో వేసిన సెట్‌లో ప్రభాస్–నిధీపై ఓ పాట చిత్రీకరణ జరిగింది. హారర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. తాత, మనవడిగా సంజయ్ దత్, ప్రభాస్ కనిపిస్తారని, సంజయ్ దత్ పాత్ర ఆత్మ రూపంలో ఉంటుందని ఫిల్మ్‌నగర్ టాక్. అంతేకాదు.. ఈ సినిమాలో రాజా డీలక్స్ అనే ఓ థియేటర్ ఉంటుందని, ఈ థియేటర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాలు హారర్ ఎలిమెంట్స్‌తో ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇక పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'రాజా సాబ్' విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

కిష్కిందపురి?

కెరీర్‌లో ఎక్కువగా మాస్ కమర్షియల్ పంథాలో పయనించిన బెల్లకొండ సాయి శ్రీనివాస్ ఈసారి కాస్త ట్రాక్ మార్చారు. తొలిసారిగా ఓ మిస్టరీ హారర్ ఫిల్మ్ చేస్తున్నారు. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ మిస్టరీ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు 'కిష్కిందపురి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందని సమాచారం. అంతేకాదు.. ఈ సినిమా కథకు, కోతులకు ఏదో సంబంధం ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. మరి.. ఈ మిస్టరీ ఏంటో తెలుసుకోవాలంటే మాత్రం ఇంకొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు.

మల్లన్నస్వామి రక్ష

దుష్టశక్తుల నుంచి ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని ఏ విధంగా రక్షిస్తాడు? అనే ప్రధానాంశంతో రూపు దిద్దుకుంటున్న సినిమా 'ఓదెల 2'. ఇటీవల కాశీలో ఈ సినిమా చిత్రీకరణ ఆరంభమైంది. తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ సినిమాకు అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో శివశక్తి పాత్రలో కనిపిస్తారు తమన్నా. నాగసాధువు పాత్రలో తమన్నా నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మరోవైపు తమన్నా తమిళంలో 'అరణ్మనై 4' అనే హారర్ ఫిల్మ్‌లో కూడా ఓ లీడ్ రోల్‌లో నటించారు. రాశీ ఖన్నా, సుందర్. సి, 'వెన్నెల' కిశోర్, శ్రీనివాస రెడ్డి ఈ సినిమాలో ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఓ భవనంలో జరిగే హారర్ ఘటనల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. సుందర్. సి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మే 3న విడుదల కానుంది.

ఇవే కాదు... 2024లో మరికొన్ని హారర్ సినిమాలు తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

దెయ్యంతో ప్రేమ

హారర్ ఎలిమెంట్స్‌కు ఓ లవ్‌స్టోరీ తోడైతే ఎలా ఉంటుందో 'లవ్ మీ' సినిమాలో చూడొచ్చు అంటోంది ఈ చిత్రం యూనిట్. ఆశిష్, వైష్ణవీ చైతన్య లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ఇది. 'ఇఫ్ యు డేర్' అనేది ఈ చిత్రం ఉపశీర్షిక. ఈ హారర్ లవ్‌స్టోరీ థ్రిల్లర్‌కి అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. ఓ కుర్రాడు ఓ దెయ్యాన్ని ప్రేమిస్తే ఏం జరుగుతుంది? అనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుందని సమాచారం. శిరీష్ సమర్పణలో 'దిల్ రాజు ప్రొడక్షన్స్' పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కావాల్సింది. కానీ కాస్త ఆలస్యంగా రిలీజ్ చేయనున్నారట.



వైష్ణవి, ఆశిష్

టీజర్ ఆసక్తిగా ఉంది

\- చిరంజీవి



కార్తికేయ, చిరంజీవి

''డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడు... ఆ కేసును ఇన్వెస్టిగేట్ చేసిన ఆఫీసర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు' అనే డైలాగ్స్‌తో మొదలైంది 'భజే వాయు వేగం' సినిమా టీజర్. కార్తికేయ గుమ్మకొండ, ఐశ్వర్యా మీనన్ జంటగా, రాహుల్ టైసన్, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటించిన చిత్రమిది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ సినిమాకు ప్రశాంత్ రెడ్డి చంద్రపు దర్శకుడు. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన చిరంజీవి మాట్లాడుతూ– ''టైటిల్, టీజర్ ఆకట్టుకునేలా ఉన్నాయి. టీజర్ చూస్తుంటే తండ్రీ కొడుకు మధ్య మంచి ఎమోషన్స్‌తో సాగే సినిమా అనిపిస్తోంది. యాక్షన్ బాగుంది. ఈ సినిమా హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

వరలక్ష్మి ఓకే అనడం సగం సేఫ్



మహేంద్రనాథ్

వరలక్ష్మీ శరత్‌కుమార్ లీడ్ రోల్‌లో నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ– ''అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే, మరోవైపు వ్యాపారాలు ప్రారంభించి సక్సెస్ అయ్యాను. సినిమాలపై ప్యాషన్‌తో ఇండస్ట్రీకి వచ్చాను. వరలక్ష్మీగారు 'శబరి' కథను ఓకే చేసినప్పుడే మా సినిమా సగం సేఫ్ అనుకున్నాను. తల్లీ కూతుళ్ల ఎమోషన్ నేపథ్యంలో 'శబరి'ని రూపొందించాం. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో సొంతంగా రిలీజ్ చేస్తున్నాను. ప్రస్తుతం వరుణ్ సందేశ్‌తో ఒకటి, అమర్‌దీప్‌తో ఓ సినిమా నిర్మిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

పైసా వసూల్ సినిమా అవుతుంది



విశాల్

విశాల్, ప్రియాభవానీ శంకర్ జంటగా హరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రత్నం'. కార్తికేయన్ సంతానం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమాను శ్రీ సిరి సాయి సినిమాస్ పతాకంపై తెలుగులో సీహెచ్ సతీష్ కుమార్, కె. రాజ్‌కుమార్ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో విశాల్ మాట్లాడుతూ– ''నేను ఇరవైఏళ్లుగా నటుడిగా కొనసాగుతున్నానంటే దానికి కారణం ప్రేక్షకులు నాపై పెట్టుకున్న నమ్మకం. ప్రతి సినిమా ఓ ప్రయత్నమే. హరిగారితో నేను చేసిన 'భరణి', 'పూజ' సినిమాలు హిట్ సాధించాయి. ఇప్పుడు 'రత్నం' చేశాం. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా అలరిస్తుంది. ప్రేక్షకుల డబ్బుకు న్యాయం జరుగుతుంది. 'రత్నం' పైసా వసూల్ మూవీ అవుతుంది'' అని చెప్పుకొచ్చారు విశాల్. ''విశాల్‌గారంటే నాకు చాలా ఇష్టం. 'రత్నం' సినిమాలో మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి. ఓ పెద్ద తెలుగు సినిమా మాదిరిగానే సినిమాను ఇక్కడ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు సతీష్.

వాలంటీర్ కథ



రాకేశ్ రెడ్డి

సూర్య కిరణ్, దియా రాజ్ జంటగా రూపొందిన చిత్రం 'వాలంటీర్'. ప్రసీద్ దర్శకత్వంలో పి. రాకేశ్ రెడ్డి నిర్మాణ సారథ్యంలో రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్రనిర్మాత రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ– ''లక్ష్మీస్ ఎన్టీఆర్' తర్వాత నేను నిర్మిస్తున్న రెండో చిత్రమిది. ఇందులో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కీలక పాత్ర చేశారు. నేటి రాజకీయ పరిస్థితులలో వాలంటీర్ పాత్ర గురించి విశదీకరించే సినిమాగా రూపొందించాం. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి'' అన్నారు.

ప్రభాస్ టైటిల్‌తో...



ప్రియదర్శి, నభా నటేష్

ప్రియదర్శి, నభా నటేష్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రానికి 'డార్లింగ్' టైటిల్‌ను ఖరారు చేశారు. అశ్విన్ రామ్ దర్శకత్వంలో చైతన్య సమర్పణలో నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ వీడియో లాంచ్ వేడుకలో ప్రియదర్శి మాట్లాడుతూ– ''ప్రభాస్‌గారిని ప్రేమతో పిలుచుకునే టైటిల్‌ను మా సినిమాకు పెట్టడం మాకు గర్వకారణంగా ఉంది. ఈ సినిమాతో కచ్చితంగా ప్రేక్షకులని ఎంటర్‌టైన్ చేస్తాం. ఇది మా 'డార్లింగ్' యూనిట్ ప్రామిస్'' అన్నారు. ''ఓ ప్రమాదం కారణంగా నేను సినిమాలకు కొంతకాలం దూరంగా ఉన్నాను. ఇప్పుడు ఇలాంటి విభిన్నమైన సినిమా చేసినందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు నభా నటేష్. ''ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు నిరంజన్ రెడ్డి, చైతన్య. ''నిరంజన్‌గారు మా కలలను నిజం చేశారు'' అన్నారు అశ్విన్ రామ్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కొండగట్టు ప్రసాదంలో నాణ్యతేది?

భక్తుల ఫిర్యాదు



స్టీమ్ రైస్ నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో నాసిరకం బియ్యంతో ప్రసాదం తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆలయానికి సరఫరా చేసే బియ్యానికి సంబంధించిన ప్రొవిజన్స్ టెండర్‌ను ఈ ఏడాది మార్చిలో ఆలయ అధికారులు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన అక్షయ్ సంస్థ ఈ టెండర్‌ను దక్కించుకుంది. అయితే ఈ సంస్థ నాణ్యత పాటించకుండా స్టీమ్ రైస్‌ను సరఫరా చేస్తోంది. ఈ విషయాన్ని గమనించకుండానే ఆలయ అధికారులు ఆ బియ్యంతో ప్రతీరోజూ పులిహోర, దేవుళ్ల నైవేద్యం కోసం వినియోగించేస్తున్నారు. వీటిని నిత్యాన్నదానం, ఆగమ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. ప్రసాదంలో నాణ్యత లేదని గమనించిన రామన్నపేట గ్రామానికి చెందిన భక్తులు పోచమ్మల్ల ప్రవీణ్‌కుమార్ తదితరులు శనివారం ఆలయ ఈవో చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బియ్యం శాంపిళ్లను ఆలయ ఈవో సదరు టెండర్‌దారుడికి ఫోన్ చేసి క్వాలిటీ బియ్యం అందించాలని సూచించారు. ఆలయానికి పంపించిన రైస్‌బ్యాగులను గుర్తించి తిరిగి టెండర్‌దారుడికి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మోత్కుపల్లి నర్సింహులుకి అస్వస్థత



మోత్కుపల్లిని పరామర్శించిన ఆర్.కృష్ణయ్య

సనత్‌నగర్: మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు శనివారం అస్వస్థతకు గురయ్యారు. అమీర్‌పేట లీలానగర్‌లోని ఆయన నివాసంలో ఉదయం ఒక్కసారిగా మోత్కుపల్లి కిందపడిపోవడంతో ఆయన పీఏ రాజు, మరికొందరు హుటాహుటిన ఆయన్ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రక్తపోటు, మధుమేహ స్థాయిలు పడిపోవడంతోనే అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న మోత్కుపల్లి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మోత్కుపల్లి అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఆలిండియా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ బోర సుభాష్, హైకోర్టు న్యాయవాది ప్రసాద్ సగరపు, ముకుందరెడ్డి, కేపీఎల్ రావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

ఎమ్మెల్యే షకీల్ కుమారుడి బెయిల్ రద్దు చేయండి

• జూబ్లీహిల్స్ కేసుపై హైకోర్టులో పోలీసుల పిటిషన్

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసులో మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ కుమారుడు రాహిల్‌కు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పోలీసులు మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. సోమవారం నిర్ణయాన్ని తెలియజేస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. 2022 ఫిబ్రవరి 17 రాత్రి 8 గంటల ప్రాంతంలో కేబుల్ బ్రిడ్జి మీదుగా వచ్చిన థార్ వాహనం డివైడర్ దాటుతున్న వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడగా ఓ చిన్నారి మృతి చెందాడు. ప్రమాదం అనంతరం కారులోని ముగ్గురు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనకు కారణమైన థార్ వాహనంపై అప్పటి బోధన్ ఎమ్మెల్యే షకీల్ పేరుతో ఎమ్మెల్యే స్టిక్కర్ ఉండటం చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తు జరిగే సమయంలోనే కారు నడిపింది తానేనంటూ ఆఫ్రాన్ అనే యువకుడు పోలీసుల ముందు లొంగిపోయాడు. ప్రమాదంపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రగతి భవన్ వద్ద డిసెంబర్‌లో బారికేడ్లను ఢీకొట్టిన కేసులో ఈ నెల రాహిల్‌ను అరెస్టు చేసిన సందర్భంగా జూబ్లీహిల్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. అప్పట్లోనూ కారు నడిపింది రాహిల్ అని, ప్రమాదం జరగ్గానే అక్కడి నుంచి పరారై తన స్థానంలో ఆఫ్రాన్‌ను ఉంచినట్లు పోలీసులు అనుమానించారు. బాధితుల నుంచి మరోమారు వాంగ్మూలాన్ని తీసుకుని వాహనం నడిపింది రాహిల్ అని పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ కేసులో తనపై పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ రాహిల్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం జూబ్లీహిల్స్ కేసులో రాహిల్‌ను అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించింది. ఈ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. బెయిల్ అంశంపై సోమవారం మధ్యంతర ఉత్తర్వులు వెలువడనున్నాయి.

సమాజ సేవకు మానవత్వమే పునాది

• హైకోర్టు జడ్జి జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్



బాలగోకులం వార్షికోత్సవంలో జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్

కరీంనగర్‌క్రైం: మానవత్వం పునాదిగా ఉంటేనే సమాజసేవ సాధ్యమవుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ అన్నారు. శనివారం ఆయన కరీంనగర్‌లోని వెంకట్ ఫౌండేషన్ బాలగోకులం 10వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు లేని అనాథలకు ఈ సమాజమే కుటుంబమని పేర్కొన్నారు. బాల గోకులంలోని పిల్లలు భవిష్యత్‌లో మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. బాల గోకులం పదేళ్లలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకుని ముందుకు సాగిందని చెప్పారు. బాల గోకులం సేవలను గుర్తించిన జస్టిస్ వేణుగోపాల్ సోదరుడి కూతురు బాలజ్యోతి రూ.1.16 లక్షలు విరాళంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేశ్, వెంకట్ ఫౌండేషన్ చైర్మన్ గంప వెంకట్, ఉపాధ్యక్షుడు నటరాజ్ రవి, కార్యదర్శి సతీశ్, మెంటర్ రామ్మోహన్, అవాజ్ ఫౌండేషన్ చైర్మన్ ఏవీ రమణ, శ్రీకరం ఫౌండేషన్ చైర్మన్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లేత జొన్న మేసి 21 గొర్రెలు మృతి

• మరో 80 జీవాలకు తీవ్ర అస్వస్థత
• పరిశీలించిన జిల్లా పశువైద్యాధికారి

దోమ (వికారాబాద్ జిల్లా): లేత దశలోని పశుగ్రాసాన్ని (మేత జొన్న) మేసిన 21 గొర్రెలు మృతి చెందగా...మరో 80 తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కొత్తపల్లిలో చోటుచేసుకుంది. దోమ గ్రామానికి చెందిన బట్టల శీనయ్య గొర్రెలను పోషించుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మేతకు తీసుకెళ్లి శుక్రవారం రాత్రి షెడ్డుకు తీసుకొస్తుండగా దారిలో లేత దశలో ఉన్న మేత జొన్నను తిన్నాయి. దీంతో వాటికి నాము (హైడ్రోజన్‌సినైడ్)తో 18 గొర్రెలు, మూడు పొట్టేళ్లు మృత్యువాత పడ్డాయి. మరో 80 జీవాలు అస్వస్థతకు గురయ్యాయి. గమనించిన రైతులు వెంటనే పశువైద్యాధికారికి సమాచారమిచ్చారు. వెంటనే ఆయన తన సిబ్బందితో అక్కడకు చేరుకుని అత్యవసర చికిత్సలు అందించి మిగతా వాటిని రక్షించారు. మృత్యువాత పడిన జీవాల విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యారు.



కొత్తపల్లిలో మృత్యువాత పడిన గొర్రెలను పరిశీలిస్తున్న వైద్యులు

మొలక దశలో మేత ప్రమాదం

"మొలక దశ మేతతో తీవ్ర ప్రమాదం ఉంటుంది. అటువంటి పశుగ్రాసానికి జీవాలను దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. రైతుకు జరిగిన నష్టాన్ని అంచనా వేశాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపించి సాయం అందేలా చర్యలు తీసుకుంటాం.

- అనిల్, జిల్లా పశువైద్యాధికారి

జోస్ అలుక్కాస్‌లో చైన్, బ్యాంగిల్ మేళా

తరుగు చార్జీలపై 50 శాతం తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: జోస్ అలుక్కాస్ చైన్, బ్యాంగిల్ మేళాను ప్రారంభించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. విస్తృత శ్రేణి డిజైన్లలో విశిష్టమైన ఆభరణాల కలెక్షన్లను అందిస్తున్నట్లు పేర్కొంది. అలాగే అన్ని జోస్ అలుక్కాస్ షోరూమ్‌లలో బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 50 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. వజ్రాభరణాలపై కూడా 20 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపింది. చైన్, బ్యాంగిల్ మేళాతో పాటు జోస్ అలుక్కాస్ ప్రత్యేకమైన ఎక్స్ఛేంజ్ ఫెయిర్‌ను కూడా కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. 'వినియోగదారులు తమ పాత బంగారాన్ని కొత్త హెచ్‌యూఐడీ బంగారు ఆభరణాలకు మార్పిడి చేసుకోవచ్చు. ధరలో, బరువులో ఎలాంటి నష్టం లేకుండా కొత్త డిజైన్ల కోసం 22 క్యారెట్ల బంగారు ఆభరణాలను మార్చుకోవచ్చు' అని వివరించింది. చైన్, గాజుల ఉత్సవం ఈనెల 28 వరకు కొనసాగుతుందని పేర్కొంది.

ముగ్గురు వంట సిబ్బందిపై వేటు

• నర్సాపూర్ కేజీబీవీ ఘటనపై సమగ్ర శిక్ష ఎస్పీడీ సీరియస్
• స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ... జెండర్ కోఆర్డినేటర్ పేరెంట్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ

సాక్షి, హైదరాబాద్: నిర్మల్ జిల్లా నర్సాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 22 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకున్న సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య పలువురిపై చర్యలు తీసుకున్నారు. పరిశుభ్రమైన ఆహారాన్ని పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు వంట సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. కేజీబీవీ పర్యవేక్షణలో విఫలమైన స్పెషల్ ఆఫీసర్(ఎస్‌ఓ)కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అదేవిధంగా కేజీబీవీల పర్యవేక్షణ, పరిశీలనలో కీలకంగా వ్యవహరించాల్సిన జెండర్ కోఆర్డినేటర్‌ను ఇక్కడ విధుల నుంచి తప్పిస్తూ మాతృసంస్థ (పేరెంట్ డిపార్ట్‌మెంట్)కు సాగనంపారు. ఈ నెల 19వ తేదీన కేజీబీవీలో 22 మంది విద్యార్థినులకు ఆహారం వికటించి అనారోగ్యం పాలయ్యారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం కుదుటపడగా.. వారిని శనివారం సాయంత్రం డిస్చార్జ్ చేశారు. నిర్మల్ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీడీ కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

అమరుల కుటుంబాలను ఆదుకుంటున్నాం

• మంత్రి సీతక్క వెల్లడి
• ఇంద్రవెల్లి అమరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి వేదికగా 1981లో జరిగిన పోరాటంలో పోలీసుల కాల్పుల్లో అమరులైన కుటుంబాలను ఆదుకుంటున్నామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మండల కేంద్రంలోని స్తూపం వద్ద శనివారం నివాళుర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు 1981లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదివాసీలపై కాల్పులు జరిపిందని విమర్శలు చేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సాక్షిగా నిర్వహించిన బహిరంగ సభలో క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు. అలాగే ఇచ్చిన మాటకు కట్టుబడి ఆదివాసీ అమరవీరుల 15 కుటుంబాలను గుర్తించి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మంజూరు చేసిన కోటి రూపాయలతో త్వరలోనే స్మృతి వనం అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని సీతక్క చెప్పారు. ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ ఆదివాసీల పోరాటాలను ఏ ప్రభుత్వం గుర్తించలేదన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల రూపకల్పనకు ఓఈఆర్ కొత్త పాలసీ

• ముగిసిన జాతీయ ఓపెన్ వర్సిటీల వీసీల సదస్సు



సమావేశానికి హాజరైన సార్వత్రిక విశ్వ విద్యాలయాల ఉప కులపతులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఆసియా ఆధ్వర్యంలో 'ఓపెన్ ఎడ్యుకేషనల్ రీసోర్సెస్ (ఓఈఆర్)' ఫెస్ట్‌లో భాగంగా దేశంలోని సార్వత్రిక విశ్వవిద్యాలయాల వీసీల రౌండ్‌టేబుల్ సమావేశం ముగిసింది. మూడ్రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని అన్ని వర్సిటీల వీసీలు పాల్గొని విద్యార్థులకు ఉపయోగపడేలా నాణ్యమైన పాఠ్యాంశాల రూపకల్పనకు ఓఈఆర్ సరికొత్త పాలసీ విధానం, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020, విద్యార్థికి సులువుగా అర్థం అయ్యేలా పాఠ్యాంశాలు, ఆకర్షణీయమైన బోధన, నిరంతర మూల్యాంకనంతో పాటు విద్యార్థికి ఆయా విద్యా సంస్థలు జవాబుదారీగా ఉండేలా విధానాలు రూపొందించి అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న స్థూల జాతీయ సగటు కంటే తెలంగాణలో ఎక్కువగా నమోదైందని, దీనికి బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కారణమన్నారు. ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) వీసీ ప్రొఫెసర్ నాగేశ్వర్, సీఈఎంసీఏ డైరెక్టర్ శాద్రచ్, సార్వత్రిక విశ్వ విద్యాలయాల వీసీలు అమీ ఉపాధ్యాయ, కర్మన్‌జీత్‌సింగ్, సాహు, శరనప్ప, ఆర్‌పీదాస్, సంజయ్‌తివారీ, ఏకేదాస్ మహాపాత్ర, బన్స్‌గోపాల్‌సింగ్, జగతిరాజ్, అరుముగం, ఓంప్రకాశ్‌సింగ్ నేగి, సంజీవ్ సోనావని, దేవికా మడాలి, అంబేడ్కర్ వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ పుష్పచక్రపాణి, సీఓఈఎల్ డైరెక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లులు చెల్లించకపోతే ప్రాణత్యాగానికీ సిద్ధం

• బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



పోతంగల్‌లో మాట్లాడుతున్న పోచారం

రుద్రూర్: కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం బిల్లులు ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకుంటే ప్రాణత్యాగం చేయడానికీ వెనుకాడబోనని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పోతంగల్, కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లో శనివారం జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి పోచారం రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లోపు బిల్లులు ఇవ్వకపోతే ఓటింగ్ తర్వాత లబ్ధిదారులతో కలిసి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు.

శిథిలాల్లో చిక్కుకున్నా.. శ్వాసను 'పట్టి' గుర్తిస్తారు

ఫైర్ శాఖ అమ్ములపొదిలో విక్టిమ్ లొకేషన్ కెమెరా

శిథిలాల కింద ఉన్నా.. బాధితుడితో మాట్లాడే పరిజ్ఞానం

బోర్‌బావిలో వందమీటర్ల లోతు వరకు జాడ తెలుసుకోవచ్చు

రెస్క్యూ ఆపరేషన్లలో వినియోగిస్తున్న తెలంగాణ అగ్నిమాపక శాఖ



సాక్షి, హైదరాబాద్: ఓ బహుళ అంతస్తుల భవనం కుప్పకూలి ఆ శిథిలాల కింద చిక్కుకున్న క్షతగాత్రులను కాపాడడం ఎంతో చాలెంజింగ్ టాస్క్. రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనే సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉంటూ బాధితుడిని సురక్షితంగా బయటికి తీయాలి. ఇలాంటి సందర్భాల్లో వినియోగించేందుకు ఇప్పుడు తెలంగాణ అగ్నిమాపకశాఖ అమ్ములపొదిలో తిరుగులేని అస్త్రం 'విక్టిమ్ లొకేషన్ కెమెరా' వచ్చి చేరింది. ఈ పరికరాన్ని ఉపయోగించి భవన శిథిలాల కింద బాధితులను గుర్తించడమే కాకుండా వారు ప్రాణాలతో ఉన్నారో లేదో వారి శ్వాసను సైతం విని తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం దీనిలో ఉంది. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్న సమయంలో ఈ కెమెరాను శిథిలాల కిందకు పంపి వారి కదలికలకు సంబంధించిన శబ్దాలను వినడంతోపాటు వారిలో భరోసా నింపేలా అగ్నిమాపక సిబ్బంది చెప్పే మాటలు బాధితులు వినే వీలుంది. అంతే కాకుండా శిథిలాల మందాన్ని అంచనా వేసే వీలుంది. దీని ఆధారంగా రెస్క్యూ కోసం కట్టర్, డ్రిల్లింగ్ వంటి ఏ పరికరాన్ని వాడితే బాధితుడికి గాయం కాకుండా సురక్షితంగా బయటికి తేవచ్చన్న అంచనా దొరుకుతుందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

నీటి లోతుల్లోకి కూడా..

బోరు బావిలో పడిపోయిన చిన్నారులను సైతం గుర్తించడంతోపాటు ఇందులోని కెమెరాను వంద మీటర్ల లోతు వరకు వైర్ ద్వారా పంపి సదరు చిన్నారిని వీడియో ద్వారా అత్యంత స్పష్టంగా చూసే వీలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. చీకటిలోనూ చూసేలా ఇందులో నైట్‌మోడ్ ఆప్షన్ ఉన్నట్టు వారు పేర్కొన్నారు. చిన్నారి ఎంత లోతుకు జారిందన్న అంచనాతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టే వీలుంది. ఈ పరికరం లోని వాటర్ ప్రూఫ్ కెమెరాను నీటి లోతుల్లోకి పంపి అక్కడి దృశ్యాలు కూడా స్పష్టంగా చూసే వీలుంది. ఎవరైనా బాధితులు నీటమునిగిన సందర్భాల్లో రెస్క్యూ ఆపరేషన్‌లో దీన్ని వినియోగించుకునే వీలుందని అగ్నిమాపక శాఖ అధికారులు వివరించారు.

ఆ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించింది

సికింద్రాబాద్‌లో సిటీలైట్ హోటల్ భవనం కుప్పకూలినప్పుడు రెస్క్యూ ఆపరేషన్‌లో ఈ విక్టిమ్ లొకేషన్ కెమెరాను వినియోగించినట్టు అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. అలాగే షేక్‌పేట్‌లో ఒక పక్కకు ఒరిగిన భవనం పడిపోయే ప్రమాదాన్ని ఈ పరికరం శబ్దాల ద్వారా ముందుగానే గుర్తించినట్టు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. వివిధ రకాల ప్రమాద సమయాల్లో రెస్క్యూ ఆపరేషన్‌లో వినియోగించే కీలక పరికరాల్లో ఇది ఒకటని పేర్కొన్నారు.



వాసుకి.. అతిపెద్ద సర్పం!

ప్రపంచంలోనే అతిపెద్ద సర్పం.. మన వాసుకి!

గుజరాత్‌లోని ఓ గనిలో శిలాజాలను గుర్తించిన శాస్త్రవేత్తలు

ఏకంగా 50 అడుగుల పొడవు.. టన్నుకుపైగా బరువు..

4.7 కోట్ల ఏళ్ల కింద జీవించినట్టుగా అంచనా

భూమ్మీద అతిపెద్ద సర్పం ఏదంటే.. ఏం చెప్తారు?.. సింపుల్‌గా అనకొండ అంటారు కదా. కానీ వాటికన్నా అతి పెద్ద సర్పం మన దేశంలో తిరుగాడిందని శాస్త్రవేత్తలు తేల్చారు. గుజరాత్‌లోని ఓ గనిలో దానికి సంబంధించిన శిలాజాలను గుర్తించారు. 50 అడుగులకుపైగా పొడవుతో, ఏకంగా టన్నుకుపైగా బరువుతో ఉంటుందని అంచనా వేసిన ఈ సర్పానికి 'వాసుకి' అని పేరు పెట్టారు. హిందూ పురాణాల ప్రకారం దేవదేవుడైన శివుడి మెడలో ఉండే సర్పమే వాసుకి.

సాక్షి సెంట్రల్ డెస్క్

మొసలి కావొచ్చనుకుని..



శిలాజం దొరికిన ప్రదేశం

2005లో గుజరాత్‌లోని ఓ బొగ్గు గనిలో తవ్వకాలు జరుపుతుండగా కొన్ని శిలాజాలను గుర్తించారు. వాటిని సేకరించిన శాస్త్రవేత్తలు పురాతన కాలం నాటి భారీ మొసలి వంటి జీవి వెన్నుపూసలు కావొచ్చని ప్రాథమికంగా భావించారు. తర్వాత ఈ విషయం మరుగున పడింది. తిరిగి కొన్నేళ్ల క్రితం వీటిపై రూర్కీ ఐఐటీ శాస్త్రవేత్తలు పరిశోధన చేపట్టారు. గనిలో లభించిన మొత్తం 27 వెన్నుపూసలను క్రమ పద్ధతిలో చేర్చారు. వాటిలో కొన్ని ఒకదానికొకటి అనుసంధానమై ఉండటాన్ని గమనించారు. వివిధ జీవుల వెన్నుపూసలతో ఈ శిలాజ ఎముకలను పోల్చి చూశారు.

అతిపెద్ద పాముగా తేల్చి..

ఈ వెన్నుపూసల శిలాజాలు ఓ భారీ సర్పానికి సంబంధించినవి కావొచ్చని గత ఏడాదే ఓ అంచనాకు వచ్చారు. పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి.. భారీ సర్పమేనని నిర్ధారించారు. ఆ వెన్నుపూసల సైజు, స్థితిగతులు, దొరికిన ప్రాంతం, ఇతర ఆధారాలను బట్టి.. సర్పం పరిమాణం, అది జీవించిన తీరు, దాని ఆహారమేమిటన్న అంచనాలు వేశారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద సర్పమని తేల్చారు. దానికి శివుడి మెడలో ఉండే సర్పం పేరిట 'వాసుకి ఇండికస్' అని పేరు పెట్టారు.

4.7 కోట్ల ఏళ్ల కింద..

వాసుకి 50 అడుగులు (15 మీటర్లు) పొడవుతో.. టన్నుకుపైగా బరువుతో ఉంటుందని అంచనా వేశారు. సుమారు 4.7 కోట్ల ఏళ్ల కింద ఈ సర్పం జీవించిందని తేల్చారు. దీని భారీతనం కారణంగా మెల్లగా కదిలేదని, దానికి చిక్కిన జంతువులను గట్టిగా చుట్టేసి తినేసేదని గుర్తించారు. ప్రస్తుతం భూమ్మీద జీవించి ఉన్న వాటిలో అనకొండలు, పైథాన్‌లు అతి పెద్దవి. అంతరించిపోయిన వాటిలో కొలంబియాలో గుర్తించిన టిటనోబోవా అతి పెద్దది. దాని ఎముకల శిలాజాలను బట్టి.. 42.7 అడుగుల (13 మీటర్లు) పొడవుతో, 1,100 కిలోలకు పైగా బరువుతో ఉండి ఉంటుందని అంచనా వేశారు. చేపలు, తాబేళ్లు, మొసళ్లు, వేల్స్‌ను తినేదని అంచనా వేశారు.

నాటి పరిస్థితులతోనే భారీ ఆకారం

''ఆ కాలం నాటి వాతావరణం, అందుబాటులో ఉన్న ఆహారం, శత్రు జీవులు లేకపోవడం, నాటి వేడి వాతావరణం వల్ల వాసుకి సర్పం ఇంత భారీగా ఎదిగి ఉంటుందని భావిస్తున్నాం. ఇది అనకొండ తరహాలోనే నీటిలో కంటే నేల మీదే జీవించి ఉండటానికి అవకాశం ఎక్కువ. భారీగా ఉండటం వల్ల చెట్లపైకి ఎక్కగలిగి ఉండేది కాదు. ఇది కచ్చితంగా టిటనోబోవా కంటే పెద్దది. భూమ్మీద జీవించిన సర్పాలన్నింటికంటే పెద్దదని చెప్పవచ్చు'' అని పరిశోధనకు నేతృత్వం వహించిన రూర్కీ ఐఐటీ శాస్త్రవేత్తలు దేవజిత్ దత్తా, సునీల్ వాజ్‌పాయ్ తెలిపారు.

17 మందిని.. పట్టుకొని కాల్చి చంపారు

ఎదురుకాల్పుల్లో చనిపోయింది 12 మందే... ● ప్రజాకోర్టులో ఛత్తీస్‌గఢ్ బీజేపీ నేతలకు శిక్ష తప్పదు

కాంకేర్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ స్పందన

నార్త్ సబ్ డివిజన్ బ్యూరో ప్రతినిధి మంగలి పేరుతో లేఖ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన అతి పెద్ద ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ స్పందించింది. ఈ ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు చనిపోగా, సజీవంగా దొరికిన 17 మందిని భద్రతా దళాలు హత్య చేశాయని ఆరోపిస్తూ పార్టీ శనివారం లేఖ విడుదల చేసింది.

ఎదురుకాల్పులు ఇలా..

మావోయిస్టు పార్టీ నార్త్ సబ్ జోనల్ బ్యూరో ప్రతినిధి మంగలి తెలిపిన వివరాల ప్రకారం.. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సహచరులతో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) సభ్యులు కాంకేర్ జిల్లాలోని ఆపటోలా, కల్పర్ అటవీ ప్రాంతంలో సమావేశమయ్యారు. ఈ విషయం ఇన్ ఫార్మర్ల ద్వారా తెలుసుకున్న బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్ దళాలు ఈనెల 16న మంగళవారం మధ్యాహ్నం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. దీంతో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది గెరిల్లా ఆర్మీ సభ్యులు చనిపోయారు. గాయపడిన ఆరుగురితో పాటు నిరాయుధులైన 11 మంది సహచరులు భద్రతా దళాలకు చిక్కగా, మిగిలిన వారు తప్పించుకున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చల తర్వాతే హత్యలు..

ఘటనాస్థలిలో గాయాలతో పట్టుబడిన ఆరుగురిని తూటాలకు బలి చేశారని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఆ తర్వాత అదుపులోకి తీసుకున్న 11మందిని సుమారు రెండు కి.మీ. దూరంలో ఉన్న అమరవీరుల స్మారక చిహ్నాల వద్దకు తీసుకెళ్లారని మావోయిస్టు పార్టీ లేఖలో పేర్కొంది. వీరిని తమ వెంట తీసుకెళ్లాలా, లేక చంపేయాలా అనే అంశంపై పోలీసు బలగాల్లో చర్చ జరిగినట్టు పేర్కొంది. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్, డిప్యూటీ సీఎం విజయ్‌శర్మతో ఘటనాస్థలి నుంచి భద్రతా దళాల ప్రతినిధులు చర్చలు జరిపినట్టు ఆరోపించింది. పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు పట్టుబడిన 11మందిని కర్రలతో కొట్టి హింసించి, చివరకు తుపాకులతో కాల్చి చంపారని వెల్లడించింది. వీరి మృతదేహాలను వాహనాల్లో తీసుకెళ్తుండగా రోడ్డుపై పెద్దఎత్తున రక్తస్రావం జరగడమే తమ ఆరోపణలకు సాక్ష్యమని పార్టీ తెలిపింది.



ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

ఈ మారణకాండకు బస్తర్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బీజేపీ నేతలు బాధ్యులని పేర్కొంది. వీరికి ప్రజాకోర్టులో కచ్చితంగా శిక్ష పడుతుందని హెచ్చరించింది. మారణకాండకు నిరసనగా ఈనెల 25న నారాయణ్‌పూర్, కాంకేర్, మోహ్లామాన్‌పూర్ జిల్లాల్లో బంద్‌కు పిలుపునిచ్చింది.

ఇంట్లో సౌకర్యం కాదు.. భద్రత ముఖ్యం

డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డీజీ వై.నాగిరెడ్డి

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



రాయదుర్గం/ సాక్షి, హైదరాబాద్: ఇళ్లను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించుకోవడం కాదని, వాటికి భద్రత చాలా ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ డీజీ వై.నాగిరెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ ఆధునీకరణలో భాగంగా రానున్న రెండు నెలల్లో మరికొన్ని అధునాతన ఫైర్ ఇంజన్లు, బోట్లు, ఇతర సామగ్రి అందుబాటులోకి రానున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా 39 ఫైర్ ఇంజన్లు, మరో 18 మినీ ఫైర్ ఇంజన్లు, వర్షాకాలం వరకు 20 బోట్లను సమకూర్చుకోనున్నట్టు వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలో అగ్నిమాపక శాఖ వారోత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ, నేషనల్ బిల్డింగ్ కోడ్ సూచించిన నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రతి బహుళ అంతస్తుల భవనంలో ప్రజల భద్రతకు సంబంధించి ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 50 వేలకు పైగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ నివాసంలో స్వీయ అగ్ని ప్రమాద నివారణ చర్యలను చేపట్టి వాటిని పర్యవేక్షించుకోవాలన్నారు. సమావేశం అనంతరం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వాహనాలు, యంత్రాలు, పరికరాలతో కూడిన ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, డైరెక్టర్ జీవీ నారాయణరావు, ఆర్‌ఎఫ్‌ఓ హరినాథ్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, రంగారెడ్డి డీఎఫ్‌ఓ శ్రీధర్‌రెడ్డి, అడిషనల్ డీఎఫ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



శనివారం తిరుమల శ్రీవారిని త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్నాథ్ గౌడ్ దర్శించుకున్నారు

ఐఐఎంలో సీటు సాధించిన అంధ విద్యార్థి



ఆకాశ్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

మందమర్రి రూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన అంధ విద్యార్థి బద్దం ఆకాశ్‌రెడ్డి కామన్ అడ్మిషన్‌టెస్ట్ (క్యాట్)లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కళాశాలలో సీటు సాధించాడు. బద్దం మల్లారెడ్డి, శ్యామల దంపతుల కుమారుడు ఆకాశ్‌రెడ్డికి ఐదారేళ్ల వయస్సులో చూపు మందగించి పూర్తిగా అంధుడయ్యాడు. ఆకాశ్‌రెడ్డి హైదరాబాద్ బేగంపేట్‌లోని అంధుల పాఠశాలలో పది వరకు చదువుకున్నాడు. డిగ్రీ చెన్నయ్‌లోని సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదివి 87 పర్సంటేజ్ మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ఏడాదిపాటు మొకెట్ (ఎంఓసీకేఈటీ) ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకున్నాడు. గత సంవత్సరం అక్టోబర్‌లో కామన్ అడ్మిషన్ టెస్ట్ (సీఏటీ)లో ఇండియా లెవల్లో 81 శాతం సాధించాడు. మొత్తం 21 ఐఐఎంలకు పరీక్షలు రాయగా మొదటిసారి అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో ఎంబీఏ సీటు రావడం చాలా సంతోషంగా ఉందని ఆకాశ్‌రెడ్డి తెలిపాడు. తనతోపాటు శరత్ (ఆలేరు), రాహుల్ (వికారాబాద్), ప్రవీణ్ (జనగాం), శివాణి (జహీరాబాద్) అనే అంధ విద్యార్థులు కూడా పరీక్షలు రాశారని తెలిపాడు. మంచి సంస్థలో మేనేజర్‌గా చేయాలన్నది తన ఆశయమని ఆకాశ్‌రెడ్డి తెలిపాడు.

'ఘీ' టిన్ను అంటే రూ.కోటి

- ఎమ్మెల్సీ కవితతో జరిపిన చాట్‌ను బయటపెట్టిన సుఖేశ్ చంద్రశేఖర్
- లిక్కర్ పాలసీలో జోక్యం చేసుకోవాలంటూ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో జోక్యం చేసుకోవాలంటూ మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన సుఖేశ్ చంద్రశేఖర్ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌తో కలిపి తనను విచారించాలని కోరారు. వారితో జరిపిన వాట్సప్ చాట్ వివరాలను ఫిర్యాదులో పొందుపరిచారు. కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేసిన 14పేజీల లేఖను ఆయన తరఫు లాయరు శనివారం బయటపెట్టారు. తమ మధ్య ఆర్థిక పరమైన లావాదేవీలపై కోడ్ భాషలో చాట్ జరిగినట్లు సుఖేశ్ చంద్ర తెలిపారు.

15 కేజీల 'ఘీ' టిన్నులను బీఆర్‌ఎస్ ఆఫీసు నుంచే సేకరించాం

ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, సత్యేంద్రజైన్‌తో తాను వాట్సాప్ ద్వారా సంభాషించినట్లు హోం శాఖకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కవితక్క 'ఘీ' (నెయ్యి)టిన్నులను సిద్ధం చేసిన విషయాన్ని వాట్సప్ చాట్ ద్వారా తెలిపారంటూ ఫిర్యాదులో తెలిపారు. 'ఘీ' టిన్ను అంటే.. రూ.1కోటి అని వివరించారు. ఇలా పదిహేను కేజీల 'ఘీ' టిన్నులను(సుఖేశ్ చెప్పిన విధంగా రూ.15కోట్లు) ఆమె సిద్ధపరచి తనకు తెలపడంతో.. తన మనుషులు హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి సేకరించినట్లు వివరించారు. ఆ సేకరించిన నగదును ఢిల్లీ, గోవాలకు తరలించినట్లు ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌ది ముఖ్య పాత్ర అని ఆరోపించారు. తాను విచారణకు ఎప్పుడు పిలిచినా వస్తానని, మరిన్ని విషయాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని, కేంద్ర హోంశాఖ ఈ లిక్కర్ కేసులో జోక్యం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ – 1872 ప్రకారం సర్టిఫికెట్ అండర్ సెక్షన్ 65–బీ కింద తాను రిలీజ్ చేసిన వాట్సాప్ చాట్లను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర హోం శాఖను విజ్ఞప్తి చేశారు.

47 మంది జిల్లా జడ్జీల బదిలీ


సాక్షి, హైదరాబాద్: 47 మంది జిల్లా, సెషన్స్ జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (విజిలెన్స్) ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, రిజిస్ట్రార్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నందికొండ నర్సింగ్‌రావు, రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) వీ.బాల భాస్కర్‌రావు, సీబీఐ కోర్టు జడ్జి రమేశ్‌బాబుతోపాటు ట్రిబ్యునళ్లు, సీబీఐ కోర్టు, జిల్లా కోర్టు జడ్జీలు ఉన్నారు. వీరంతా తమ బాధ్యతలను ఆదేశాలు వెలువరించిన అధికారులకు అప్పగించి.. మే 1వ తేదీలోగా కొత్త పోస్టుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే తీర్పు రిజర్వు చేసిన కేసుల్లో ఈ లోగా తీర్పులు వెలువరించాలని సూచించారు.

మహావీరుని బోధనలు ఆచరణీయం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆధునిక సమాజంలో క్రమశిక్షణతో కూడిన జీవనానికి వర్ధమాన మహావీరుని బోధనలు ఎంతో దోహదపడతాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శాంతియుత పోరాటపథంలో వర్ధమాన మహావీరుని ఆధ్యాత్మిక బోధనలు ఆచరణీయమని పేర్కొన్నారు. ఆదివారం జైనుల ఆరాధ్య దైవం వర్ధమాన మహావీరుని జయంతిని పురస్కరించుకొని ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

టుడేస్ గ్రాఫిక్



– ఆధారం: ఏఐ ఇండెక్స్ 2023 వార్షిక నివేదిక

ఏడాదిలో 26,833 మొబైల్ ఫోన్ల గుర్తింపు

- రోజుకు సరాసరిన 73 మొబైల్ ఫోన్ల జాడ గుర్తింపు
- సెల్‌ఫోన్ల గుర్తింపులో దేశంలోనే రెండోస్థానంలో నిలిచిన తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: పోగొట్టుకున్న, చోరీకి గురైనా మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను వినియోగించి ఏడాది కాలంలో 26,833 మొబైల్ ఫోన్లను గుర్తించినట్లు సీఐడీ అదనపు డీజీ శిఖాగోయెల్ తెలిపారు. రోజుకు సగటున 73 మొబైల్ ఫోన్లను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. టెలీకమ్యూనికేషన్స్ విభాగం రూపొందించిన సీఈఐఆర్ పోర్టల్‌ను తెలంగాణలో ఏప్రిల్ 19, 2023న వినియోగంలోకి తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని 780 పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీఈఐఆర్ పోర్టల్‌తో మొబైల్‌ఫోన్ల జాడ కనిపెట్టేందు పోలీసులు చర్యలు తీసుకున్నారు. సెల్‌ఫోన్ల గుర్తింపులో జాతీయస్థాయిలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గత 11 రోజుల్లోనే వెయ్యి మొబైల్ ఫోన్లను గుర్తించామని వెల్లడించారు. వీటిలో అత్యధికంగా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 4,348 మొబైల్ ఫోన్లు, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2,772 మొబైల్ ఫోన్లు, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2,767 మొబైల్ ఫోన్లు గుర్తించినట్లు వివరించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నా..చోరీకి గురైనా ప్రజలు టీఎస్ పోలీస్ సిటిజన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

కూలీలకు బదులు యంత్రాలు

రైల్వే ట్రాక్ పనుల్లో యాంత్రీకరణ



ఆధునికతను సంతరించుకున్న దక్షిణ మధ్య రైల్వే.. గతేడాది కాలంలో 649 కి.మీ. మేర ట్రాక్ రెన్యువల్స్

యంత్రాల వాడకంతో రికార్డు స్థాయి వేగంతో పనులు

సాక్షి, హైదరాబాద్: వందల మంది కూలీలు.. కిలోమీటరు పనికి వారం రోజుల సమయం.. గతంలో రైల్వే ట్రాక్ పనుల తీరిది. కానీ, ఇప్పుడు రైల్వే ఆధునికతను అందిపుచ్చుకుంది. కూలీలతో పనులు చేయించే అవసరం లేకుండా యంత్రాలను సమకూర్చుకుంది. ఫలితంగా తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే వెసులుబాటు కలిగింది.

- రైల్వేలో ట్రాక్ నిర్వహణ అత్యంత కీలకం. రెయిల్స్(పట్టాలు)ను నిర్దిష్ట సమయానికి కచ్చితంగా మార్చాలి. లేకుంటే పట్టాలు విరిగి రైళ్లు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. అలాగే పట్టాల మధ్య ఉండే స్లీపర్లు, పాయింట్లు, క్రాసింగులను మార్చటం కీలకం. కానీ మనుషులతో పనుల నిర్వహణ తీవ్ర జాప్యంతో కూడుకున్న వ్యవహారం. ఇంతకాలం ఆ పనులు సకాలంలో జరిగేవి కాదు. ఇప్పుడు అన్ని పనులకూ యంత్రాలను సమకూర్చుకోవటంతో వాటి మార్పు వేగంగా జరుగుతోంది. గత సంవత్సర కాలంలో 649 కి.మీ.ల మేర ట్రాక్ రెన్యువల్స్ పనులు జరిగాయి. అంటే, అంత నిడివిలో పట్టాలు, స్లీపర్లు, పాయింట్లు, క్రాసింగ్స్‌ను మార్చారు. ఒకే ఏడాదిలో ఇన్ని కిలోమీటర్ల మేర రెన్యువల్స్ జరగటం దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే మొదటిసారి కావటం విశేషం.
- 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 448 కి.మీ. పని ఇప్పటి వరకు రికార్డుగా ఉండగా, ఇప్పుడు దాన్ని అధిగమించటం విశేషం.

కాంక్రీట్ స్లీపర్లు, క్లాస్–1 పట్టాల మార్పుల్లోనూ వేగం

మొదట్లో ఇనుప స్లీపర్లు ఉండేవి. కొన్నేళ్లుగా కాంక్రీట్ స్లీపర్లు వాడుతున్నారు. ఇప్పుడు వాటి బేస్ మరింత వెడల్పుగా ఉండే రకం వి వినియోగిస్తున్నారు. వీటి బరువు చాలా ఎక్కువ. పాతరకం వాటితో పోలిస్తే వీటి మన్నిక కూడా ఎక్కువ. వీటిని మనుషులతో అమర్చడం కష్టంతో కూడుకున్న పని. ఆ స్లీపర్లు విరిగిపోయే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇటీవల ప్లాసర్ క్విక్ రిలేయింగ్ సిస్టం మెషీన్లను దక్షిణ మధ్య రైల్వే సమకూర్చుకుంది. ఇది స్లీపర్లను వేగంగా, విరిగిపోయే ప్రమాదం లేకుండా అమరుస్తుంది. అలాగే పాత రెయిల్స్ (పట్టాలు) తొలగించి వాటి స్థానంలో క్లాస్–1 పట్టాలను అమరుస్తున్నారు. ఆ పనిని కూడా ఇదే యంత్రంతో చేయిస్తారు. పాయింట్లు, క్రాసింగ్స్ కోసం టీ–28యంత్రాలను వాడుతున్నారు. టై టాంపింగ్ మెషీన్, యునిమాట్, ఎంపీటీ, హై ఔట్‌పుట్ బలాస్ట్ క్లీనింగ్ మెషీన్, షోల్డర్ బలాస్ట్ క్లీనింగ్ మెషీన్, బలాస్ట్ రెగ్యులేటింగ్ మెషీన్, బీఆర్‌ఎం, డీటీఎస్.. లాంటి మొత్తం 14 రకాల 163 యంత్రాలు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్నాయి. దీంతో పనుల్లో వేగం పెరిగింది. గతంలో ఎన్నడూ లేనంత వేగంతో పనులు చేయటంతో రికార్డు స్థాయి నిడివిలో ట్రాక్ రెన్యువల్స్ జరుగుతున్నాయి.

ప్రయాణ సమయం కూడా ఆదా

ట్రాక్ రెన్యువల్స్ తర్వాత నాలుగైదు రోజుల పాటు ఆ ప్రాంతంలో రైళ్లు తక్కువ వేగంతో వెళ్లాల్సి ఉంటుంది. మానవవనరులతో పనులు చేసిన సందర్భాల్లో రైళ్లు గంటకు 20కి.మీ. వేగంతో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు యంత్రాలతో చేయటం వల్ల 30 కి.మీ. వేగంతో వెళ్లినా ఇబ్బంది లేకుండా ఉంటోందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల రైళ్ల ప్రయాణ సమయం ఆదా అవుతుందని చెబుతున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.